www.prajapakasham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

సంపుటి 09, సంచిక: 51 | సోమవారం | 19-01-2026 | కరీంనగర్

Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00

PRAJAPAKSHAM ★★★




అమెరికా అపహరించిన వెనిజులా అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణికి సంఘీభావంగా సభా ప్రాంగణంలో బ్యానర్

# అరుణకాంతులీనిన ఖమ్మం



ఆకర్షణీయంగా జరిగిన జన సేవాదళ్ కవాతు దృశ్యం



ఖమ్మంలో సిపిఐ నూరేళ్ల ఉత్సవాల ముగింపు సభకు హాజరైన లక్షలాది ప్రజానీకంలో ఒక భాగం

## రక్తతర్పణ చేసిన పార్టీ సిపిఐ

### ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటన

**(బొమ్మగాని కిరణ్‌కుమార్)**

**ఖమ్మం :** దేశ స్వాతంత్ర్యోద్యమంలో, నవ భారత నిర్మాణంలో ముఖ్య పాత్ర పోషించిన భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకోవడం ఒక చరిత్ర అని, అందులో భాగమైన ప్రతి కమ్యూనిస్టుకు ఇది గర్వకారణమని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా ఉద్ఘాటించారు. వందేళ్ల ప్రయాణం మహత్తరమైనదని, గొప్ప త్యాగాల భరితమైనదని శ్లాఘించారు.మరో వైపు స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని, వలసపాలకులతో చేతులు కలిపిన ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవాలు పూర్తి చేసుకోవడం చరిత్రలో వైరుధ్యమని ఆయన ఎద్దేవా చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంతగా, మరో హిట్లర్‌గా మారారని, ఆయనకు, అమెరికా సామ్రాజ్యవాద శక్తి ముందు లొంగిపోయిన మోదీ ప్రభుత్వం అంతర్జాతీయంగా భారతదేశానికి ఉన్న గౌరవాన్ని కోల్పోయేలా చేస్తోందని మండిపడ్డారు. పాలస్తీనా, వెనిజులా విషయంలో సరైన స్పందన లేకపోవడం, రష్యా నుంచి చమురు కొనుగోలు చేయవద్దన్న ట్రంప్ ఆజ్ఞలకు తలొగ్గటం ఇందుకు నిదర్శనమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాలు ముగింపు సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంలో ఆదివారం భారీ బహిరంగ సభ జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా డి.రాజా, ప్రత్యేక అతిథిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. క్యూబా, డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా, వియత్నాం, వెనిజులా, పాలస్తీనా, నేపాల్ దేశాల కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు హాజరై, అభినందన సందేశాలను వినిపించారు. వేదికపై సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అమర్‌జీత్ కౌర్, రామకృష్ణ పాండ, అన్నీ రాజా, పల్లా వెంకట్ రెడ్డి, పి.సందోష్‌కుమార్, ప్రకాశ్‌బాబు, కె.రామకృష్ణ, గిరిశ్ శర్మ, కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, కేరళ రాష్ట్ర కార్యదర్శి బినొయ్ విశ్వం, ఎపి రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య, జాతీయ కార్యవర్గ సభ్యులు ఆసీనుల



య్యారు. సిపిఐ వెటరన్ నాయకులు, ఖమ్మం ఉద్యమ నిర్మాత , మాజీ ఎంఎల్‌ఏ పువ్వాడ నాగేశ్వరరావు సభికులకు అభివాదం చేశారు.

**దేశ పరిరక్షణకు మరో పోరాటం**

తొలుత బహిరంగసభను ఉద్దేశించి రాజా ప్రసంగిస్తూ 1925 డిసెంబర్ 26న ఉత్తర్‌ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో సిపిఐ ఆవిర్భవించిన నాడు భారత దేశం బ్రిటీష్, ఫ్రెంచ్, పోర్చుగీస్ వలస వాదుల పాలనలో మగ్గుతున్నదని, పార్టీ పుట్టుకతోనే భారతదేశానికి సంపూర్ణ స్వరాజ్యం, (స్వాతంత్ర్యం) కావాలని ప్రకటించిన తరువాయి 2లో

## సమష్టి పోరాటంతోనే ప్రజాస్వామ్యం బతుకుతుంది

### సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశం




**(కె.సంతోష్‌కుమార్)**

**ఖమ్మం :** ''దేశంలో పేదల హక్కులు, ప్రజాస్వామ్య విలువలు తీవ్ర ప్రమాదంలో ఉన్నాయి. ప్రస్తుతం దేశంలో ఉన్న పరిస్థితుల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు అనే తేడా లేకుండా ప్రజాస్వామ్యాన్ని కోరుకునే ప్రతి ఒక్కరూ ఏకమవ్వాలి. ప్రస్తుత పరిస్థితులు పార్టీ రాజకీయాలకు సమయం కాదు. ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన సమయం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు సహా ప్రజాస్వామ్యాన్ని నమ్మే శక్తులన్నీ ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సమష్టి పోరాటం చేసినప్పుడే ప్రజాస్వామ్యం బతుకుతుంది. ఇందు కోసం మోదీ ఫాసిస్టు ప్రభుత్వాన్ని గద్దె దించాలి. అందుకు మనందరం కలిసి పోరాడాలి'' అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారి కంటే బిజెపి ప్రమాదకరమని, నాటి బ్రిటిష్ వారి మాదిరిగా బిజెపి అంటే బ్రిటిష్ జనతా పార్టీగా మారి ప్రజలను విభజించు పాలించు నినాదంతో ముందుకు పోతోందని విమర్శించారు. రానున్న రోజుల్లో బిజెపికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని సిఎం కోరారు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా వందేళ్లుగా ఎర్రజెండా అడ్డంగా నిలబడి పోరాటం చేస్తోందని, రానున్న వంద సంవత్సరాలు కూడా పేద ప్రజల కోసం, ఆదివాసీల కోసం, తండాల్లో, పల్లెల్లో తుది శ్వాస వరకూ నిరంతరం పోరాడతామని కమ్యూనిస్టులు చేసిన ప్రతిజ్ఞ దేశానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. ఖమ్మం నగరంలో ఆదివారం జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి పాల్గొని సందేశమిచ్చారు. ఈ వేదిక మీద నుంచి ఈ రాష్ట్రమే కాదు దేశాన్ని పట్టి పీడిస్తున్న మతతత్వ శక్తులను ఓడించడానికి మనందరం ప్రతిజ్ఞ చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకోవడం గర్వకారణమని, నిజమైన స్వేచ్ఛ అంటే దోపిడీ లేని సమాజం అని, కమ్యూనిస్టులు కలగన్న స్వేచ్ఛ అని సిఎం అన్నారు. భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ చేయనున్న ప్రతీ పోరాటానికి సిపిఐ శ్రేణులు సహకరించాలని తరువాయి 2లో

## అన్ని జెండాలూ ఒకే జెండా అవ్వాలి

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

'అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏదో ఒక రోజు ఒక్క చోటకు రావాలి. ఒక్క జెండా కిందికి రావాలి. అంతిమంగా అన్ని జెండాలు కలిసి ఒక్క జెండా అవ్వాలి' అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. ముందు సిపిఐ, సిపిఐ(ఎం) కలవాల్సిన అవసరం ఉందని, ఈ రెండు పార్టీలు కలిసిన తర్వాత మిగిలిన అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఏకం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తద్వారా ఢిల్లీలోని ఎర్రకోట పైన ఎర్రజెండా ఎగిరే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. మనమంతా ఒక్కసారి పునరాలోచన చేసుకుందామని, అందరం కలిసి ఆలోచన చేస్తే చిన్న చిన్న అభిప్రాయ భేదాలు, సిద్ధాంత వైరుధ్యాలు ఉన్నా పరిష్కారం అవుతూనే వచ్చాయని గుర్తు చేశారు. మావోయిస్టు సోదరులు భిన్నమైన ఎజెండాతో ఉన్నప్పటికీ వారు కూడా ఆలోచన చేయాలని కూనంనేని సాంబశివరావు బహిరంగ సభ వేదిక ద్వారా పిలుపునిచ్చారు. అప్పటివరకు ఐక్యత కోసం పోరాటం కొనసాగిస్తునే




ఉంటామని తెలిపారు. ఆ ఐక్యత లేకపోతే ఇవాళా అపరేషన కగార్ అనో, ఇంకో పేరుతోనో నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మానవ హననానికి పాల్పడుతూనే ఉంటుందని ఆయన హెచ్చరించారు. దీనికి పరిష్కారం ఒక్కటేనని, తరువాయి 2లో

## కదం తొక్కిన కామ్రేడ్స్

- ఎర్రబారిన ఖమ్మం
- నభూతో న భవిష్యత్‌లా జనసేవాదళ్ కవాత్
- ఆకట్టుకున్న కళారూపాలు

**(ఏనుగు వెంకటేశ్వరరావు)**

**ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ సందర్భంగా ఖమ్మంలో కామ్రేడ్స్ కదం తొక్కారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పార్టీ కార్యకర్తలతో ఖమ్మం పుర వీధులు కిటకిటలాడాయి. ప్రతి ఒక్కరూ అరుణ పతాకాన్ని చేతబూని ఎర్రని వస్త్రాలు ధరించి ఖమ్మంకు తరలి రావడంతో ఖమ్మం ఎర్రబారింది. ఉదయం ఎనిమిది గంటల నుంచే సుదూర ప్రాంతాల నుంచి పార్టీ కార్యకర్తలు ఖమ్మం చేరుకున్నారు. నాగపూర్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాల నుంచి కూడా పార్టీ కార్యకర్తలు సభకు హాజరయ్యారు. ఖమ్మం నగరంలోని ప్రధాన



**మేము సైతం..** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా కవాతులో పాల్గొన్న బాలసంఘం సభ్యులు

రహదారులన్నీ కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తల రాకతో దిగ్బంధించబడ్డాయి. ఎటు చూసినా అరుణ పతాక రెపరెపలే కనిపించాయి. ఖమ్మం నగరంలోకి చేరుకునేందుకు ట్రాఫిక్ జామ్ కావడంతో తరువాయి 2లో

## పొట్లపూర్ ఎత్తిపోతలకు కేబినెట్ ఆమోదం

03

**ములుగు:** ములుగు జిల్లాకు సాగునీరు అందించే పొట్లపూర్ ఎత్తిపోతల పథకానికి తెలంగాణ కేబినెట్ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ వెలుపల కేబినెట్ సమావేశం జరగడం ఇదే మొదటిసారి. సుమారు రెండు గంటలపాటు సాగిన ఈ సమావేశంలో పలుకీలక అంశాలపై చర్చ జరిగింది. అనంతరం మేడారం ప్రధాన ద్వారం వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రివర్గ సహచరులతో కలిసి పాల్గొన్న మంత్రి సీతక్క మాట్లాడుతూ ఈ ప్రాజెక్టుకు 143 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్టు ప్రకటించారు. జిల్లాకు సాగునీరు అందించాలన్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కాగా, మున్సిపల్ ఎన్నికలు, జిల్లాల పునర్విభజన వంటి కీలక అంశాలపై కేబినెట్‌లో చర్చ జరిగింది. గోదావరి పుష్కరాలకు శాశ్వత ప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని కూడా కేబినెట్ నిర్ణయించింది. కాగా, మేడారం సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. రామప్ప చెరువు నుంచి లక్నవరం పైప్‌లైన్ ద్వారా మేడారానికి నీటి సరఫరా చేయనున్నట్టు ప్రకటించారు.




ఖమ్మంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది ఉత్సవాల ముగింపు సభావేదిక నుండి అభివాదం చేస్తున్న సిపిఐ నాయకులు, అతిథులు, విదేశీ సౌహార్ద్ర ప్రతినిధులు



## పోర్చుగల్‌లో త్రిముఖ పోటీ

**లిస్బన్ :** యూరప్ నైరుతీప్రాంతదేశం పోర్చుగల్‌లో అధ్యక్ష పదవికి ఆదివారం ఎన్నికలు జరిగాయి. పెద్దసంఖ్యలో ప్రజలు పోలింగ్ బూత్‌లవద్ద క్యూలు కట్టి ఓట్లు వేశారు. ముగ్గురు అభ్యర్థులమధ్య ప్రధానంగా పోటీ జరుగుతోంది. సోషల్ డెమోక్రటిక్‌పార్టీ (పిఎస్‌డి) నాయకుడు మార్క్వెస్ మెండెస్, సోషలిస్టు పార్టీ నాయకుడు ఆంటోనియో జోస్ సెగురో, మితవాద పార్టీ నాయకుడు ఆండ్రే వెంచురా అధ్యక్ష పదవికి ప్రధానంగా పోటీలో ఉండగా మొత్తం 45 మంది అధ్యక్ష పదవి రేసులో ఉన్నారు. రెండో విడత ఎన్నికలకు ఎక్కువగా అవకాశాలున్నాయి. ఈ రెండు విడతల్లోనూ చెగా పార్టీ నాయకుడు వెంచురా ఖచ్చితంగా పోటీలో ఉండే అవకాశం ఉంది. దేశాధ్యక్షుడికి తాత్కాలికమైన అధికారాలే ఉన్నప్పటికీ కీలకమైన కష్టకాలంలో అధ్యక్షుడిదే పైచేయిగా ఉంటుంది.

## గత ఏడాది శ్రీలంక పర్యాటకుల్లో భారత్‌దే అగ్రస్థానం

**కొలంబో :** గత ఏడాది శ్రీలంక దేశాన్ని సందర్శించిన పర్యాటకుల్లో అగ్రస్థానం భారతీయులకే దక్కింది. భారతదేశం నుండి 5,31,511 మంది పర్యాటకులు శ్రీలంకలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. గత ఏడాది 20.30 లక్షల మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. ఏటికేడాది పర్యాటకుల అభివృద్ధిని గమనిస్తే 15 శాతం పెరిగింది. భారత్ తర్వాత బ్రిటన్ దేశీయులు రెండోస్థానంలో ఉన్నారు. మొత్తంగా చూసినప్పుడు డిసెంబరునెలలో అత్యధికంగా 3,58,928 మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. యూరప్, ఆసియా పసిఫిక్ ప్రాంతాల నుండి 92.67 శాతం మంది శ్రీలంకను సందర్శించి తమ ఆధిక్యత ప్రదర్శించారు. ఒక్క యూరప్ నుండే 51.3 శాతం మంది వెళ్ళారు. కాగా ఈ కొత్త సంవత్సరం 2026లో ఇప్పటివరకూ మొత్తం 1,31,898 మంది పర్యాటకులు శ్రీలంకను సందర్శించారు. రోజువారీగా చూసినప్పుడు జనవరి 15వ తేదీన అత్యధికంగా 10,483 మంది పర్యాటకులు శ్రీలంకలో పర్యటించారు. అధికారులు ఈ సమాచారాన్ని విడుదల చేశారు. ఈ కొత్త సంవత్సరంలో భారత్ నుండి 23,786 మంది, రష్యా నుండి 14,785 మంది పర్యాటకులు, బ్రిటన్ నుండి 12,166 మంది, జర్మనీ నుండి 9,260 మంది శ్రీలంకను సందర్శించారు.

## ఖమేనీపై దాడి పూర్తి యుద్ధం ప్రకటనే ట్రంప్‌కు ఇరాన్ అధ్యక్షుడు హెచ్చరిక

**టెహ్రాన్ :** ఇరాన్ సర్వాధినేత ఆయెుతొల్లా అలీ ఖమేనీపై ఏ విధమైన దాడి చేసినా అది ఇరాన్‌పై పూర్తిస్థాయీ యుద్ధం ప్రకటించినట్లే అవుతుందని ఆ దేశాధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన తాజా వ్యాఖ్యలకు పెజెష్కియన్ పైవిధంగా సమాధానం చెప్పారు. ''మా దేశ గొప్ప నాయకుడిపై దాడి చేయడం పూర్తిస్థాయీ యుద్ధం ప్రకటించడంతో సమానం'' అని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ''ఖమేనీ వ్యాధిగ్రస్తుడైన నాయకుడు, ఇక ఇరాన్ ప్రత్యామ్నాయ నాయకుణ్ణి చూసుకోవడానికి ఇదే సరైన సమయం'' అని పొలికోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ అన్నారు. ఇరాన్‌లో ఖమేనీ పాలనను అంతం చేయాలని ట్రంప్ చెప్పడం ఇదే మొదటిసారి.

# ట్రంప్ సుంకాలు అతిపెద్ద తప్పిదం

### యూరప్ దేశాల ఆగ్రహం



**బ్రస్సెల్స్ :** గ్రీన్‌లాండ్ స్వాధీనాన్ని వ్యతిరేకించినవారిపై ఫిబ్రవరి ఒకటో తేదీ నుండి 10 శాతం అదరనె సుంకాలు అమలు చేస్తామని ట్రంప్ ప్రకటించడంపై యూరప్ దేశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఇలా సుంకాలు విధించడం అతిపెద్ద తప్పిదమని ఇటలీ ప్రధానమంత్రి మెలోనీ విమర్శించారు. ట్రంప్ సుంకాలు ఎంతమాత్రం సమ్మతింప సాధ్యం కాదని ఫ్రాన్స్ ప్రధానమంత్రి మేక్రాన్ విమర్శించారు. ఈ విషయంలో తదుపరి చర్యలపై యూరోపియన్ మిత్రులతో ఆయన చర్చలు జరుపుతున్నారని పారిస్‌లోని అధ్యక్ష కార్యాలయం తెలిపింది. ఈ సుంకాలు బ్రిటన్ ఆర్థిక వ్యవస్థపై తీవ్రభావం చూపిస్తాయని ఇంటర్నేషనల్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి క్రిస్‌వర్త్ (యుకె) హెచ్చరించారు. ఈ సుంకాల వల్ల ఎవరికీ ప్రయోజనం లేదని ఫిన్లాండ్ ప్రధానమంత్రి పెట్టేరీ ఓర్పో అన్నారు. దీనివల్ల యూరప్–అమెరికా రెండూ నష్టపోతాయన్నారు. సమస్యలను కూర్చుని చర్చించుకుని పరిష్కరించుకుందామన్నారు.

దిగుమతి సుంకాలు పెంచడంవల్ల సరుకు విలువ అమాంతం పెరిగిపోతుంది. ఈ సుంకాలవల్ల ఉదాహరణకు 10 డాలర్లు విలువైన ఒక వస్తువు ఖరీదు 11 డాలర్లకు పెరుగుతుంది. విదేశీ వస్తువులు దిగుమతి చేసుకునే కంపెనీలే ప్రభుత్వానికి పన్నులు ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. తన సొంత మిత్రులతోనే ట్రంప్ ఆర్థిక యుద్ధం చేస్తున్నారని అంతర్జాతీయ పత్రికలు వ్యాఖ్యానాలు రాశాయి. బ్రిటన్ ప్రధానమంత్రి స్టార్మర్‌తో ఇప్పుడు ట్రంప్ సంబంధాలు కూడా మరింత సమస్యల్లో పడ్డాయని రాశాయి. రష్యా, చైనాలను బెదిరించి వాటి నోరు మూయించేందుకు ఏర్పాటు చేసిన వ్యూహాత్మక నాటో కూటమిలో చిచ్చు రేపిన గ్రీన్‌లాండ్ సమస్యపై ఒకవైపు అక్కడి ప్రజలు నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తుండగా, యూరోపియన్ యూనియన్ దేశాల దౌత్యవేత్తలు ట్రంప్ వైఖరిపై చర్చించేందుకు ఆదివారం పొద్దుపోయాక అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎనిమిది యూరోపియన్ యూనియన్ దేశాలపై పది శాతం సుంకాలు విధించడాన్ని ఆ దేశాలు తీవ్రంగా ఖండించాయి. డెన్మార్క్, నార్వే, స్వీడన్, ఫ్రాన్స్, జర్మనీ, బ్రిటన్, నెదర్లాండ్స్, ఫిన్లాండ్ దేశాలపై దిగుమతి సుంకాలు పెంచుతామని ట్రంప్ బెదిరించారు. గ్రీన్‌లాండ్ ప్రజలకు, గ్రీన్‌లాండ్ రక్షణకు యూరప్ దేశాలు తమ నిబద్ధతను ప్రకటించి డెన్మార్క్‌కు మద్దతుగా సైన్యాన్ని మోహరించేందుకు కూడా సిద్ధం రావడంతో ఈ ఒక్క వివాదమే అనేక వివాదాలకు ఆజ్యంపోసే ప్రమాదకర సమస్యగా మారుతున్నది.

**ట్రంప్‌పై యూరప్ ఒత్తిడి ప్రభావం!**

చైనా, రష్యాలను బెదిరించి అదుపులో పెట్టే లక్ష్యంగా ఏర్పాటు చేసిన నాటో కూటమి దేశాలు తమ తమ భూభాగాలలో ఉన్న సైనిక స్థావరాలను తొలగిస్తామని హెచ్చరించడం ద్వారా గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్‌పై ప్రభావం చూపించే అవకాశాలు ఉంటాయని ''ద ఎకనామిస్ట్'' విశ్లేషణను టాస్ వార్తా సంస్థ ప్రచురించింది. మొదట ఒకమాట, తర్వాత మరోమాట మార్చే ట్రంప్ ఈ ఒత్తిడికి తలొగ్గే అవకాశాలుంటాయని పేర్కొంది.

యూరోపియన్ సైనిక స్థావరాల అసరా, అండదండలు లేకుండా అమెరికా సైన్యం ఆఫ్రికాలోగానీ, పశ్చిమ ఆసియాలోగానీ తన ప్రభావం చూపించలేదని 'ద ఎకనామిస్ట్' మ్యాగజైన్ ప్రకటించింది. అమెరికాతో యూరోపియన్ యూనియన్ దేశాలకు సంఘర్షణ జరిగే అవకాశం లేదని, యూరప్‌దేశాలకు తూర్పు వైపు నుండి బెదిరింపు పేరుతో సైనిక అవసరాలు, సైనిక వ్యయం విపరీతంగా పెరుగుతోందని, పైగా అమెరికా ఆయుధాలు, ఆమెరికా సైన్యం, అమెరికా రక్షణ పరిశ్రమల అవసరం కూడా యూరోపియన్ యూనియన్‌కు చాలా చాలా అవసరం ఉందని మ్యాగజైన్ విశ్లేషించింది.

## అల్లర్లలో 5వేల మంది మృతి
### ఇరాన్ అధికారి వెల్లడి



**టెహ్రాన్ :** ఇరాన్‌లో చెలరేగిన హింసాత్మక అల్లర్లలో ఇప్పటివరకూ సేకరించిన గణాంకాల ప్రకారం 5000 మంది మరణించినట్లు అధికారి ఒకరు రాయిటర్స్ వార్తా సంస్థకు ఆదివారం చెప్పారు. మృతుల్లో 500 మంది భద్రతా సిబ్బంది కూడా ఉన్నారని ఆయన చెప్పారు. టెర్రరిస్టులు, సాయుధులైన అల్లరిమూకలు అమాయకులైన ఇరాన్ ప్రజలను హత్యచేశారన్నారు. ఇరాన్ వాయువ్య ప్రాంతంలో కుర్దిష్‌లు అత్యధికంగా ఉండే ప్రాంతంలో ఎక్కువమంది హింసాత్మక ఘర్షణల్లో బలయ్యారని ఈ ప్రాంతంలో మృతుల సంఖ్య ఇంకా ఎక్కువగా పెరిగే అవకాశం ఉందని చెప్పారు. ఇరాన్ వాయువ్య ప్రాంతంలో కుర్దిష్‌లు చాలా క్రియాశీలంగా వ్యవహరిస్తారు. ఇజ్రాయెల్ దేశం జోక్యం వల్లే ఇరాన్‌లో అల్లర్లు చెలరేగుతున్నాయని ఆయన ఆరోపించారు. దేశంలో విదేశీయులు జోక్యం చేసుకుంటున్నారని ఇరాన్ ప్రభుత్వం తరచు ఆరోపణలు చేస్తోంది. అమెరికా కేంద్రంగా పనిచేసే హెచ్‌ఆర్ఎఎన్ఎ సంస్థ ప్రకారం ఇరాన్‌లో ఇప్పటివరకూ 24,000 మంది ప్రదర్శకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. 3,800 మంది ఇప్పటికే మరణించారనీ, మరో 4,382 కేసులను పరిశీలించి మరణాల సంఖ్యను ధృవీకరిస్తామని హెచ్‌ఆర్ఎఎన్ఎ సంస్థ ప్రకటించింది.



## మిన్నెపొలిస్‌లో అల్లర్ల అణచివేతకు బలగాలు సిద్ధం

**వాషింగ్టన్ :** అమెరికా మిన్నెసోటాలో గడచిన 11 రోజులుగా అల్లర్లు ఆగడం లేదు. అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ట్రంప్ పాలనాయంత్రాంగం అదనంగా 1500 మంది ఆర్మీ పారాట్రూపర్లను తరలించేందుకు సన్నాహాలు చేసింది. ఐతే వారిని తక్షణం తరలించేందుకు ట్రంప్ ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. మిన్నెపొలిస్‌లో జనవరి 7వ తేదీన స్థానిక మహిళ రెనీగుడ్ (37) అనే మహిళను వలస నియంత్రణ ఐసిఇ అధికారి ఒకరు అతి సమీపం నుండి అమానుషంగా కాల్చి చంపిన తర్వాత మిన్నెసోటాలో అల్లర్లు మొదలయ్యాయి. ఈ ప్రాంతం నుండి ఫెడరల్ పోలీసులను తరలించాలని, వారి పెత్తనాన్ని సహించేది లేదని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ అనుసరిస్తున్న వలస విధానాన్ని కూడా ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇక్కడి అల్లర్లు అణచివేసేందుకు 1500 మంది పారాట్రూపర్లను ట్రంప్ సిద్ధం చేశారు. మిన్నెపొలిస్ నగర వీధుల్లో గడచిన 11 రోజులుగా దాదాపు యుద్ధ వాతావరణం నెలకుని ఉంది. హింసాత్మక అల్లర్లు చల్లారడంలేదు. దీంతో ఆర్మీని మోహరించేందుకు ట్రంప్ ఆలోచన చేశారు.



## సెర్బియాలో వేలాదిమంది భారీ ప్రదర్శన

**నోవిసాద్ :** సెర్బియాలో సంస్కరణలు చేపట్టాలని, తక్షణం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఏడాదిపైగా కొనసాగిన అల్లర్లు, ప్రదర్శనలు కొత్త సంవత్సరంలో కూడా కొనసాగుతున్నాయి. దేశాధ్యక్షుడు అలెక్‌సాండర్ ఉసి పరిపాలనకు వ్యతిరేకంగా చేసిన పోరాటాన్ని మరో దశ ముందుకు తీసుకువెళతామని, దేశంలో సమూల సంస్కరణలు చేపట్టాలని కోరుతూ సెర్బియా యూనివర్సిటీ విద్యార్థులు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. రాజధాని నోవిసాద్‌లో వేలాదిమందితో ప్రదర్శన జరిగింది. దేశంలో పాలకులే విపరీతమైన అవినీతికి పాల్పడుతున్నారని విద్యార్థులు నినాదాలు చేశారు. ఇదే నినాదంతో గడచిన నవంబరులో కూడా సెర్బియాలో ఉద్ధృతంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ నగరంలో నవంబరులో జరిగిన అల్లర్లలో 16 మంది మరణించారు. దీంతో దేశవ్యాప్తంగా ఉద్యమం ఉద్ధృతరూపం దాల్చింది. దేశంలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని ప్రదర్శకులు కోరుతుండగా అధ్యక్షుడు ఉసి అందుకు తిరస్కరించారు. దేశంలో తక్షణం ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ తమ నినాదానికి మద్దతుగా 4,00,000 మంది సంతకాలు విద్యార్థులు సేకరించారు. ఈనెల 27వ తేదీన బెల్గ్రేడ్‌లో భారీ నిరసన ప్రదర్శన చేపట్టేందుకు విద్యార్థులు ప్రణాళిక చేశారు.

# రక్తతర్పణ చేసిన పార్టీ సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

పార్టీ సిపిఐ అని అన్నారు. భారత దేశం స్వాతంత్ర్యం కోసం, దాని పరిరక్షణ కోసం కమ్యూనిస్టులు పోరాడారని, స్వాతంత్ర్య అనంతరం కూడా నవ భారత కోసం కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ఏర్పాటు చేయాలని కమ్యూనిస్టులు కోరారని, ప్రధాని నెహ్రూ అందుకు అంగీకరించారని, పిఎస్‌యులతో పాటు పంచవర్ష ప్రణాళికను కూడా అమలు చేశారని అన్నారు. ఇప్పుడు మోదీ ఆశ్రిత పెట్టుబడిదారులకు లొంగిపోయారని, ఇప్పుడు మరోసారి కమ్యూనిస్టులుగా దేశాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని, ఇందుకు కలిసొచ్చే వారితో కలిసి పోరాడాలి అని రాజా పిలుపునిచ్చారు.

**దేశ స్వాతంత్ర్యంలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటి?**

భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో అగ్రభాగాన నిలిచిన రెండు పార్టీలు కాంగ్రెస్, సిపిఐ వందేళ్ళు పూర్తిచేసుకున్నాయని రాజా అన్నారు. 1885లో ఏర్పడిన భారత జాతీయ కాంగ్రెస్ 140 ఏళ్ళు, సిపిఐ వందేళ్లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ సైతం వందేళ్ల ఉత్సవాలు నిర్వహించుకోవడం చరిత్రలోని వైరుధ్యమని వ్యాఖ్యానించారు. ''దేశ చరిత్రలో ఆర్ఎస్ఎస్ పాత్ర ఏమిటని నేను ప్రశ్నిస్తున్నాను. స్వాతంత్ర్యపోరాటంలో మీరు పాల్గొన్నారా? అని ఆర్ఎస్ఎస్– బిజెపి నాయకులను ప్రశ్నించండి. వలస పాలకులతో చేతులు కలిపి వారు పని చేశారు. ఆర్ఎస్ఎస్ వారు ఏనాడూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనలేదు'' అని రాజా విమర్శించారు. వలస పాలన నుంచి దేశానికి విముక్తి కల్పించినందుకు సిపిఐ, కాంగ్రెస్‌లు గర్వపడుతున్నాయన్నారు.

కమ్యూనిస్టులు స్వాతంత్ర్యా నంతరం కూడా ప్రజల పక్షాన పోరాటాలు చేశారని, కేవలం భారతదేశ విముక్తి పోరాటమే కాకుండా ప్రపంచంలో ఎక్కడ విముక్తి పోరాటాలు జరిగినా అండగా నిలచారన్నారు. మనం కేవలం కమ్యూనిస్టులమే కాదని, అంతర్జాతీయవాదులమని స్పష్టం చేశారు.

**ప్రపంచ దేశాలనే బెదిరిస్తున్న ట్రంప్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక నియంతగా మారారని, మరో హిట్లర్ అయ్యారని రాజా విమర్శించారు. భారతదేశాన్ని ఆయన నియంత్రిస్తే కమ్యూనిస్టులుగా ఊరుకోబోమని రాజా సవాలు చేశారు. ట్రంప్ వెనిజులాపై యుద్ధం ప్రకటించారని, ఎన్నికైన, సార్వభౌమ దేశ అధ్యక్షుడు, ఆయన సతీమణిని అపహరించుకొని వెళ్ళారని మండిపడ్డారు. తరువాత మెక్సికో, కొలంబియా, క్యూబా దేశాల సంగతి చూస్తానని బెదిరిస్తున్నారని అన్నారు. వెనిజులా పరిస్థితులపై భారతదేశం మాట్లాడకపోవడం దారుణమన్నారు.

**మోదీ ప్రభుత్వం విఫలం :** మోదీ తాను మానవ మాత్రుడను కాదని అంటుంటారని, ఆయన 56 ఇంచుల ఛాతి ఉందని అంటారని, మరి రష్యా నుంచి భారతదేశం చమురు కొనవద్దని ట్రంప్ శాసిస్తుంటే మోదీ ఎందుకు తలవంచారని రాజా మండిపడ్డారు.అలీనోద్యమ స్థాపకులలో ఒకటిగా భారతదేశానికి గతంలో అంతర్జాతీయంగా మంచి గౌరవం, ప్రపంచ దేశాలలో గుర్తింపు ఉండేదని అన్నారు. మోదీ అధికారంలోకి వచ్చాక భారతదేశానికి అంతర్జాతీయ గౌరవం పోయిందని విమర్శించారు. అమెరికా సామ్రాజ్యవాద శక్తికి లొంగిపోవద్దని మోదీని డిమాండ్ చేశారు. ఇలాగే కొనసాగితే మోదీకి అధికారంలో కొనసాగే హక్కు లేదని, మోదీ ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి దింపేంత వరకు పోరాడుతామన్నారు. ఇష్టానుసారం వ్యవహరిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

**పాలస్తీనా విషయంలో ట్రంప్‌కు లొంగిపోయారు :** పాలస్తీనాలో ప్రజలు ఊహకందని బాధలు, కష్టాల పాలవుతున్నారని, మహిళలు, చిన్నారులను ఇజ్రాయెల్ బలగాలు ఊచకోత కోస్తున్నాయని రాజా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయెల్‌కు ట్రంప్ మద్దతు ఇస్తున్నాడని, పాలస్తీనా సమస్య పరిష్కారానికి రెండు దేశాల విధానానికి అనుకూలంగా ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానాన్ని, యుఎన్ చార్టర్‌ను, అంతర్జాతీయ చట్టాలను తృణీకరిస్తున్నారని అన్నారు. వలసపాలన కాలంలోనే పాలస్తీనాకు గాంధీ అండగా నిలబడ్డారని, ఆంగ్లేయులకు బ్రిటీష్ ఎలా చెందుతుందో ఫ్రెంచ్ వారికి ఫ్రాన్స్ ఎలాగో, ఆరబ్ మాట్లాడే వారికి పాలస్తీనా చెందుతుందని ఆనాడే అన్నారని గుర్తు చేశారు. మన దేశానికి పాలస్తీనా విమోచన నాయకుడు యాసర్ అరాఫత్ ఎంతో సన్నిహింగా ఉండేవారని, భారత ప్రభుత్వం, ప్రజలు సంఘీభావంగా ఉండేవారని, ఇప్పుడు మోదీ ప్రభుత్వ విధానం మారిపోయిందన్నారు.

సభకు సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభ ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి బాగం హేమంతరావు స్వాగతం పలుకగా, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రావుల వెంకయ్య, అక్కినేని వనజ, తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కెళ్ళపల్లి శ్రీనివాసరావు, ఇ.టి.నర్సింహా, కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, కలవేన శంకర్, బాలనర్సింహా, వి.ఎస్.బోస్, కంట్రోల్ కమిషన్ చైర్మన్ మౌలానా, తదితరులు వేదికపై ఉన్నారు. చివర్లో సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేశ్ వందన సమర్పణ చేశారు.

# ప్రజాస్వామ్యం బతుకుతుంది

(మొదటి పేజీ తరువాయి)

కోరారు.

జాతీయ ఉపాధి హామీ పథకం వల్ల గ్రామీణ పేదలకు ఉపాధి లభించిందని, అది గ్రామీణ పేదలకు జీవనాధారమని, అయితే ప్రధాని మోదీ ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసి గ్రామాల నుంచి రైతులు, రైతు కూలీలు మళ్లీ పట్టణాలకు వలసలు పెరిగే పరిస్థితి తెచ్చిందని ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు. వలసల తో పేదలు మళ్లీ వెట్టిచాకిరి, దోపిడీకి గురవుతారని సిఎం హెచ్చరించారు. గత ఎన్నికల్లో బిజెపి 400 సీట్లు అడగడం వెనుక రాజ్యాంగాన్ని మార్చాలనే ఉద్దేశం ఉందని, రిజర్వేషన్లు రద్దు చేసే ప్రమాదం ఉందనే విషయాన్ని దేశవ్యాప్తంగా ప్రజలను అప్రమత్తం చేసి బిజెపిని 240 సీట్లకు పరిమితం చేసిన ఘనత కాంగ్రెస్, కమ్యూనిస్టులు, రాహుల్ గాంధీ నాయకత్వానిదేనని అన్నారు. ఆధార్, ఎస్ఐఆర్ పేరుతో పేదల ఓటు హక్కును తొలగించే కుట్ర జరుగుతోందని విమర్శించారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మహాత్మా గాంధీ పేదల చేతుల్లో ఓటు అనే ఆయుధం పెట్టారని, అదే ఆయుధాన్ని లాక్కోవడానికి బిజెపి ప్రయత్నిస్తోందని అన్నారు. ఓటు హక్కు పోతే రేషన్, ఇల్లు, పెన్షన్, అన్నిసంక్షేమ పథకాలు పోతాయని హెచ్చరించారు. అడవుల్లో నివసించే ఆదివాసీలు ఆధారాలు ఎక్కడి నుంచి తెచ్చుకుంటారని సిఎం ప్రశ్నించారు.

**కాంగ్రెస్, కమ్యూనిస్టుల పోరాటాలతోనే...**

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసికట్టుగా పోరాడితేనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని గుర్తు చేశారు. పేదలు, ఆదివాసీలు, గిరిజనులు, రైతులు, రైతు కూలీలు, కార్మిక వర్గాల హక్కుల కోసం కమ్యూనిస్టులు సాగించిన వందేళ్ల పోరాట చరిత్ర దేశానికి స్వేచ్ఛ తీసుకొచ్చిందని సిఎం గుర్తు చేశారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీతో కలిసి కమ్యూనిస్టులు చేసిన పోరాటాలే భారత స్వాతంత్ర్యానికి పునాదులని అన్నారు. దున్నేవాడికే భూమి అనే నినాదంతో జరిగిన రైతాంగ ఉద్యమాల ఫలితంగానే గరిష్ట పరిమితి చట్టాలు వచ్చాయని, ఎనిమిది గంటల పని చట్టం, కనీస మద్దతు ధర, కార్మిక చట్టాలు కాంగ్రెస్ ప్రభుత్వాల ద్వారానే అమలయ్యాయని సిఎం తెలిపారు.

**ఖమ్మం జిల్లాలో బిజెపికి స్థానం లేదు :**

ఖమ్మం జిల్లాలో బిజెపికి స్థానం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు కలిసి వచ్చినా జిల్లాలో ఇద్దరు సర్పంచులను కూడా గెలిపించ చలేరని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. రానున్న రోజుల్లో బిజెపికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భాగస్వాములు కావాలన్నారు.

**సాయుధ పోరాటంతోనే హైదరాబాద్ రాష్ట్ర ఏర్పాటుకు బీజం పడింది**

కమ్యూనిస్టులు నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటమే నిజాం నిరంకుశ పాలనను కూలదోసి హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటుకు బీజం పడిందని, నేటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు పునాది వేసిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ''పరిస్థితులు ఎలా ఉన్నా.. ఎంత కఠినంగా ఉన్నా.. ఏనాడూ ఎర్రజెండా తలవంచదు. మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా నిర్విరామ పోరాటం సాగిస్తోంది. రజాకార్లకు, నిజాంకు వ్యతిరేకంగా సుదీర్ఘ సాయుధ పోరాటం సాగించారు. సాయుధ పోరాటంలో నాలుగు వేలమంది కమ్యూనిస్టులు ప్రాణాలుకోల్పోయారు. కమ్యూనిస్టు వీరుల త్యాగాలతోనే నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తికి బీజం పడింది'' అని రేవంత్ రెడ్డి అన్నారు.




# కదం తొక్కిన కామ్రేడ్స్

(మొదటి పేజీ తరువాయి)

కిలో మీటర్ల కొద్ది నడిచి కార్యకర్తలు ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల మైదానం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభా స్థలికి చేరుకున్నారు. వందలాది వాహనాల్లో పార్టీ కార్యకర్తలు తరలిరావడంతో ట్రాఫిక్ తీవ్ర అంతరాయం ఏర్పడింది. పెద్ద సంఖ్యలో యువత తరలి రావడం విశేషం. జనసేవాదళ్ కార్యకర్తలే కాకుండా బహిరంగ సభకు వచ్చిన వారిలో యువత ఎక్కువగా ఉన్నారు. క్రమశిక్షణగా మూడు కిలో మీటర్ల మేర నడిచి బహిరంగ సభా స్థలికి చేరుకున్న యువత నాయకుల ఉపన్యాసాలకు, ప్రజానాట్య మండలి పాటలకు అలిసి పోకుండా కేరింతలు కొట్టారు. వందేమాతరం శ్రీనివాస్ అలపించిన ఎర్రజెండా ఎర్రజెండా ఎన్నియాల్లో పాటకు యువత ఊగిపోయింది. పూనకం వచ్చినట్లుగా బహిరంగ సభా స్థలి మొత్తం అరుణ పతాకాలను ఊపుతూ ఒక సరికొత్త వాతావరణాన్ని సృష్టించారు. యువత ఊపు చూసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఒక్కింత ఆశ్చర్య పోయారు. యువత హాజరైన తీరు చూస్తుంటే వందేళ్లు కాదు మరో వందేళ్లయినా సమ సమాజం కోసం కమ్యూనిస్టు పార్టీ లక్ష్యం కోసం పోరాడతామన్న భావన స్ఫురిచింది. వందేళ్ల ఉత్సవాలు చూడాలని వందల కిలో మీటర్ల మేర ప్రయాణించి 70 నుంచి 80ఏళ్లు పైబడిన వృద్ధులు, గతంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసినా ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నాయకత్వం సభకు హాజరయ్యారు.

**మూడు ప్రదర్శనలు – వేల మంది జనం :**

బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రదర్శనలు నిర్వహించారు. మొదటి ప్రదర్శన పెవిలియన్ మైదానం నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జనసేవాదళ్ కార్యకర్తలు ఖమ్మం పురవీధుల్లో కదం తొక్కారు. వరుసుకు నలుగురు చొప్పున నిలబడిన ప్రదర్శన రెండు కిలో మీటర్ల మేర ఉండడంతో ప్రదర్శనను పెద్ద సంఖ్యలో నగర పౌరులు తిలకించారు. ముఖ్యంగా యువ మహిళల కవాతు ఆకట్టుకుంది. చిన్నారులు కదం తొక్కుతూ లెఫ్ట్ రైట్ అంటూ నడుస్తూ ఉత్తేజాన్ని ఇచ్చారు. పదేళ్ల లోపు బాలలు సైతం ప్రదర్శనలో పాల్గొని భవిష్యత్తు తరం మాదేనంటూ మరో వందేళ్లయినా కమ్యూనిస్టు పార్టీకి ఢోకా లేదని తమ కవాతుతో నిరూపించారు. జనసేవాదళ్ కార్యకర్తల కవాతుకు సిపిఐ అగ్ర నేతలు పల్లా వెంకటరెడ్డి, కూనంనేని సాంబశివరావు, గుజ్జుల ఈశ్వరయ్య, చాడ వెంకటరెడ్డి, నెల్లికంటి సత్యం, బాగం హేమంతరావు తదితరులు నేతృత్వం వహించారు. జనసేవాదళ్ కార్యకర్తల తర్వాత సింగరేణి కార్మికులు, యువ మహిళలు, పశ్య పద్మ నేతృత్వంలో నాగళ్లు చేతబూనిన రైతులు కోయ, లంబాడ, జానపద నృత్య కళాకారులు, వందలాది మంది డప్పు కళాకారులు ప్రదర్శనలో పాల్గొన్నారు. బతుకమ్మలతో మహిళలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆ తర్వాత న్యాయవాదులు, వైద్యులు, యువజన, విద్యార్థి సమాఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల కాలంలో ఏ రాజకీయ పార్టీ నిర్వహించని రీతిలో ప్రదర్శన సాగింది. ఖమ్మం నయాబజర్ కళాశాల నుండి మరో ప్రదర్శన ప్రారంభమైంది. నయాబజార్ కళాశాల నుండి ప్రారంభమైన ప్రదర్శన మయూరిసెంటర్, జెడ్పి సెంటర్, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. ఈ ప్రదర్శనకు రాష్ట్ర సహయ కార్యదర్శి తకెళ్లపల్లి శ్రీనివాసరావు, బోస్, కె. శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ తదితరులు నేతృత్వం వహించారు. మూడవ ప్రదర్శన శ్రీశ్రీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైంది. శ్రీశ్రీ విగ్రహం నుంచి రోటరీ నగర్, మమత రోడ్డు, ఇల్లందు క్రాస్ రోడ్డు మీదుగా సభా స్థలికి చేరుకుంది. జాతీయ సమితి సభ్యులు ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు నేతృత్వం వహించారు.

**ఉత్తేజాన్ని ఇచ్చిన సభ :**

సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఖమ్మంలో జరిగిన బహిరంగ సభ పార్టీకి నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. భవిష్యత్తు పోరాటాలకు ఊపునిచ్చింది. వందేళ్లయినా నవ యవ్వనిలా మరో పోరాటానికి సిద్ధం కండి అంటూ కార్యకర్తలను పురిగోల్పే రీతిలో సభ జరిగింది. పెద్ద సంఖ్యలో హాజరైన కార్యకర్తలు నేతల ఉపన్యాసాలకు తగు రీతిలో స్పందించారు. సిపిఐ నేతల ఉపన్యాసాలు యువతకు దిశా నిర్దేశం చేశాయి. దశాబ్ద కాలంలో ఖమ్మంలో ఇంతటి బహిరంగ సభ జరగకపోవడం, సిపిఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అతి పెద్ద బహిరంగ సభ జరగడం నూతన ఉత్తేజాన్ని ఇచ్చింది. ఇతర పార్టీల నేతలు సైతం అబ్బురపడే రీతిలో జన కదలికలు కనిపించాయి.

# అన్ని జెండాలు ఒక్క జెండా అవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

కమ్యూనిస్టులారా ఒక్కటి కండి అని ప్రజలందరూ కోరుకుంటున్నారని, అన్ని ఎర్రజెండాలు కలిపి ఒక్క జెండాగా రావాలని, కమ్యూనిస్టులు ఇలాగే విడిపోయి ఉంటే దేశానికి మంచిదికాదని, మంచి జరగాలంటే కమ్యూనిస్టులంతా ఒక తాటి మీదకు రావాలని పిలుపునిస్తున్నారన్నారు. 'ప్రజల కోరికను అంగీకరిద్దాం. విడిపోయిన మనమంతా ఐక్యమవుదాం' అని కూనంనేని సాంబశివరావు కోరారు.

**కమ్యూనిజం ఎక్కడ ఉందనే వారికి బహిరంగసభే సమాధానం**

కమ్యూనిస్టు పార్టీ ఎక్కడ ఉందనే వారికి సిపిఐ బహిరంగ సభే సమాధానమని కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. 100 ఏళ్ల ఉత్సవాలను వీర తెలంగాణ ఉద్యమంలో వేలాది మంది ఆశువులు బాసిన తెలంగాణలో, అందులో ప్రధానమైన పాత్ర పోషించిన ఖమ్మంలో జరుపుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. కమ్యూనిస్టు పార్టీకి మరణం లేదని, ఈ జెండాను మోసవాడు నేలకొరిగే లోపే మరోకరు జెండాను ఎత్తేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారని ఇందుకు ఈ బహిరంగ సభకు తరలివచ్చిన చిన్నారుల మొదలు నవయవత సాక్ష్యమన్నారు. మనిషి కోసం పుట్టిన సిద్ధాంతం కమ్యూనిజమని, పేదవాడి కంచంలో మెతుకు కమ్యూనిస్టు పార్టీ అని, నిరుపేదల ఆశా జ్యోతి ఎర్రజెండా అన్నారు.

మనిషి ఉన్నంతం వరకు ఎర్రజెండాకు మరణం లేదని, నిజమైన దేశ భక్తులు కమ్యూనిస్టులేనని సాంబశివరావు ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ ప్రజాస్వామిక పార్టీ**


కాంగ్రెస్ పార్టీతో రాజకీయ వైరుధ్యం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రజాస్వామిక పార్టీ అని, అన్నింటి కంటే తాను ముఖ్యమంత్రిని అనే భేషజాలు చూపని ప్రజా నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని, అందుకే ఆయనను సిపిఐ వందేళ్ల ముగింపు ఉత్సవాలకు అతిథిగా ఆహ్వానించామని కూనంనేని సాంబశివరావు చెప్పారు.

అదేవిధంగా గొప్ప మేధావి అయిన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను, ఉభయ తెలుగు రాష్ట్రాలలో అందరికంటే ఎక్కువ కాలం మంత్రిగా పనిచేసిన తుమ్మల నాగేశ్వరరావు సైతం బహిరంగ సభలో పాల్గొనటం పట్ల ధన్యవాదాలు తెలిపారు.

### మా దేహం ముక్కలైనా సరే..

# దేశాన్ని ముక్కలు కానివ్వం

● సిపిఐ సీనియర్ నాయకులు, కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ



మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కోసం రూ.10 లక్షల కోట్లు మాత్రమే ఖర్చు చేసి వృథా అవుతుందని చెబుతున్నారని, అదే సమయంలో వారి హయాంలో కార్పొరేట్ కంపెనీలకు రూ.28 లక్షల కోట్ల రాయితీలు కల్పించారని సిపిఐ సీనియర్ నాయకులు, కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. మా దేహం ముక్కలైనా సరే.. దేశాన్ని ముక్కలు కానివ్వబోమని భారత దేశం కోసం నిలబడిన గొప్ప చరిత్ర కమ్యూనిస్టులది అని అన్నారు. ఖమ్మంలో ఆదివారం జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభలో ఆయన ప్రసంగిస్తూ కమ్యూనిస్టు పార్టీ పుట్టుకతోనే భారత దేశంలో రాజకీయ మార్పు తీసుకువచ్చిందన్నారు. దున్నేవానికే భూమి, ప్రపంచ శాంతి వంటి నినాదాలను ప్రజల ముందుంచిందన్నారు. పున్నప్రవయలార్, మహత్తర తెలంగాణ సాయుధ పోరాటం, చల్లపల్లి జమీందార్ వ్యతిరేక పోరాటంతో పాటు, పుదుచ్చేరి విముక్తి పోరాటలు చేసిన ఘనత సిపిఐది అని చెప్పారు.

**చంద్రబాబూ కళ్లు తెరిచి చూడు**

కమ్యూనిజం ఎక్కడ అని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటారని, సిపిఐ శతాబ్ది ఉత్సవాలతో ఎరుపెక్కిన ఖమ్మం చూస్తే కమ్యూనిజం ఉందో లేదో అర్థమవుతుందని నారాయణ అన్నారు. చంద్రబాబు నాయుడు తన స్వంత కళ్లతోచూడాలని, కానీ, ఆయన మోదీ కళ్ళతో చూస్తున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కెసిఆర్, ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు మోదీ పక్కనే ఉన్నారని, అదే సమయంలో ఎపిలో ప్రతిపక్షంలో ఉన్న జగన్‌కూడా మోదీకి భయపడుతూ బిజెపికి మద్దతుగా ఉన్నారని అన్నారు. వాళ్ళు మోదీకి భయపడితే, ట్రంప్‌కు మోదీ లొంగిపోయారని విమర్శించారు. వెనిజులా అధ్యక్షుడిని అమెరికా ఎత్తుకుపోతే ఇంతటి పెద్ద దేశమైన భారతదేశం ఎందుకు గట్టిగా స్పందించలేదన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలను ఇద్దరు ముఖ్యమంత్రులు సామరస్యంగా చర్చించుకొని సరైన పరిష్కారం చేసుకోవాలని, ప్రతిపక్షాల బ్లాక్‌మెయిల్‌కు లొంగవద్దని నారాయణ సూచించారు.

# సిపిఐది 'వందేళ్ల మహా ప్రస్థానం'

● సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాగం హేమంత్ రావు



వందేళ్ల సిపిఐ చరిత్ర అనేక సమరశీల పోరాటాలు, అనేక మంది అమరవీరుల త్యాగాలతో పునీతమైన రక్తాక్షరాలతో లిఖించిన ఒక మహా ప్రస్థానం సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాగం హేమంత్ రావు అన్నారు. బహిరంగ సభలో హేమంత్‌రావు తొలుత స్వాగతోపన్యాసం చేస్తూ భారతదేశ రాజకీయాల్లో కమ్యూనిస్టు పార్టీది ఒక కీలక పాత్ర అన్నారు. పుట్టుకతోనే సిపిఐని అంతమొందించాలని ప్రయత్నం చేసినా, ఆ నిర్బంధాలను ఎదిరించి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో వీరోచిత పాత్ర నిర్వహించిన పార్టీ సిపిఐ అన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం నిర్వహించిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటాన్ని నడిపి, ఈ దేశంలో భూ సమస్యను ఎజెండాలోకి తెచ్చిన ఘనత సిపిఐదేనన్నారు. సిపిఐ వందేళ్ల చరిత్ర స్ఫూర్తితో పోరాటాలను బలోపేతం చేస్తామన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి ఊపిరిపోసిన జిల్లాగా ఖమ్మంకు గొప్ప చరిత్ర ఉందని, నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఇక్కడి నుండే పోరాటాలు సాగాయని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ పోరాటాల వల్ల ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వేలాది ఎకరాల భూమి పేదలకు దక్కిందని, అలాగే ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం పార్టీ నిరంతరం పోరాడిందని తెలిపారు.

# కమ్యూనిస్టులు పోరాడితే పాలకులు చట్టాలు చేయాల్సిందే

● సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



భారతదేశ సంపూర్ణ స్వాతంత్ర్యానికి పిలుపునిచ్చి ఎలాంటి పోరాటం చేశామో, బిజెపిని అధికారం నుంచి గద్దె దించడానికి అలాంటి పోరాటాలు చేయాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. సిపిఐ పోరాటాలు చేసిన వివిధ డిమాండ్‌లనే పాలకులు చట్టాలుగా తీసుకొచ్చారన్నారు. పోరాటాలు చేస్తామని, ఎవరు అధికారంలో ఉంటే వారు చట్టాలు చేస్తారని, కాంగ్రెస్, తెలుగుదేశం, బిఆర్ఎస్ ఏ పార్టీ ప్రభుత్వమైనా ప్రజలకు అవసరమైన విషయాలపై చట్టాలు తీసుకరావాల్సిందేనని అన్నారు. చట్టాలను వారు అమలు చేయకపోతే ఆ చట్టాలను అమలు చేయడానికి మళ్ళీ పోరాటాలు నిర్వహిస్తున్నామని, చట్టాలను అమలు చేయించుకుంటున్నామన్నారు. ఈ రకమైన పోరాటాలు చేయడం వల్లనే వందేళ్ల అయినప్పటికీ కూడా సిపిఐ అధికారంలోకి రాకపోయినా, పార్టీ ఒక శక్తిగా ఉన్నదంటే ప్రజల ఆదరాభిమానాలు ఉండడమేనన్నారు. కమ్యూనిస్టు పార్టీని నిలబెట్టుకోవాలనే కాంక్ష ప్రజలకు ఉన్నందు వల్లనే పార్టీ ముందుకు పోతుందన్నారు. అధికారమే పరమావధి కాదన్నారు. అనేక పార్టీలు అధికారం పోయిన తరువాత కనబడటం లేదన్నారు. సిద్ధాంత బలం, నిర్మాణ బలం ఉండటం వల్లనే వంద సంవత్సరాలే కాదు, ఈ సమాజం ఉన్నంత కాలం ఎర్రజెండా ఖచ్చితంగా ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. భారతదేశంలో ఏ ఒక్క పార్టీ కూడా సొంత బలంతో అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలు ఏకం కావాల్సిన సమయం వచ్చిందన్నారు. ఎన్‌డిఎ కూటమి, ఇండియా కూటమి, రెండు కూటముల మధ్య పోరాటం కొనసాగుతుందన్నారు. ఎన్‌డిఎ కూటమి ప్రజల అభిమానం కోల్పోయిందన్నారు. బిజెపి పుట్టక ముందే ఈ దేశంలో ప్రపంచంలో ప్రజల విశ్వాసాల ప్రకారం దేవుళ్ళు ఉన్నారన్నారు. ప్రజల బలహీనతను సొమ్ముచేసుకునేందుకు బిజెపి అనేక ఎత్తుగడలు వేస్తున్నదన్నారు. సిపిఐ చీలిపోవడం వల్ల అధికారంలోకి రాలేకపోయిందన్నారు. మోదీ ప్రభుత్వం అనేక త్యాగాలు చేసిన నక్సలైట్‌లను తేదీలు పెట్టి మరి నిర్మూలించేందుకు నరమేధం నడుపుతున్నదని విమర్శించారు. నక్సలైట్ల తరువాత అర్బన్ నక్సలైట్‌లని ముద్ర వేసి మన మీద బిజెపి దాడులు ప్రారంభిస్తుందన్నారు. 25 ఏళ్లలో జరిగిన ఉద్యమాల చరిత్రను ఇవ్వాలని ఇంటలిజెన్స్‌ను కేంద్రం ప్రభుత్వం ఆదేశించిందని, వాళ్ల తదుపరి లక్ష్యం కమ్యూనిస్టులే అన్నారు. భారతదేశంలో ఎవ్వరూ ఉన్నా ఫరవాలేదు, ఎర్రజెండాలు ఉండకూడదని, ఎర్రజెండాలను అంతం చేయాలనే దుర్బుద్ధి ఉందని విమర్శించారు. అందువల్ల బిజెపిని గద్దె దించకపోతే కమ్యూనిస్టులే కాకుండా దేశంలో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులకు గురికావడం తప్పదని హెచ్చరించారు. భారతదేశంలో కమ్యూనిస్టులంతా ఏకం కావాల్సిన అవసరం ఉందని, కమ్యూనిస్టులు ఏకమైతే, వామపక్ష భావాలు ఉన్న పార్టీలు, సంస్థలు కలిసివస్తాయన్నారు. ప్రత్యామ్నాయంగా కమ్యూనిస్టులు రావాలని, పక్కనే ఉన్న శ్రీలంక, నేపాల్‌లో సాధ్యమైందని, అలాంటి అవకాశం రావాలని కమ్యూనిస్టు అభిమానులు ఎదురుచూస్తున్నారని పల్లా వెంకట్ రెడ్డి అన్నారు.

# ప్రత్యామ్నాయంగా ఎర్రజెండా

● సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య



త్యాగాలతో కూడిన పోరాటాలకు సిద్ధపడితేనే ఎర్రజెండా ప్రత్యామ్నాయంగా నిలబడుతుందని, అందుకు అందరూ సమాయాత్తం కావాలని సిపిఐ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. రాజ్యం బలమైన శక్తిగా మారి వేటాడేందుకు సిద్ధమవుతున్న ఈ నేపథ్యంలో కమ్యూనిస్టుల పునరేకీకరణ జరగాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఈ వందేళ్ల కాలంలో అనేక ఉద్యమాలను చేపట్టిందని, ప్రజా సమస్యలపై పోరాటాలు చేసి అనేక హక్కులను సాధించిందని ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుగా నిలిచిందన్నారు. పీడిత, పేద ప్రజల కోసం వారి సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు పదునైన పోరాటాలు చేయాలని అన్నారు.

## దేశంలో ఫాసిజం, నాజీయిజం పోకడలు

● ఎఐటియుసి జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్



ఏఐటియుసి జాతీయ కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మాట్లాడుతూ భారతదేశంలో ఫాసిజం, నాజీయిజం పోకడలు పెరుగుతున్నాయని, వాటికి వ్యతిరేకంగా అమరులు, త్యాగధనుల మార్గంలో త్యాగాలకు సిద్ధమవ్వాలని ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ అన్నారు. కమ్యూనిస్టులకు భవిష్యత్తు కచ్చితంగా ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశంలో కార్మికులు, రైతులు, మహిళలు, జర్నలిస్టులు ఇలా ఏ వర్గం కూడా సంతోషంగా లేదని, పలు సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై దాడులు పెరుగుతున్నాయని, మణిపూర్, ఉత్తర్‌ప్రదేశ్‌లో దౌర్జన్యాలు పెరుగుతున్నాయని అన్నారు. బాధితుల పక్షాన నిలబడాల్సిన పాలకులు, దాడులకు పాల్పడుతున్న వారి పక్షం నిలబడుతోందని మండిపడ్డారు. వందేళ్ల చరిత్రలో భారత కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు చేసిందని, ఉద్యమాలు నిర్వహించిందని గుర్తు చేశారు.

## సిపిఐ మరో 200 ఏళ్ల సభ కూడా జరుపుకుంటుంది

● సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) వందేళ్లే కాదు, మరో 100 ఏళ్లలో 200 ఏళ్ల సభ కూడా జరుపుకుంటుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ''వందేళ్ల కిందనే పుట్టిన ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ పుత్రిక బిజెపి అధికారంలోకి వచ్చింది. సిపిఐ పుట్టి వందేళ్లు అవుతున్నా ఒక్క సారి కూడా అధికారంలోకి రాలేదని కొందరు ప్రశ్నిస్తున్నారు. అధికారం లేకపోయినా, ప్రజా ప్రతినిధులు ఉన్నా, లేకపోయినా బడుగులు, బలహీన వర్గాల తరుపున పోరాడుతున్న జెండా ఎర్రజెండా సిపిఐయే. వారికి ఇదే సమాధానం'' అని ఆయన స్పష్టం చేశారు. ఈ దేశాన్ని బ్రిటిషు వారు పరిపాలిస్తున్న తరుణంలో సిపిఐ కంటే 6 నెలల ముందే ఆర్‌ఎస్‌ఎస్ పుట్టిందని, మరి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఒక్క ఆర్ ఎస్ ఎస్ కార్యకర్త మాట్లాడారా? ఉద్యమాలు చేశారా? జైళ్లకు వెళ్లారా? ఒక్కరంటే ఒక్కరైనా ప్రాణాలు అర్పించారా అని రామకృష్ణ ప్రశ్నించారు. అదే సిపిఐ ఉద్యమాలతో పుట్టిందని, సంపూర్ణ స్వాతంత్ర నినాదంతో పోరాటాలు చేసిందని, వేలాది మంది కమ్యూనిస్టులు జైళ్లకు వెళ్లారన్నారు. తెలంగాణ విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది కమ్యూనిస్టులు ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారని, 10 లక్షల ఎకరాల భూములను పేదలకు పంచారని గుర్తు చేశారు. మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను తమ గుప్పెట్లో పెట్టుకోవడమే కాకుండా ప్రజా వ్యతిరేక విధానాలతో దేశా న్ని నాశనం చేస్తూ ప్రజల మధ్య చీలికలను తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్యూనిస్టులు 1964లో ఒకసారి చీలిపోయామని, ఆ తర్వాత మళ్లీ మళ్లీ చీలి పోయామన్నారు. మనం ఇంకా ఎన్ని ఏళ్లు ఇలాగే ఉందామని, చీలికైన కమ్యూనిస్టు పార్టీలై మళ్లీ ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైతే ఎర్రజెండా మరింత బలం

● సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు పి.సందోశ్ కుమార్



కమ్యూనిస్టు పార్టీలన్నీ ఏకమైతే చట్టసభల లోపల, వెలుపల ఎర్రజెండా బలం మరింత పెరుగుతుందని సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు పి.సందోశ్ కుమార్ అన్నారు. కమ్యూనిస్టుల బలం పెరిగితే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. దేశంలో ప్రస్తుతం ప్రజా వ్యతిరేక ప్రభుత్వం ఉన్నదని, పేద గ్రామీణ ప్రజలకు ఉపయోగపడే మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేసిందని దుయ్యబాట్టారు. సిపిఐ శతాబ్ది ఉత్సవాలను దేశ వ్యాప్తంగా కేరళ తో పాటు వివిధ రాష్ట్రాల్లో ఘనంగా నిర్వహించుకున్నామని వివరించారు.












### సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల బహిరంగ సభలో సందేశమిచ్చిన సౌహార్ద్ర ప్రతినిధులు



ఖమ్మంలో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా జరిగిన జాతీయ స్థాయి బహిరంగ సభకు విదేశాల నుంచి కమ్యూనిస్టు, వర్కర్స్ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కమ్యూనిస్టు పార్టీకి శుభాకాంక్షలు తెలియజేశారు. బహిరంగ సభకు ఏడు దేశాల నుంచి ప్రతినిధులు హాజరై, అభివాదం చేశారు. హాజరైన వారిలో క్యూబా కమ్యూనిస్టు పార్టీ తరుపున వాన్ కార్లోస్ అగ్యులెరా (క్యూబా అంబాసిడర్), పాలస్తీనా అంబాసిటర్ అబ్దుల్లా ఎం.ఎ.అబుషావేశ్, సహార్ జె.ఒ అబుషావేశ్, వెనిజులా కమ్యూనిస్టు పార్టీ తరుపున కాల్దేరా గుజ్మా, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ తరుపున హువాంగ్ ట్రాన్, వర్కర్స్ పార్టీ ఆఫ్ కొరియా తరుపున డెమొక్రాటిక్ పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా ఎంబసీ కౌన్సెలర్ జాంగ్ జోంగ్ హువాన్, కిమ్ మ్యాంగ్ చోల్, నేపాల్ కమ్యూనిస్టు పార్టీ సిపిఎన్ (యుఎంఎల్) ప్రతినిధి ఉదయ్‌రాజ్ పాండేలు హాజరయ్యారు. వారంతా భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ప్రస్తానాన్ని వలస పాలన విముక్తికి, దేశ ప్రజల అభ్యున్నతికి చేసిన కృషిని సభలో శ్లాఘించారు. ఆయా దేశాల కమ్యూనిస్టు పార్టీ జాతీయ కమిటీల సందేశాన్ని చదివి వినిపించారు.



సిపిఐ శతాబ్ది ముగింపు ఉత్సవాల బహిరంగ సభలో మాట్లాడుతున్న జాతీయ కార్యదర్శివర్గ సభ్యుడు రామకృష్ణ పాండ

# ఫిబ్రవరిలో మునిసిపల్ ఎన్నికలు



● జిల్లాల పునర్విభజనకు రిటైర్డ్ జడ్జితో కమిషన్
● వచ్చే ఏడాది ఆగస్టులో జరగనున్న గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు
● మంత్రివర్గం ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్/ ములుగు:** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలను ఫిబ్రవరిలో నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న జిల్లాల పునర్విభజనకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలపడంతో పాటు రిటైర్డ్ జడ్జితో కమిషన్ ఏర్పాటుకు నిర్ణయించింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధ్యక్షతన ములుగు జిల్లా మేడారంలో ఆదివారం జరిగింది. మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. మంతివర్గ సమావేశం నిర్ణయాలను అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ధనసరి అనసూయ సీతక్క మీడియాకు వివరించారు. పరిపాలన కాలం ముగిసిన 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు మార్చిలో పండుగలు విద్యార్థులు పరీక్షలు ఉండడంతో వీలైనంత త్వరలో ఎన్నికల్లో నిర్వహిస్తామన్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో జరగనున్న గోదావరి పుష్కరాలకు భారీ ఏర్పాట్లు చేయాలని నిర్ణయించామన్నారు. గోదావరి పరివాహక ప్రాంతం లో అన్ని దేవాలయాలను బాసర నుంచి భద్రాచలం వరకు అభివృద్ధి చేయడంతో పాటు ఏకో టూరిజంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు సంబంధించి కన్సల్‌టెంట్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నివేదిక అందిన తర్వాత మంత్రివర్గ సబ్ కమిటీ ఏర్పాటు చేసి మార్చి 31 తర్వాత ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. హైదరాబాద్ మెట్రో రైలుకు సంబంధించి ఫేస్–1 నుంచి ఎల్‌టి నుంచి అంశంలో క్షుణ్ణంగా ఫేస్ 2 ఎ, బిలకు సంబంధించి భూసేకరణకు అమోదం తెలిపారు. రూ.2787ఎ,బిలకు ఆమోదం తెలిపిందన్నారు. హైదరాబాద్ ఇంటిగ్రేటేడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి శిల్ప లేఅవుట్ వరకు 9 కిలోమీటర్ల ఫ్లైఓవర్ నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. మేడారం అభివృద్ధికి సుమారు 19 ఎకరాలను సేకరించామని, మరో 21 ఎకరాలను భూసేకరణ చేసి మరింత అభివృద్ధి చేయనున్నాం. జంపన్న వాగులో 365 రోజులు నీటిని నింపే విధంగా లక్నవరం నుంచి పైపు లైన్ వేసేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారన్నారు. మేడారాన్ని తిరుమలను, కుంభ మేళాను మరిపించే విధంగా అభివృద్ధి చేయనున్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ హామ్ రోడ్లకు సంబంధించి రూ.11,334 కోట్లతో, రూ.6 వేల కోట్లతో పంచాయితీ శాఖ ఆధ్వర్యంలోని రోడ్ల నిర్మాణానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. నల్గొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో లా కళాశాల ఏర్పాటుకు ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రంలోని 14 ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర వ్యవస్థలకు ప్రభుత్వ భూములు కేటాయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ఎస్‌బిఐ కార్పోరేట్ కార్యాలయాలకు నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో కేటాయించేందుకు ఆమోదం తెలిపిందన్నారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు సమ్మక్క, సారలమ్మ చరిత్ర అందించడమే లక్ష్యంగా ఆలయాన్ని అభివృద్ధి చేశామన్నారు. ములుగు మండలంలో రూ.143 కోట్లతో పోట్లపూర్ ఎత్తిపొత్తల పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపిందని చెప్పారు.

## ఎన్నికల సంఘానికి సర్కార్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియకు ప్రభుత్వం అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసింది. అందులో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అనుమతి తెలిపింది. రిజర్వేషన్ల నివేదికను కూడా ఖరారు, ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్నికల సంఘానికి పంపిన నివేదికలో 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్‌ల రిజర్వేషన్లు ఖరారు చేసిన వివరాలు ఉన్నాయి. ఈ రిజర్వేషన్‌ల ప్రకారం మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థలలో మహిళలు, బిసిలు, ఎస్‌సిలు, ఎస్‌టిలకు తగిన రిజర్వేషన్లు కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయని, ఇకపై ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడం మాత్రమే మిగిలిందని అధికార వర్గాలు వెల్లడించాయి.

# దోపిడీదారుల నుంచి రాష్ట్రాన్ని రక్షిస్తా

● అధికారం, హోదా అనుభవించడానికి రాజకీయాల్లోకి రాలేదు
● ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ 'కొత్త పలుకు'లో రాసింది పూర్తి అసత్యం : డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆత్మగౌరవం కోసం తాము బతుకుతామని, దోపిడి దారుల నుంచి రాష్ట్రాన్ని, ప్రజలను కాపాడటానికి రాజకీయాల్లోకి వచ్చానని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్, ప్రజా భవన్‌లో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించడం కోసమో, అధికారం, హోదాను అనుభవించడం కోసమో తాను రాజకీయాల్లోకి రాలేదని, దోపిడీదారులు, బందిపోట్ల నుంచి తెలంగాణ ఆస్తులను, వనరులను రక్షించి, వాటిని ప్రజలకు అందజేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. సింగరేణి బొగ్గు సంస్థలకు టెండర్లపై ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ 'కొత్త పలుకు'లో తనకు తోచింది రాశాడని విమర్శించారు. ఓ కట్టు కథనాన్ని ఎవరి ప్రయోజనం కోసమో వండి వార్చాడన్నారు. టెండర్ల నిబంధనలు సింగరేణి బోర్డ్ ఖరారు చేస్తుందని, మంత్రికి సంబంధం ఉండదని, ఆరోపణలు వచ్చిన వెంటనే ఆ టెండర్లు రద్దు చేయాలని సూచించినట్టు తెలిపారు. కాగా, సదరు బోర్డు మాత్రం టెండర్లు పిలిచిన ఇంకా ఎవరూ రాలేదని చెప్పారని అన్నారు. అయినప్పటికీ తాను టెండర్లు రద్దు చేసి ఫ్రెష్‌గా పిలవమని సూచించినట్టు తెలిపారు. తాను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డితో సన్నిహితంగా ఉండటంతో రాధాకృష్ణకు నచ్చక వైఎస్‌పై ఉన్న కోపంతో నాపై ఈ వార్త రాసినట్టుగా కనిపిస్తుందని పేర్కొన్నారు. ఈ వార్త వల్ల అధికారులకు, మంత్రులకు, ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోనని స్పష్టం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులమంతా రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల కోసం పనిచేస్తున్నామని, చిల్లర కథనాలతో భయపెట్టాలని చూస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. తాను రాజకీయాల్లోకి గాలికి రాలేదని, 40 సంవత్సరాలుగా సభలో, బయట ఉండి ప్రజల కోసం పోరాటాలు చేసి వచ్చానన్నారు. రాధాకృష్ణ కొత్త పలుకును ఏం ఆశించి రాశాడో, ఎవరి మెప్పు కోసం రాశాడో బయటపడుతుందని అన్నారు. ఈ కథనంపై రాష్ట్ర ప్రజలకు నిజాలు తెలియాలని తాను స్పందించడం జరిగిందన్నారు. త్వరలో పూర్తి వివరాలతో అన్ని విషయాలు వివరిస్తానని తెలిపారు.



## 'ప్రజాపక్షం' ఎల్లప్పుడూ ప్రజల పక్షమే

**ప్రజాపక్షం/చింతలపాలెం** : ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా పక్షం దినపత్రిక పనిచేస్తుందని సిపిఐ జిల్లా నాయకులు ఉస్తెల నారాయణ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి సిహెచ్ రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నందు ప్రజాపక్షం నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించి వారు మాట్లాడారు. ప్రజాపక్షం దినప త్రిక ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సమాజంలో ఎటు వంటి సమస్యలు ఉన్నా వాటి పరిష్కారం కొరకు నిరంతరం పనిచేస్తుంద న్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడుతూ వస్తుందని తెలిపారు. ప్రజాపక్షం ఎల్లప్పుడూ ప్రజల పక్షంగా ఉంటూ ప్రజల మన్న నలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం మండల రిపోర్టర్ షేక్ అబ్దుల్ రహీం, సిపిఐ గ్రామ కార్యదర్శి గంధం మంగయ్య, నాయకులు అబ్దుల్ భాష, భూక్య రామారావు, గంధం కొండ, మహ్మద్ ఖాసీం, గాలి సాబ్, తోకల సైదులు, హైమావతి, భీమిశెట్టి పద్మ, కార్యక ర్తలు పాల్గొన్నారు.

## ప్రజల గొంతుక ప్రజాపక్షం



**ప్రజాపక్షం/చింతపల్లి** : ప్రజల గొంతుకగా ప్రజాపక్షం జాతీయ దినపత్రిక పనిచేయాలని వర్కాల గ్రామ సర్పంచ్ కుర్మేటి పుష్పలత ప్రశాంత్ అన్నారు. మండల పరిధిలోని వర్కాల గ్రామంలో ఆదివారం ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సర నూతన క్యాలెండర్‌ను పుష్పలత చేతుల మీదుగా ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పత్రికలు పని చేయాలన్నారు. నిత్యం ప్రజా సమస్యలను పరిశీలిస్తూ వాటిని ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరి ష్కారం కోసం పత్రికలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కుర్మేటి కృష్ణయ్య, కుర్మేటి ప్రశాంత్, కుర్మేటి పెంటయ్య, జగన్, జంగయ్య, ప్రజాపక్షం రిపోర్టర్ ఆరెకంటి రాధాకృష్ణ పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

### నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/నల్లగొండ:** సంక్రాంతి పండుగ అనంతరం తిరుగు ప్రయా ణాలు చేసే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించి ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని నల్లగొండ జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేసి మాట్లాడుతూ సంక్రాంతి పండగ ముగించుకొని తిరుగు ప్రయాణ రద్దీ దృష్ట్యా సమగ్ర ట్రాఫిక్ ఏర్పాట్లు చేశామని తెలిపారు. నల్ల గొండ జిల్లా పరిధిలో సంక్రాంతి పండగ ముగించుకుని ఆంధ్ర ప్రాంతం నుంచి హైదరాబాద్ దిశగా తిరుగు ప్రయాణాలు అధికంగా సాగుతున్న నేపథ్యంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉందని ఈ నేప థ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా అలాగే రోడ్డు ప్రమాదాల నివా రణ కోసం పో లీస్ శాఖ సమగ్రచర్యలు చేపట్టినట్లు తెలిపారు.జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ముఖ్య కూడళ్లలో 450 మంది పోలీస్ అధికారులు, సిబ్బం దితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియం త్రణ చేపట్టామన్నారు. వాహన రద్దీని ఎప్పటి కప్పుడు గమనించేందుకు డ్రోన్ల ద్వారా గాలిలో నుంచే నిరంతర పర్యవేక్షణ నిర్వహి స్తూ రద్దీ అధి కంగా ఉన్న ప్రాంతాల్లో అవసరమైన చోట్ల వెంటనే ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## పద్మశాలీలు రాజకీయంగా బలపడాలి

### డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : పద్మశాలీలు రాజకీయంగా బలోపేతమై రాజ్యాధికారంలో పాలుపంచుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పున్న కైలాస్ నేత అన్నారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వ ర్యంలో ముద్రించిన 2026 నూతన క్యాలెండర్ ని ఆదివారం నల్లగొండ జిల్లా కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస నేత నల్లగొండ, సూర్యాపేట జిల్లా అధ్యక్షులు నల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఏశాల విశ్వకుమార్ తదితర నాయకుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ మాట్లాడుతూ పద్మశాలి ఉద్యోగుల సంఘం పేద పద్మశాలీలలకు ఆర్థికంగా ఎదగడానికి సహకరించాలని పద్మశాలీలు రాజకీయంగా బలోపేతమై రాజ్యాధికారంలో పాలుపంచుకో వాలన్నారు. ఆ సంఘం నల్లగొండ ,సూర్యాపేట జిల్లాల అధ్యక్షులు నల్ల శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి యేశాల విశ్వకుమార్లు మాట్లాడుతూ సంఘం ద్వారా పేద విద్యార్థులను ఆదుకోవటంతో పాటుగా పలు సేవా కార్యక్రమా లను కూడా కొనసాగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలోరాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకట శ్రీనివాస్,జిల్లా ఉపాధ్యక్షులు మిర్యాల వెంకటేశం, ప్రభు త్వ ప్రధాన ఆసుపత్రి నల్లగొండ సూపరింటెండెంట్ గుర్రం నర్సింహా రావు నేత, విద్యుత్ శాఖ బిసి సంఘం రాష్ట్ర నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రజలకు నాయకులుగా ఉండాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సర్పంచులు రాజకీయ పార్టీలకు బందీలుగా కాకుండా ప్రజలకు నాయకు డిగా ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని ట్రైకర్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ట్రిబుల్ ఆర్ ఫంక్షన్ హాల్‌లో సూర్యాపేట జిల్లా సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు, లంబాడి పోరాట హక్కుల సమితి అధ్యక్షులు భూక్య రాజు నాయక్ అధ్యక్ష తన ఎల్‌హెచ్‌పిఎస్ ఆధ్వర్యంలో గిరిజన సర్పంచులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రైకర్ నుంచి కూడా గ్రామాల అభివృద్ధికి నిధులు ఇస్తానని గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో తండాలకు నిధులు కేటాయించాలని గ్రామ పంచాయితీలకు రూ.5 కోట్లు ఇవ్వాలని కోరారు. అనంతరం ఎల్‌హెచ్‌పిఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవి ష్కరించి ఆయా తండాలలో సర్పంచులుగా ఎన్నికైన వారిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాంబాల నాయక్, ధరావత్ బిక్షం నాయక్, భూక్య కోటియా నాయక్, బానోత్ నందులాల్, మోతిలాల్, వాంకుడోత్ వెంకన్న, ధరావత్ అజయ్, చత్రు నాయక్, సక్రు నాయక్ పాల్గొన్నారు.







## ఖమ్మం సభకు సిపిఐ శ్రేణులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాల బహిరంగ సభ సందర్భంగా ఆది వారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాల యంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభా కర్ జెండా ఆవిష్కరించారు. మహాసభకు బయలుదేరిన వాహనాలకు పార్టీ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దంతాల రాంబాబులు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కెవిఎల్, బొమ్మగాని నాగభూషణం, చామల అశోక్ కుమార్, అనం తుల మల్లేశ్వరి, బొమ్మగాని శ్రీనివాస్, దీకొండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సిపిఐ భారతదేశంలో ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి అయిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంలో జరిగిన బహిరంగ సభకు నల్లగొండ నుండి పెద్ద ఎత్తున కార్మికులు ప్రజలు తరలివెళ్లిన బస్ లను దేవేందర్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించటం జరిగింది. ఈ కార్యక్ర మంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, పట్టణ కార్యదర్శి కెవిఎస్‌రెడ్డి. ఏఐటీయూసీ జిల్లా నాయకులు డి వెంకటేశ్వర్లు.పి నాగరాజు. జిల్లా యాదయ్య,ఎన్ఆర్‌సి రాజు.సైదులు,ఎండి జానీ, మదార్, యూసుఫ్. ధనలక్ష్మి, సుజాతా, స్వామి, జనయ్యా ,నాగార్జున,శ్రీను పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/దేవరకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు ఆదివారం ఖమ్మం సిపిఐ, ప్రజా సంఘాల నాయకులు బయలుదేరారు. దేవరకొండ నియోజ కవర్గం జనసేవా దళ్ ఏఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ బృందానికి జెండా ఊపి ప్రారంభించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి. దేవరకొండ నియోజకవర్గం నుండి భారీగా సిపిఐ క్యాడర్ తరలివెళ్లినట్లు తెలిపారు.



# ఇబ్రహీంపురంలో చిరుత పులి కలకలం

### లేగదూడలపై దాడిచేసి చంపిన పులి

### ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిఎస్‌పి,అటవీశాఖ



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : గత రెండుమూడు రోజులనుంచి చిరుతపులి అలజడితో ఇటు తుర్కపల్లి మండలం, అటు రాజపేట మండలం లోని గ్రామాల్లో చిరుతపులి కలకలం రేపు తోంది. ప్రజలు అటు భయాందోళనకు గురవు తున్న సమయంలో శనివారం రాత్రి తుర్కపల్లి మండలంలోని ఇబ్రహీంపురం గ్రామంలో మాటూరి కృష్ణగౌడ్ అనే రైతుకు చెందిన రెండు లేగదూడలపై దాడి చేసి చంపి సమీపంలోని ఫారెస్ట్ అడవిలోకి వెళ్లిందని పోలీసులు తెలి పారు. బావులవద్ద కట్టేసిన ఆవుల వద్దకు రాత్రి దాడికి పాల్పడిన చిరుత ఒక దూడను మెడ కొరికి తాడుతో కట్టేయడంతో దాన్ని అక్కణ్ణే వది లేసి, కేవలం 20 రోజుల కిందట జన్మించిన పసి లేగదూడను చంపి ఎత్తుకెళ్లడంతో రైతులు, ప్రజల గుండెల్లో భయం మరింత ఎక్కువైంది. విషయాన్నీ తెలుసున్న డిఎస్పీ శ్రీనివాస్ నాయు డు, ఫారెస్ట్ జిల్లా అధికారులు సుధాకర్ రెడ్డి, యాదగిరిగుట్ట సిఐ శంకర్ గౌడ్, తుర్కపల్లి ఎస్సై తక్యుద్దీన్, అటవీశాఖ, ఫారెస్ట్ పోలీస్ అధి కారులు రమేష్ నాయక్, షాలిని, శేఖర్ రెడ్డి, బీట్ ఆఫీసర్ నర్మద, మల్లేశం, పార్వతిలు ఘటనా స్థలాన్ని పరిశీలించి చిరుత దాడి, దాని కదలికలపై అప్రమత్తమయ్యారు. ఇబ్రహీంపు రం గ్రామ ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజ లు ముఖ్యంగా రైతులు ప్రతిక్షణం జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. చిరుతపులిని ఎలా కట్టడి చేసి పట్టుకోవాలి, ఎలా అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచిం చారు. ప్రజలు ఒంటరిగా రాత్రి సమయాల్లో బయట తిరగకూడదని, త్వరలో పులిని పట్టు కొని రక్షణ చర్యలు తీసుకుంటామని, భయాం దోళనకు గురికావొద్దని తెలిపారు. ఈ నేపథ్యం లో గ్రామపంచాయతీ స ర్పంచ్ మన్నెపు రజిత తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ నాగాయపల్లి శివారా ములు, పాలకవర్గం సభ్యు లు ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని కోరారు. అటవీశాఖ అధికా రులకు సహకరించాలని తెలిపారు.



# లక్కీ డ్రాల పేరుతో మోసాలపట్ల జాగ్రత్త

### జిల్లా ఎస్‌పి కె నరసింహ్మా



**ప్రజాపక్షం/సూర్యాపేట** : బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లపై రాష్ట్రవ్యాప్తంగా కఠిన చర్యలతో ఆ దందాకు దాదాపు బ్రేక్ పడ డంతో, ఇప్పుడు కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయె న్సర్లు సోషల్ మీడియా వేదికగా లక్కీ డ్రా పేరుతో కొత్త మోసాలకు తెరలేపుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి కె నరసింహ సూచించారు. కార్లు, బైకులు, ఖరీదైన గ్యాడ్జెట్లు ఇస్తామంటూ అమాయక ప్రజలను ఆకర్షించి నగదు దోచుకుంటున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. ఇటీ వల సామాజిక మాధ్యమాల్లో లక్కీ డ్రా పేరుతో జరుగుతున్న మోసా లపై రాష్ట్రంలో కొన్ని ముఖ్య నగ రాల్లో, పట్టణాల్లో పోలీసులకు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. కొందరు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, సెలబ్రిటీలు తమ ఫాలోయింగ్‌ను ఉపయోగించి డ్రాలో పాల్గొంటే ఖచ్చితంగా బహుమతి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నట్లు తెలిసిందన్నారు. ఇలాంటి డ్రాలకు ఎలాంటి చట్టబద్ధత లేదని స్పష్టం చేశారు. బహు మతులు అందకుండా ప్రజలు మోసపోవడం జరుగుతుందని తెలిపారు. లక్కీ డ్రా పేరుతో డబ్బులు వసూలు చేయడం, ప్రజలకు లాభాల ఆశ చూపించి మోసం చేయడం నేరమని అన్నారు. ఈ తరహా కార్యకలాపాలు ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బ్యా నింగ్) యాక్ట్, 1978 కింద నేరుగా పరిగణించ బడుతాయని పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్ర మించి లక్కీ డ్రాలు నిర్వహించే వారిపై, వాటిని ప్రమోట్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తామని అన్నారు. ఇలాంటి వాటిని నిర్వహించిన, ప్రోత్సహించిన వారు ఎంతటివారైనా చట్టప రంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తీవ్రంగా హెచ్చరించారు.

## మద్యం విషయంపై నా నిర్ణయంలో మార్పు లేదు

### ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి వైన్‌షాప్ నిర్వాహకులకు వార్నింగ్



**ప్రజాపక్షం/మునుగోడు :** నియోజకవర్గంలో కొనసాగుతున్న మద్యం షాపుల సమయపాలన లో మునుగోడు నియోజకవర్గ ప్రజల ఆరోగ్య మేలు కోసం నేను తీసుకున్న నిర్ణయం లో ఎలాంటిvమార్పు ఉండదని మరోమారు స్పష్టం చేశారు. ఆదివారం మునుగోడులోని క్యాంపు కార్యాల యంలో ఎమ్మెల్యేను కలవడానికి వచ్చిన మద్యం వ్యాపారులతో మద్యం షాపుల సమయపాలన పై మద్యం నియంత్రణపై వెనకడుగు వేయబోమని స్పష్టం చేశారు. వ్యాపారాల కోసం ప్రజల ఆరోగ్యాలు పాడుచేయొ ద్దని,ఉదయం నుండి మద్యం తాగే విధానానికి స్వస్తి పలికేలా మద్యం వ్యాపారులు బిజినెస్ మైండ్‌ని మార్చుకోవాలని హెచ్చరించారు. మును గోడు నియోజకవర్గంలో మద్యం షాపుల విషయంలో తాను తీసుకున్న నిర్ణయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట తర్వాతే వైన్ షాపులు తెరుచుకోవాలని 6 గంటల తర్వాతే పర్మిట్ రూమ్ లలో అనుమతి ఉండాలని అన్నారు.అవసరమైతే నియోజకవర్గంలో డ్రంక్ అండ్ డ్రైవ్ లను ఉదయం నుంచి సాయంత్రం వరకు పరీక్షించేందుకు ఆదేశాలు ఇస్తానని అన్నారు.ఉదయమంతా పనిచేసుకొని సాయంత్రం పూట మాత్రమే తాగేలా మార్పు తీసుకొస్తున్నామన్నారు.మద్యం విష యంలో మీరు తీసుకున్న నిర్ణయం మహా గొప్పదని ఇతర నియోజకవర్గ ప్రజలు మెచ్చుకుంటున్నారని గుర్తు చేశారు. యువత మద్యానికి బానిసై పెడదొవ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. యువత ఆలోచనలు మద్యం వైపు నుండి తమ వ్యక్తిగత అభివృద్ధి వైపు మళ్లిస్తూ గ్రామాలలో ఆరోగ్యకరమైన వాతావరణ నెలకొల్పడానికే ఈ ప్రయత్నం చేస్తున్నానని అన్నారు.

## లాకప్ డెత్ కేసులో డిఎస్‌పి, ఎస్‌పిలు కూడా నిందితులే

### ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



**ప్రజాపక్షం/సూర్యాపేట** : కోదాడ కర్ల రాజేష్ లాకప్ డెత్ ఘటనలో నాటి కోదాడ డిఎస్‌పి శ్రీధర్ రెడ్డి, సూర్యాపేట ఎస్‌పి నరసింహ పాత్ర ఉందని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని జె గార్డెన్‌లో ఎంఆర్‌పిఎస్, అను బంధ సంఘాల తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోవిందు నరేష్ మాదిగ అధ్యక్షతన జరిగిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ రాజేష్‌పై ఏ ఫిర్యాదు లేకున్నా చట్టవిరు ద్ధంగా చిలుకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్న విషయం డిఎస్‌పి, ఎస్‌పిలకు తెలుసన్నారు. ప్రతిరోజూ పోలీసు స్టేషన్ లాకప్‌లకు సంబంధిం చిన సమాచారం (డైలీ సిట్యువేషన్ రిపోర్టు) ఎస్‌పి, డిఎస్‌పిలకు ఉన్నప్ప టికి ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేసి రాజేష్ మరణానికి వారు కూడా కారకులయ్యారని ఆరోపించారు. ఈ కేసును పక్కదారి పట్టించేందుకు మొదటి నుండి అన్ని విధాలుగా ప్రయత్నాలు చేశారని విమర్శించారు. అందులో భాగంగానే రాజేష్ పోస్టుమార్టంకు ముందు ఎస్‌పి నరసింహ గాంధీ హాస్పటల్‌కు ఎస్ఐ, సిఐలను పంపించారని తెలిపారు. పోలీసులే గాంధీ హాస్పటల్ డాక్టర్లను, ముషీరాబాద్ మేజిస్ట్రేట్‌ను మేనేజ్ చేసి పోస్టు మార్టం చేయించుకున్నారని అన్నారు. అందుకే ఆ రోజు డ్యూటీలో లేని లక్ష్మి కాంత్‌రెడ్డి అనే రెడ్డి డాక్టర్‌ను పిలిపించి పోస్టుమార్టం చేయించార న్నారు. వీడియో గ్రాఫర్‌ను కూడా కోదాడ నుండి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన రామకృష్ణరెడ్డిని పిలిపించారని చెప్పారు. ఈ కేసును కప్పిపుచ్చడా నికి తీవ్ర ప్రయత్నాలు చేయడంతో తమ విధుల్లో నిర్లక్ష్యం వహించిన డిఎ స్‌పి శ్రీధర్ రెడ్డిని ఏ3 గా, ఎస్‌పి నరసింహను ఏ4 గా, రాజేష్ లాకప్ డెత్ కేసులో చేర్చాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖకు నిజాయితీ ఉంటే ఈ ఘటన మీద ప్రధానంగా డిఎస్‌పి, ఎస్‌పి పాత్రల మీద డిఐజి లేదా ఐజి లేదా అంతకన్నా ఉన్నతస్థాయి అధికారితో విచారణ జరిపించాలని కోరారు. ఈ విషయమై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి రాజేష్ లాకప్ డెత్ ఘటన మీద సిబిఐ చేత విచారణ జరిపించా లని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి అను బంధ సంఘాల నాయకులు వికె విశ్వనాథం మాదిగ, జయకర్, చిప్పల పల్లి సోమశేఖర్ మాదిగ, దప్పు మల్లయ్య మాదిగ, బచ్చలికూర వెంకటే శ్వర్లు మాదిగ, జానకిరామయ్య చౌదరి, చింతలపాటి చిన్న శ్రీరాములు మాదిగ, యాతాకుల రాజన్న మాదిగ, యర్ర వీరస్వామి పాల్గొన్నారు.













## ఖమ్మం సభకు సిపిఐ కార్యకర్తలు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100వ వార్షికో త్సవ ముగింపు సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న అఖిల భారత స్థాయి బహిరంగ సభకు చింతలపాలెం మండలం నుంచి సిపిఐ కార్యక ర్తలు భారీగా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉస్తెల నారాయణరెడ్డి, మండల కార్యదర్శి చింత్రియాల రవి, గ్రామ కార్యదర్శి అబ్దుల్ భాషా, గంధం కొండ, భీమిశెట్టి పద్మ, హైమావతి, తోకల సైదులు, ముఖ్య రామారావు, రాకేష్, సత్యం, శీను తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : అల్వాలపురం గ్రామ శాఖ నుండి సిపిఐ మండల సహాయ కార్యదర్శి పోతురాజు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలి వెళ్ళారు. ఈ కార్యక్ర మంలో గ్రామ శాఖ నాయకులు కంబాల స్వామి, కంబాల నరసింహారావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, గోవర్ధన్, లవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు :** ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కేందర్రంలో మండల కేందర్రంలో భారీగా కవాతు నిర్వహించారు. ముందుగా కవాతును సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురుజ రామచందర్ర, సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను జెండాతో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏ ఐ వై ఎఫ్, ఏఎస్ఎఫ్ నా యకులు బండారు శంకర్,కట్కూరి లింగస్వామి,బుల్గురి వంశీకృష్ణ,గోపాగోని ఉదయ్, గోస్కొండ మల్లేష్, దశరథ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఖమ్మంలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభకు మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. మిర్యాలగూడ, వేములపల్లి, దామరచర్ల మండల కార్యదర్శులు అంజనపల్లి రామలింగం, జిల్లా యాదగిరి, పోలేపల్లి ఉదయ్‌కుమార్, పద్మ, షమీం, బంటు రేణుక, సైదమ్మ, ప్రమీల, యాదగిరి, సునీత తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/తుంగతుర్తి (తిరుమలగిరి) :** తొండ గ్రామం నుండి సిపిఐ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్ళడం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, తుంగ తుర్తి నియోజక వర్గ ఇంచార్జి యాదగిరి జెండా ఊపి ప్రారంభించారు.

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరి నరసింహ ఆధ్వర్యంలో భారీ సంఖ్యతో పార్టీ శ్రేణులు బయలుదేరివెళ్లారు. జిల్లా నాయకులు ఎర్ర రమేష్ గౌడ్, మండల సహాయ కార్యదర్శి కళ్లెం రామచంద్రు, రామన్నపేట పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, ఏఐటీయూసీ మండల అధ్య క్షులు శివరాత్రి సమ్మయ్య, రైతు సంఘం అధ్యక్షులు ఊట్కూరి కృష్ణ, ఏనుతుల రమేష్, ఊట్కూరి భగవంత, బాలగోని మల్లయ్య, గంగాపురం యాదయ్య, గంగాపురం వెంకటయ్య, వీరమల్ల ముత్తయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/గుండాల :** భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల ముగింపు సభకు ఆదివారం ఖమ్మం పట్టణానికి గుండాల మండల సిపిఐ పార్టీ శ్రేణులు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల నుండి భారీ ఎత్తున తరలివెళ్ళారు. ఈసందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి అనంతుల రామచంద్రయ్య వాహన శ్రేణికి జెండా ఊపి ప్రారంభించారు. సభకు తరలిన వారిలో మండల కార్యవర్గ సభ్యులు మోహన్‌రెడ్డి, వృధ్వి, కొమురయ్య, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



## గణతంత్ర వేడుకలకు
# కశ్మీర్‌లో భద్రత పెంపు



**శ్రీనగర్:** గణతంత్ర దినోత్సవ వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా చూసేందుకు భద్రతా దళాలు కశ్మీర్ అంతటా శానిటైజేషన్, ఏరియా డామినేషన్ ప్రక్రియను ముమ్మరం చేసినట్లు అధికారులు తెలిపారు. శ్రీనగర్ నగరం, లోయలోని ఇతర ప్రాంతాలలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఏదైనా అనుమానాస్పద కదలికను గుర్తించేందుకు వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.గణతంత్ర దినోత్సవం జరుపుకునే వేదికల చుట్టూ శోధన కార్యకలాపాలు, ఏరియా డామినేషన్ ప్రక్రియ ప్రారంభించామన్నారు. కశ్మీర్‌లో ప్రధాన గణతంత్ర దినోత్సవ కార్యక్రమం బక్షి స్టేడియంలో జరుగుతుందని అధికారులు తెలిపారు. ఇక్కడ కఠినమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నగరం, ఇతర జిల్లా ప్రధాన కార్యాలయాలలో పోలీసులు, పారామిలిటరీ సిబ్బందిని మోహరించారు. శ్రీనగర్‌లోని వివిధ ప్రదేశాలలో, ముఖ్యంగా నగరం, ఇతర జిల్లాల ప్రవేశ ప్రదేశాలలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. శ్రీనగర్‌లోని స్టేడియంతో సహా లోయలోని గణతంత్ర దినోత్సవ వేడుకల వేదికల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు. వేదికల చుట్టూ బహుళ అంచెల భద్రతా ఉపకరణాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని, శాంతిభద్రతలకు భంగం కలిగించడానికి లేదా శాంతిని ఉల్లంఘించడానికి ఎవరినీ అనుమతించవద్దని అధికారులు కోరారు. గణతంత్ర దినోత్సవానికి ముందు ఉగ్రవాదులు ఎటువంటి ఐఇడి పేలుళ్లకు పాల్పడకుండా చూసేందుకు స్నిఫర్ డాగ్‌లు, మెటల్ డిటెక్టర్‌లను రంగంలోకి దించారు. ఏదైనా ఘటనను ఎదుర్కోవడానికి లోయలోని వివిధ ప్రదేశాలలో మాక్ సెక్యూరిటీ డ్రిల్స్ నిర్వహించబడినందున భద్రతా సంస్థలు ఏ అవకాశాన్ని వదిలిపెట్టడం లేదని వారు తెలిపారు.

**కిష్త్వార్ ఎన్‌కౌంటర్**

జమ్మకశ్మీర్ కిష్త్వార్ జిల్లాలోని మారుమూల అటవీ ప్రాంతంలో ఆదివారం భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎన్‌కౌంటర్ జరిగింది. చత్రో ప్రాంతంలోని మాండ్రాల్‌సింగూరా సమీపంలోని సోనార్ గ్రామంలో మధ్యాహ్నం సమయంలో కార్డన్, సెర్చ్ ఆపరేషన్ సందర్భంగా కాల్పులు ప్రారంభమయ్యాయని అధికారులు తెలిపారు. బలగాలు ఆ ప్రాంతంలో మోహరించామన్నారు.

## సైబర్ నేరాల దర్యాప్తు
# ఖాతాల స్తంభనకు ‘సుప్రీం’లో పిటిషన్

### పిటిషన్‌ను సిజెఐ ముందు ఉంచాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశం



న్యూఢిల్లీ : సైబర్ నేరాల దర్యాప్తు సమయంలో బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం, స్తంభింపజేయడాన్ని నియంత్రించే ఆపరేటింగ్ విధానాన్ని రూపొందించాలని, కేంద్రానికి, భారత రిజర్వ్ బ్యాంక్‌కు ఆదేశాలు జారీచేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ముందు ఉంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. డిజిటల్ అరెస్టులకు సంబంధించిన సుమోటో అంశాన్ని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) నేతృత్వంలోని ధర్మాసనం ఇప్పటికే విచారిస్తోందని, అదే అంశం పరిశీలనలో ఉందని కేంద్రం తెలియజేసిన తర్వాత జస్టిస్‌లు పంకజ్ మిథల్, ఎస్‌విఎన్.భట్టిలతో కూడిన ధర్మాసనం రిజిస్ట్రీని సిజెఐ నుండి సూచన కోరాలని, తదనుగుణంగా తగిన బెంచ్ ముందు ఈ అంశంపై విచారించాలని ఆదేశించారు.‘అనిల్ కౌశిక్ ఎఎస్‌జి ఇంకా ఇలా అన్నారు. ‘బి’, ‘సి’ ప్రార్థనల విషయానికి వస్తే అవి సుమోటో రిట్ పిటిషన్ (సిఆర్‌ఎల్.) నెం...లో ఈ కోర్టులోని మరొక ధర్మాసనం ముందు పరిశీలనలో ఉన్నాయి.పైన పేర్కొన్న వాటిని దృష్టిలో ఉంచుకుని రిజిస్ట్రీ భారత ప్రధాన న్యాయమూర్తి నుంచి తగిన ఆదేశాలను పొంది’ తదనుగుణంగా తగిన విషయాన్ని పోస్ట్ చేయాలి’ అని జనవరి 16న తన ఉత్తర్వులో సుప్రీంకోర్టు పేర్కొంది. లిఖితపూర్వక హేతుబద్ధమైన ఉత్తర్వు లేకుండా అటువంటి చర్యతీసుకున్న 24గంటల లోపు ఖాతాదారుకు తెలియజేయకుండా ఏ బ్యాంక్ ఖాతానూ స్తంభింపజేయరాదని సిఆర్‌పిసి యొక్క బిఎన్‌ఎస్‌ఎస్/ 102 (3) సెక్షన్ 106(3) కింద నిర్దేశించిన విధంగా ప్రతిస్తంభింపజేసే ఉత్తర్వును వెంటనే జ్యూరిస్‌డిక్షన్ పరిధి మెజిస్ట్రేట్‌కు నివేదించాలని పేర్కొంటూ ‘బి’ ప్రార్థన ఉన్న పిటిషన్‌ను పరిశీలించడానికి అత్యున్నత న్యాయస్థానం గతంలో అంగీకరించింది. దాని ప్రార్థన ‘సి’ అనేది సైబర్ క్రైమ్స్ దర్యాప్తుల సమయంలో బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం, నిలిపివేయడాన్ని నియంత్రించే ఏకరీతి ప్రామాణిక ఆపరేటింగ్ విధానాన్ని (ఎస్‌ఒపి) రూపొందించడానికి కేంద్రానికి, భారత రిజర్వ్ బ్యాంక్‌కు దిశానిర్దేశం చేయాలని ఆదేశం కోరుతుంది. తద్వారా ఏకపక్ష చర్యలను నిరోధించడానికి, దేశవ్యాప్తంగా సముచితమైన న్యాయాన్ని నిర్ధారించడానికి మార్గం సుగమం అవుతుంది. ముందస్తు సమాచారం లేకుండానే చర్య తీసుకున్నారని ఆరోపించిన పిటిషనర్ల బ్యాంక్ ఖాతాలను కేంద్రం స్తంభింపజేయడాన్ని కౌశిక్ ప్రారంభంలోనే ధర్మాసనం దృష్టికి తెచ్చారు. పిటిషన్ కాపీని మూడు రోజుల్లోగా కేంద్రానికి అందజేయాలని , ఈ విషయాన్ని వచ్చే వారం జాబితా చేయాలని జనవరి 6న అత్యున్నత న్యాయస్థానం కోరింది.దేశవ్యాప్తంగా ఉన్న సైబర్ సెల్స్ సహా అన్ని దర్యాప్తు సంస్థలకూ తగిన మార్గదర్శకాలను జారీ చేయాలని అటువంటి చర్య తీసుకున్న 24గంటలలోపు ఖాతాదారుడికి రాతపూర్వ, సహేతుకమైన ఉత్తర్వు,సమాచారం లేకుండా ఏ బ్యాంక్ ఖాతానూ స్తంభింపజేయకుండా చూసుకోవాలని కూడా పిటిషన్ కోరింది. ముందస్తు నోటీసు సమాచారం లేదా న్యాయపరమైన అనుమతి లేకుండా తమిళనాడు పోలీసుల సైబర్ సెల్ తన బ్యాంక్ ఖాతాలను ఏకపక్షంగా స్తంభింపజేయడం/నిలుపుదల చేయడం పట్ల తాను ఎంతగానో బాధపడ్డానని, తద్వారా రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 19 (1) (జి), 21 ప్రకారం తన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించిందని న్యాయవాది తుషార్ మనోహర్ ఖైర్నార్ ద్వారా పిటిషనర్ వివేక్ వర్ష్నీ దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కేసులో స్తంభింపజేసే ఉత్తర్వు పూర్తి ఆర్థిక స్తంభనకు దారితీసిందని, అవసరమైన ఖర్చులు, పన్నులు, అప్పుల చెల్లింపుతో సహా తన వృత్తిపరమైన, వ్యక్తిగత బాధ్యతను నిర్వర్తించకుండా పరిమితం చేసిందని పిటిషనర్ పేర్కొన్నారు. సైబర్ క్రైమ్ లేదా ఆర్థిక దర్యాప్తుల సమయంలో బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడం, స్తంభింపజేయడాన్ని నియంత్రించే ఏకరీతి విధానం లేదా ప్రామాణిక ఆపరేటింగ్ ప్రోటోకాల్ (ఎస్‌ఒపి) ప్రస్తుతం లేదని పిటిషన్ ప్రధానంగా ప్రస్తావించింది.‘అనవసరమైన వేధింపుల నుండి సామాన్యుడిని రక్షించడానికి మార్గదర్శకాలను రూపొందించాలి అని ఆ పిటిషన్ కోర్టును కోరింది. సైబర్ సెల్ ఖాతాలను స్తంభింపజేసే నోటీసులు జారీచేసే ఇలాంటి స్వభావం ఉన్న సందర్భాలలో ఏకరీతి విధానం, ఎస్‌ఒపి లు రూపొందించడానికి భారత హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖను ఆదేశించాలని కోర్టును కోరింది.

# పాత తరం తప్పుకోవాలి

### కొత్త తరం బాధ్యతలు చేపట్టాలి : నితిన్ గడ్కరీ



**నాగ్‌పూర్:** పరిస్థితులు సజావుగా సాగడం ప్రారంభించినప్పుడు పాత తరం తప్పుకోవాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. భవిష్యత్ తరం వారు ముఖ్యమైన బాధ్యతలను చేపట్టాలని సూచించారు. ‘అడ్వాంటేజ్ విదర్భ–ఖాస్దార్ ఉద్యోగిక్ మహోత్సవ్’ గురించి గడ్కరీ నాగ్‌పూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ప్రసంగించారు. దీనిని గడ్కరీ రూపొందించగా అసోసియేషన్ ఫర్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ (ఎఐడి) అధ్యక్షుడు ఆశిష్ కాలే నిర్వహిస్తున్నారు. కాలే యువ తరాన్ని అడ్వాంటేజ్ విదర్భ చొరవలో భాగస్వాములను చేశారని గడ్కరీ అన్నారు. క్రమంగా తరం మారాలని తాను నమ్ముతున్నానన్నారు. పాత తరం వారు క్రమంగా పదవీ విరమణ చేయాల్సిన సమయం ఆసన్నమైందని, బాధ్యతలు కొత్త తరం వారికి ఇవ్వాలని సూచించారు. బండి సజావుగా నడపడం ప్రారంభించినప్పుడు, మనం వెనక్కి వెళ్లి వేరే పని చేయాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 6 నుండి 8 వరకు నాగ్‌పూర్‌లో జరుగుతున్న అడ్వాంటేజ్ విదర్భ ఎక్స్‌పోలో ఇది మూడవ సంవత్సరం అని అన్నారు. విదర్భ ప్రాంతంలో వివిధ రంగాలలో చాలా మంచి వ్యవస్థాపకులు ఉన్నారని గడ్కరీ అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం లక్ష్యం భారతదేశ పారిశ్రామిక పటంలో విదర్భను బలమైన, అభివృద్ధి చెందుతున్న వృద్ధి కేంద్రంగా స్థాపించడమే అని ఆయన అన్నారు. ఏదైనా ప్రాంత అభివృద్ధికి పారిశ్రామిక రంగం, వ్యవసాయం, అనుబంధ రంగాలు, సేవా రంగం యొక్క ప్రాముఖ్యతను గడ్కరీ నొక్కిచెప్పారు.

# మోదీ ప్రభుత్వం ఇంకెంతకాలం తిరస్కరిస్తుంది?

### వాయుకాలుష్యంపై ప్రపంచ బ్యాంక్ నివేదికను ప్రస్తావించిన కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** వాయుకాలుష్యంపై ప్రపంచ బ్యాంక్ నివేదికను కాంగ్రెస్ ఆదివారం ఉటంకించింది. ఈ నివేదిక ఇండోగంగా మైదానాలు, హిమాలయ పర్వత ప్రాంతాలలో ప్రతీ ఏటా 10లక్షల అకాలమరణాలు సంభవిస్తాయని వెల్లడించిందని, నరేంద్రమోదీ ప్రభుత్వం ఇలా ఎంతకాలం ‘తిరస్కరణ’లో కాలం గడుపుతుందని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి, కమ్యూనికేషన్స్, కేంద్ర పర్యావరణ శాఖ మాజీ మంత్రి జైరాం రమేష్ మండిపడ్డారు. వాయు కాలుష్యం ప్రమాణాలను కఠినంగా, రాజీలేని విధంగా అమలుచేయడంతో సహా వాయుకాలుష్య ప్రేరిత ఆరోగ్య సంక్షోభం తీవ్రతరమవుతున్న నేపథ్యంలో తమ పార్టీ అనేక చర్యలను సూచించినా పెడచెవిన పెట్టడం శోచనీయమని జైరాం రమేష్ అన్నారు. ఈ ప్రాంతంలో ఎప్పుడూ దాదాపు 1 మిలియన్ అకాల మరణాలు చోటుచేసుకుంటున్నాయని, ప్రాంతీయ జిడిపిలో దాదాపు 10శాతం ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నాయని నివేదిక హైలెట్ చేస్తున్నదని జైరాం రమేష్ తన ‘ఎక్స్’ పోస్ట్‌లో తెలిపారు. ప్రజా రవాణా విస్తరణ, విద్యుద్దీకరణ, వాహన ఉద్గార, ఇంధన ప్రమాణాలను కఠినతరం చేయడం వంటి ఇతర విషయాలతో పాటు ఏమి చేయాలో నివేదిక వివరిస్తుందని రమేష్ అన్నారు. ‘ఇటీవలి సంవత్సరాలలో చాలా వాస్తవమైన ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఎక్యూఐ) ఆరోగ్య సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ పదేపదే వాయు కాలుష్య (నియంత్రణ, నివారణ1981, జాతీయ పరిసర వాయు నాణ్యత ప్రమాణాలు (ఎన్‌ఎఎక్యూఎస్) 2ను పిఎం 2.5 పై దృష్టి సారించి సమీక్షించాలని సూచిస్తోంది’ అని మాజీ పర్యావరణ శాఖ మంత్రి జైరాం రమేష్ తెలిపారు.ఆర్థిక వ్యయం, భౌగోళిక కవరేజీ పరంగా జాతీయ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సిఎపి) విస్తృత విస్తరణను కాంగ్రెస్ సూచించిందన్నారు. పనితీరు గంటకు 2.5 స్థాయిల కొలత కొలమానంగా ఉందని మాజీ పర్యావరణ శాఖ మంత్రి అయిన జైరాం రమేష్ అన్నారు.దక్షిణాసియాలో అత్యంత ఆరోగ్య, అభివృద్ధి సవాళ్లలో ఇండోగంగా మైదానాలు, హిమాలయ పర్వత ప్రాంతాలలో వాయు కాలుష్యం ఒకటి అని ప్రపంచ బ్యాంక్ నివేదిక పేర్కొంది.దేశ రాజధానిలో కాలుష్యం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడి వ్యాఖ్యలు చోటుచేసుకున్నాయి.

## మెజారిటీ లేని రాష్ట్రాల్లో మిత్రపక్షాలను
# అణగదొక్కడమే బిజెపి వ్యూహం

### రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్



**న్యూఢిల్లీ :** అధికారంలో లేని లేదా మెజారిటీ లేని రాష్ట్రాల్లో ఇతర రాజకీయ పార్టీలతో పొత్తు పెట్టుకుని అధికారంలోకి రావడమే బిజెపి రాజకీయ వ్యూహం అని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ పేర్కొన్నారు. ఈ తరువాత ఆ పార్టీలను నామరూపం లేకుండా చేయడమే కాషాయ పార్టీ ప్రధాన ఉద్దేశమని మండిపడ్డారు. ఈ వ్యూహం బిహార్‌లో విజయవంతమైందని, మహారాష్ట్రలో అమలు చేయబడుతోందని ఆయన అన్నారు. మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికలలో బిజెపి 2,869 సీట్లలో 1,425 సీట్లు గెలుచుకుంది, ముంబయి, పుణెలతో సహా డజనుకు పైగా మునిసిపల్ కార్పొరేషన్లలో ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది.

# ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

### లక్నోలో అత్యవసర ల్యాండింగ్



**న్యూఢిల్లీ :** ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా (పశ్చిమ బెంగాల్) ప్రయాణిస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడంతో లక్నోలో అత్యవసరంగా ల్యాండ్ చేయాల్సివచ్చింది. ఈ ఘటన ఆదివారం ఉదయం జరిగింది. అయితే, ఈ బాంబు బెదిరింపు గతంలోలాగా ఫోన్, మెయిల్, మెసేజ్ ద్వారా కాకుండా.. విమానంలో ఒక నోట్ ద్వారా వచ్చింది. విమానంలో ఒక టిష్యూ పేపర్‌పై గుర్తు తెలియని వ్యక్తి చేతితో ఈ బెదిరింపు పత్రం రాసినట్లు ఎసిపి రజనీష్ వర్మ తెలిపారు. ఇండిగో విమానం ఉదయం ఢిల్లీ నుంచి బాగ్డోగ్రా వెళ్తుండగా.. విమానంలో బాంబు ఉందని ఆ విమానంలోని టాయిలెట్‌లో ఉన్న ఒక టిష్యూ పేపర్‌పై చేతి రాతతో రాసి ఉండగా సిబ్బంది గుర్తించారు. దీంతో విమానంలోని పైలట్లు ఎటిసికి సమాచారం అందించారు. అనంతరం ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేసేందుకు అనుమతి తీసుకున్నారు. ఉదయం 9.17 గంటలకు లక్నో విమానాశ్రయంలో విమానాన్ని అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. ఈ సమయంలో విమానంలో 230 మంది ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది ఉన్నారు. విమానం ల్యాండ్ అయిన వెంటనే బాంబ్ స్క్వాడ్ సిఐఎస్ఎఫ్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల్ని తనిఖీ చేశారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు.

# గంగానదిలో పుణ్యస్నానాలు



**ప్రయోగ్‌రాజ్ :** ఉత్తరప్రదేశ్ ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మాఘమేళాలో ప్రధాన స్నానోత్సవం అయిన మౌని అమావాస్య సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 12 గంటల నాటికి 3.15 కోట్లకు పైగా భక్తులు గంగా నదిలో, సంగంలో పవిత్ర స్నానాలు చేశారని అధికారులు తెలిపారు. దట్టమైన పొగమంచును తట్టుకుని అర్ధరాత్రి నుండి భక్తులు గంగా, సంగం ఘాట్‌లకు రావడం ప్రారంభించారని, తెల్లవారుజామున అన్ని దిశల నుండి ప్రవాహం కొనసాగిందని మేళా పరిపాలన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలను అనుసరించి ఉదయం హెలికాప్టర్ నుండి భక్తులపై పూల రేకులు కురిపించినట్లు జిల్లా అధికారులు తెలిపారు. గతంలో, మకర సంక్రాంతి సందర్భంగా దాదాపు 1.03 కోట్ల మంది భక్తులు స్నానాలు చేయగా, ఏకాదశి నాడు దాదాపు 85 లక్షల మంది గంగా, సంగంలో స్నానం చేశారు. యాత్రికులు సరిగ్గా నావిగేట్ చేయడానికి మేళా ప్రాంతం అంతటా స్తంభాలపై ప్రతిబింబ టేపతిబింబ ఏర్పాటు చేశామని, భక్తులకు మార్గనిర్దేశం చేయడానికి పౌర రక్షణ వాలంటీర్లను నియమించామని డివిజనల్ కమిషనర్ సౌమ్య అగర్వాల్ తెలిపారు. మాఘమేళా 800 హెక్టార్లలో విస్తరించి ఏడు సెక్టార్లుగా విభజించబడిందని ఆమె చెప్పారు. మేళా ప్రాంతంలో 25,000 కంటే ఎక్కువ టాయిలెట్లు ఏర్పాటు చేయబడ్డాయని, పరిశుభ్రతను కాపాడుకోవడానికి 3,500 కంటే ఎక్కువ పారిశుద్ధ్య కార్మికులను నియమించారు. పర్యాటకులు, యాత్రికుల కోసం స్వల్పకాలిక కల్పవాస్ (శుద్ధీకరణ ఆచారాలు) ఆచరించడానికి, ధ్యానం, యోగా కోసం సౌకర్యాలతో కూడిన టెంట్ సిటీని ఏర్పాటు చేసినట్లు అగర్వాల్ తెలిపారు. సజావుగా ప్రయాణించడానికి, బైక్ టాక్సీలు, గోల్ఫ్ కార్ట్‌లు వంటి సేవలను కూడా అందించినట్లు తెలిపారు. భక్తుల భద్రత, సజావుగా ప్రయాణించడానికి మేళా ప్రాంతం అంతటా 10,000 మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించినట్లు పోలీసు సూపరింటెండెంట్ (మాఘమేళా) నీరజ్ పాండే తెలిపారు. రద్దీ నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం, ఈ సంవత్సరం లక్షకు పైగా వాహనాలను ఉంచే సామర్థ్యంతో 42 తాత్కాలిక పార్కింగ్ జోన్‌లను సృష్టించారు. 2025–26 మాఘమేళా కోసం మొత్తం 12,100 అడుగుల పొడవైన స్నానపు ఘాట్‌లను నిర్మించామని, అవసరమైన అమర్చామని చెప్పారు.

# చొరబాటుదారులను తరిమికొడతాం

### నాటి కాంగ్రెస్ సర్కార్ అసోం భూములను చొరబాటుదారులకు అప్పగించింది : ప్రధాని మోదీ



**కలియాబోర్:** భారత్ నుంచి చొరబాటుదారులను తరిమికొడుతామని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. ‘చొరబాటుదారులు జనాభా సమతుల్యతను దెబ్బతీస్తున్నారు, సంస్కృతిపై దాడి చేస్తున్నారు, పేదల, యువత ఉద్యోగాలను లాక్కుంటున్నారు. గిరిజన ప్రాంతాలలో మోసపూరితంగా భూములను ఆక్రమిస్తున్నారు. ఇది ముఖ్యంగా అసోం, దేశ భద్రతకు తీవ్రమైన ముప్పుగా పరిణమించింది’ అని ప్రధాని పేర్కొన్నారు. ఎన్నికలు జరగనున్న అసోంలో తన పర్యటనలో రెండో రోజు ఆదివారం కలియాబోర్‌లో జరిగిన ర్యాలీలో మోదీ పాల్గొని మాట్లాడారు. ఈశాన్య రాష్ట్రమైన అసోంలో తమ పాలన సమయంలో ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర భూములను చొరబాటుదారులకు అప్పగించిందని ఆ పార్టీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దశాబ్దాల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో చొరబాట్లు పెరుగుతూనే వచ్చాయని, అక్రమ వలసదారులు ‘అడవులు, జంతువుల సంచార మార్గాలు, సాంప్రదాయ సంస్థలను ఆక్రమించుకున్నారని మండిపడ్డారు. భూములను ఆక్రమించుకున్న చొరబాటుదారులను తొలగించడం ద్వారా బిజెపి ప్రభుత్వం అసోం గుర్తింపును, సంస్కృతిని కాపాడుతోందన్నారు. కాంగ్రెస్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన ప్రజలను హెచ్చరించారు, కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు దేశవ్యాప్తంగా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయని, బిహార్ ఎన్నికల సమయంలో, వారు చొరబాటుదారులను రక్షించడానికి మార్చ్‌లు, ర్యాలీలు నిర్వహించారు, కానీ అక్కడి ప్రజలు వారిని పూర్తిగా తిరస్కరించారన్నారు. అభివృద్ధి కోసం ఎటువంటి ఎజెండా లేనందున ప్రతిపక్షం దేశం విశ్వాసాన్ని కోల్పోయిందని, అటువంటి పార్టీ అసోం లేదా కజిరంగ ప్రయోజనాలకు ఎప్పటికీ సేవ చేయదని మోదీ తెలిపారు.

**భారత జీవవైవిధ్యానికి అమూల్యమైన రత్నం ‘కజిరంగ’**

కజిరంగ కేవలం జాతీయ ఉద్యానవనం కాదు, ‘అసోం ఆత్మ, భారతదేశ జీవవైవిధ్యానికి అమూల్యమైన రత్నం, దీనిని యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది’ అని ప్రధాని అన్నారు. రూ. 6,957 కోట్ల విలువైన కజిరంగ ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన చేసిన తర్వాత, రెండు అమృత్ భారత్ రైళ్లను వాస్తవంగా ప్రారంభించారు. అనంతరం నాగాంవ్ జిల్లాలో జరిగిన ర్యాలీలో మోదీ మాట్లాడారు. కాజిరంగ ఒక కొమ్ము గల ఖడ్గమృగానికి నిలయంగా ఉందని పేర్కొంటూ, వరదల సమయంలో వన్యప్రాణులు ఎత్తైన ప్రదేశాన్ని వెతుక్కుంటూ జాతీయ రహదారులను దాటవలసి వచ్చినప్పుడు సవాళ్లను ఎదుర్కొంటాయన్నారు. అడవిని సురక్షితంగా ఉంచుతూ సజావుగా రాకపోకలు సాగించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఎలివేటెడ్ కారిడార్ పూర్తయిన తర్వాత, వాహనాలు పై నుండి వెళ్తాయి, కింద వన్యప్రాణుల కదలికకు ఎటువంటి ఆటంకం ఉండదు, ఖడ్గమృగాలు, ఏనుగులు, పులుల సాంప్రదాయ ప్రయాణ మార్గాలను దృష్టిలో ఉంచుకుని డిజైన్ తయారు చేయబడుతుందని మోదీ అన్నారు. ఈ కారిడార్ ఎగువ అసోం, అరుణాచల్ ప్రదేశ్ మధ్య కనెక్టివిటీని కూడా మెరుగుపరుస్తుందని, కొత్త రైలు సేవలతో పాటు, ప్రజలకు కొత్త అవకాశాలను తెరుస్తుందని చెప్పారు.

## ఎఐడిఎంకె ఎన్నికల హామీలు
# డిఎంకె మేనిఫెస్టో ఫోటోకాపీ

### రాష్ట్ర మంత్రి టిఆర్‌బి రాజా



**చెన్నై:** తమిళనాడులో ప్రతిపక్ష ఎఐడిఎంకె శనివారం ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోపై అధికారి డిఎంకె మండిపడింది. ప్రస్తుతం డిఎంకె ప్రభుత్వ చొరవపై స్టిక్కర్లు అతికించినట్లుగా ఆ పార్టీ కొత్తగా ప్రకటించిన ఎన్నికల వాగ్దానాలను ఉన్నాయని మంత్రి టిఆర్‌బి రాజా పేర్కొన్నారు. మ్యానిఫెస్టోను ‘ఫోటోకాపీ‘ చేయడం ఎఐడిఎంకె సంప్రదాయంగా కొనసాగిస్తున్న ఆచారమని ఎద్దేవా చేశారు. ‘ప్రతి ఎన్నికలలో, డిఎంకె మేనిఫెస్టో ఒక హీరోగా నిలుస్తుంది. దానిని ఫోటోకాపీ చేసి తమ సొంతంగా విడుదల చేయడం ఎఐడిఎంకెకు ఒక సాధారణ అలవాటుగా మారిందన్నారు. ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ‘ద్రవిడ మోడల్’ ప్రభుత్వంలో ఇప్పటికే క్రియాశీలంగా ఉన్న పథకాల ‘నకిలీ నివేదిక‘గా ప్రతిపక్ష పార్టీ తాజా ప్రకటనలను ఆయన అభివర్ణించారు. 2021 ఎన్నికల సమయంలో డిఎంకె విడుదల చేసిన మేనిఫెస్టోను ప్రస్తావిస్తూ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కారణంగా వాగ్దానాలను నెరవేర్చలేమని ఎడప్పాడి పళనిస్వామి వాదించారని రాజా అన్నారు.‘మా ముఖ్యమంత్రి తమిళనాడును అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్లడమే కాకుండా, ప్రతిపక్ష నాయకుడు చేయలేమని చెప్పిన ప్రతి విషయాన్ని విజయవంతంగా అమలు చేశారు’ అని ఆయన అన్నారు. కాగా, ప్రతి కుటుంబ రేషన్ కార్డుదారునికి నెలవారీ రూ. 2,000 ఆర్థిక సహాయం, సిటీ బస్సుల్లో ప్రయాణించే పురుషులకు ఉచిత బస్సు ప్రయాణం, ఇతరత్రా అంశాలు పళనిస్వామి ఎన్నికల హామీలలో చేర్చారు.

## మరో ఇద్దరు
# మావోయిస్టులు ఎన్‌కౌంటర్

**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు నక్సలైట్లు మరణించిన మరుసటి రోజున ఆదివారం ఈ ప్రాంతంలో అదే ఆపరేషన్‌లో మరో ఇద్దరు మావోయిస్టులు హతమయ్యారని పోలీసులు తెలిపారు. జిల్లాలోని వాయువ్య ప్రాంతంలోని అటవీ కొండలలో ఉదయం తాజా కాల్పులు జరిగాయి. ఇక్కడ భద్రతా దళాల ఉమ్మడి బృందం నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ నిర్వహిస్తోందని బీజాపూర్ పోలీసు సూపరింటెండెంట్ జితేంద్ర యాదవ్ తెలిపారు. శనివారం జరిగిన అదే ఆపరేషన్‌లో నలుగురు మావోయిస్టులు మరణించారు. వారిని డివిజనల్ కమిటీ సభ్యుడు సీనియర్ కేడర్ దిలీప్ వేద్జా, ఏరియా కమిటీ సభ్యులు మాద్వి కోసా, లక్కీ మద్కం, పార్టీ సభ్యురాలు రాధా మెట్టాగా గుర్తించారు. నలుగురూ మావోయిస్టుల నేషనల్ పార్క్ ఏరియా కమిటీలో చురుకుగా ఉన్నారని ఎస్‌పి తెలిపారు. ఆదివారం మృతి చెందిన ఇద్దరు మావోయిస్టుల ఇంకా గుర్తించలేదన్నారు. స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టిఎఫ్), డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి), రెండు పోలీసు విభాగాలు, సిఆర్‌పిఎఫ్ ఎలైట్ గ్రూప్ అయిన కోబ్రా (కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్) సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొంటున్నారు. వేద్జా, ఇతర సాయుధ దళాలు ఈ ప్రాంతంలో ఉన్నాయనే నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు శనివారం ఈ ఆపరేషన్ ప్రారంభించబడింది. ఎన్‌కౌంటర్ ప్రదేశాల నుండి ఎకె47 రైఫిల్, ఇన్సాస్ రైఫిల్, కార్బైన్, .303 రైఫిల్‌తో సహా ఆరు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నట్లు అధికారి తెలిపారు. ఈ ఆపరేషన్‌తో, ఈ సంవత్సరం ఇప్పటివరకు రాష్ట్రంలో జరిగిన వేర్వేరు ఎన్‌కౌంటర్లలో కనీసం 20 మంది మావోయిస్టులు మరణించారు. జనవరి 3న, బిజాపూర్‌తో సహా ఏడు జిల్లాలను కలిగి ఉన్న బస్తర్ ప్రాంతంలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో మొత్తం 14 మంది మావోయిస్టులు హతమయ్యారు. గత సంవత్సరం, రాష్ట్రంలో భద్రతా దళాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో 285 మంది మావోయిస్టులు మరణించారు.

## మంచు కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై వాహనాలు ఢీ..
# మంటల్లో ఇద్దరు సజీవ దహనం



**చండీగఢ్:** మంచు కారణంగా ఎక్స్‌ప్రెస్‌వేపై పలు వాహనాలు ఢీకొన్నాయి. మంటలు చెలరేగడంతో ఒక వాహనంలోని ఇద్దరు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. ఈ సంఘటన నేపథ్యంలో ఆ జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. హర్యానాలోని నుహ్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో పొగమంచు కారణంగా కుండ్లిమనేసర్‌పల్వాల్ (కెఎంపి) ఎక్స్‌ప్రెస్‌వేపై పలు వాహనాలు ఢీకొన్నాయి. కాగా, ఒక భారీ వాహనం ఆకస్మికంగా బ్రేక్‌లు వేయడంతో ఈ ప్రమాదం జరిగింది. దాని వెనుక ఉన్న వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. కంకర లోడ్ ఉన్న డంపర్, అమెజాన్ వస్తువులను రవాణా చేస్తున్న కంటైనర్‌లో మంటలు వ్యాపించాయి. డంపర్‌లో ఉన్న రాజస్థాన్‌కు చెందిన డ్రైవర్, హెల్పర్ మంటల్లో కాలి సజీవ దహనమయ్యారు. గాయపడిన మరి కొందరిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు గురుగ్రామ్ నుంచి లక్నో వెళ్తున్న అమెజాన్ కంటైనర్‌లో బట్టలు, షూస్, మొబైల్ ఫోన్లు వంటి వస్తువులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మంటల కారణంగా సరుకు పూర్తిగా దగ్ధమైందని చెప్పారు. సుమారు రూ.1.25 కోట్ల నష్టం వాటిల్లిందని అంచనా వేశారు. రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన కొన్ని పార్సిల్‌ను కొందరు వ్యక్తులు ఎత్తుకెళ్లగా మిగతా వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మూడు గంటలు శ్రమించి మంటలను ఆర్పివేశారు. ఆ తర్వాత క్రేన్ సహాయంతో దగ్ధమైన వాహనాలను రోడ్డు పక్కకు తొలగించారు. ఈ ప్రమాదం వల్ల సుమారు ఆరు కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు నాలుగు గంటలకుపైగా శ్రమించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. అయితే ఒక డంపర్, అమెజాన్ పార్సిల్ కంటైనర్, మూడు ట్రైలర్స్ ఈ ప్రమాదంలో ధ్వంసమైనట్లు పోలీస్ అధికారి తెలిపారు. సజీవ దహనమైన డంపర్ డ్రైవర్, హెల్పర్ మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం తరలించినట్లు చెప్పారు. చలికాలంలో వాహన డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## రూ.7.65 చోరీ కేసు..
# 50 ఏళ్ల తర్వాత తీర్పు

**ముంబయి:** మహారాష్ట్రలో యాభై ఏళ్ల క్రితం నాటి ఓ చోరీ కేసుకు సంబంధించి ముంబయి కోర్టు తాజాగా తుది తీర్పు వెలువరించింది. ఎన్నో ఏళ్లు నిందితుల గురించి పోలీసులు వెతికినప్పటికీ వారి ఆచూకీ లభించలేదు. దీంతో కోర్టు ఈ కేసుకు తాజాగా ముగింపు పలికింది. ఇంతకీ చోరీ అయిన మొత్తం ఎంతో తెలుసా.. 7.65 రూపాయలు. 50 ఏళ్ల క్రితం అంటే 1977లో రూ. 7.65 అంటే కొంచెం పెద్ద మొత్తమే. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఎంత ప్రయత్నించినా నిందితులను మాత్రం పట్టుకోలేకపోయారు. దక్షిణ ముంబయిలోని మజగావ్ న్యాయస్థానం తాజాగా పాత కేసులపై దృష్టి సారించింది. ఈ క్రమంలో 1977 నాటి రూ.7.65 కేసు వెలికి తీసింది. 1977 నుంచి ఈ కేసు పెండింగ్‌లోనే ఉంది. రూ.7.65 చోరీ కేసులో అప్పట్లో ఇద్దరు వ్యక్తులపై ఫిర్యాదు అందింది. ఆ ఇద్దరి కోసం పోలీసులు ఎంత గాలించినా, అనేక సార్లు నాన్‌బెయిలబుల్ వారెంట్లు జారీ చేసినా ప్రయోజనం లేకపోయింది. దాదాపు 50 ఏళ్లుగా మరుగున పడి ఉన్న ఈ కేసు ఇటీవల విచారణకు వచ్చింది. ఈ కేసును పెండింగ్‌లో ఉంచడంలో అర్థం లేదని మజగావ్ న్యాయస్థానం అభిప్రాయపడింది. దాదాపు 50 ఏళ్ల నాటి ఈ కేసులో ఎటువంటి పురోగతీ లేకపోడంతో నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టేసింది.


# సమాజహితం... సాహిత్యఫలం..



సాహిత్యం అణగారినవారిని, పేదలను, దోపిడీకి గురవుతున్న వారికి ఎందుకు ప్రాతినిధ్యం వహించాలి అనే ప్రశ్న సంప్రదాయవాదుల నుంచి మత ఛాందుల నుంచి ఇటీవలి కాలంలో బలంగా వినిపిస్తున్నది. వివిధ రచనా ప్రక్రియలను మతానికి, మత విశ్వాసాలకు, రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు వాడుకుంటున్న తరుణంలో, ఈ ప్రశ్నకు సమాధానం అన్వేషించాల్సిన అవసరం ఏర్పడింది. నిజానికి ఈ ప్రశ్న, సాహిత్యం అంటే ఏమిటి? అనే మూల ప్రశ్నతో ముడిపడి ఉంది. సాహిత్యం కేవలం వినోదం కోసం, సౌందర్యాస్వాదన కోసం మాత్రమే అయితే, అది సమాజానికి బాధ్యత వహించనవసరం లేదు. కానీ, సాహిత్యం ఒక సామాజిక చర్యగా, మానవ అనుభవాల సాక్ష్యంగా, చరిత్రకు నైతిక అద్దంగా ఉంటే, అది తప్పనిసరిగా అణగారిన వర్గాల వైపు తిరగాలి. ఎందుకంటే సమాజంలోని అసమానతలు, అన్యాయాలు, దోపిడీలు అత్యంత తీవ్రంగా అనుభవించేది వారే. ప్రపంచ జనాభాలో అత్యధిక సంఖ్య కూడా వారిదే. అందుకే, వారికి సంబంధించిన అంశాలకే ప్రాధాన్యం పెరిగితీరాలి. చరిత్రను పరిశీలిస్తే, అధికారంలో ఉన్నవారి కథలు ఇప్పటికే అనేక రూపాల్లో నమోదయ్యాయి. రాజులు, సామ్రాజ్యాలు, ధనిక వర్గాలు తమ విజయాలను శిల్పాల్లో, గ్రంథాల్లో, చరిత్ర పుస్తకాల్లో శాశ్వతంగా నిలిపాయి. కానీ కూలీ జీవితం, రైతు కన్నీరు, కార్మికుడి శ్రమ, మహిళల అణచివేత, దళితుల అవమానం వంటి దారుణాలు కొన్ని శతాబ్దాలపాటు మౌనంగా మిగిలిపోయాయి. ఈ మౌనాన్ని భగ్నం చేయగల శక్తి సాహిత్యానికి మాత్రమే ఉంది. అందుకే సాహిత్యం అణగారినవారి వైపు నిలబడాలి. పేదరికం కేవలం ఆర్థిక లోపం కాదు. అది ఒక మానవ అనుభవం. ఆకలి, భయం, అవమానం, అస్థిరత కలగలిసిన దుస్థితి. ఈ అనుభవాన్ని గణాంకాలు, ప్రభుత్వ నివేదికలు పూర్తిగా ఆవిష్కరించవు. కానీ ఒక కథ, ఒక కవిత, ఒక నవల ఆ బాధను మనసుకు తాకేలా నిజాలు చెప్పగలుగుతుంది. సాహిత్యం పేదరికాన్ని సంఖ్యగా కాదు, మనిషిగా చూపిస్తుంది. ఇది సాహిత్యం నిర్వహించే అత్యంత ముఖ్యమైన నైతిక బాధ్యత. దోపిడీకి గురవుతున్న వర్గాలు... సాధారణంగా మాట్లాడే అవకాశం లేని మనుషులు.... వారి గొంతులు రాజకీయ వ్యవస్థల్లో, మీడియా వేదికల్లో, అధికార భాషల్లో వినిపించవు. అలాంటి సమయంలోనే, సాహిత్యం ఆ మౌన గొంతులకు భాషను ఇస్తుంది. రచయిత ఒక మధ్యవర్తి కాదు; ఒక బాధ్యత గల సాక్షి. అతడు చూసిన అన్యాయాన్ని, అనుభవించిన అసమానతను, వినిపించని అరుపును మాటలుగా మార్చాలి. అలా చేయకపోతే, సాహిత్యం తన మానవ బాధ్యతను విస్మరించినట్టే అవుతుంది. కాగా, సాహిత్యం అణగారినవారిని ప్రతినిధ్యం వహించాల్సిన మరో కారణం 'నిజం'. సమాజంలోని నిజం ఎప్పుడూ పై వర్గాల జీవితాల్లో ఉండదు. అది వీధుల్లో, పొలాల్లో, ఫ్యాక్టరీల్లో, గనుల్లో, మురికివాడల్లో ఉంటుంది. అక్కడే జీవితం అత్యంత ముడి రూపంలో కనిపిస్తుంది. వాస్తవ పరిస్థితులను పరిచయం చేస్తుంది. అక్కడే శ్రమ ఉంటుంది. ఆకలి ఉంటుంది. అంతర్లీనంగా ప్రతిఘటన అభిలాష కూడా ఉంటుంది. ఈ నిజాన్ని పక్కన పెట్టి చేసే రచనలు అసత్యాలు లేదా అర్ధ సత్యాలు మాత్రమే. సంపూర్ణ సత్యం అణగారిన వర్గాల అనుభవాలను గమనిస్తేనే తెలుస్తుంది. పరిశీలిస్తేనే అర్థమవుతుంది. సమీక్షిస్తేనే రచన పండుతుంది. సాహిత్యం కేవలం 'అద్దం' మాదిరి ఉన్న పరిస్థితులను ప్రతిబింబించడం వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదన్న ప్రముఖ రచయిత, సాహిత్య పరిశోధకుడు ఏటుకూరి ప్రసాద్ అభిప్రాయాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవాలి. సాహిత్యం సమాజాన్ని కేవలం ప్రతిబింబించడంతోపాటు, లోపాలను ప్రశ్నించాలి. ఇలా ఎందుకు జరుగుతోంది? అనే ప్రశ్న సామాజికంగా, ఆర్థికంగా దోపిడికి గురైన వర్గాల జీవితాల నుంచే ఉద్భవిస్తుంది. ఎందుకు ఒక వర్గం నిరంతరం శ్రమిస్తూనే పేదగానే ఉంటుంది? ఎందుకు కొందరి సంపద మరి కొందరి ఆకలిపై నిలబడుతుంది? ఈ ప్రశ్నలు సాహిత్యంలోకి వచ్చినప్పుడే, అది విమర్శాత్మక శక్తిగా మారుతుంది. అణగారినవారి జీవితాలను రాయడం ద్వారా సాహిత్యం ఈ ప్రశ్నలను సమాజం ముందుకు తెస్తుంది. చాలా కాలం పాటు సాహిత్యం ఉన్నత లేదా సంపన్న వర్గాల భాషలో, వారి అభిరుచులకు అనుగుణంగా రూపొందింది. క్లిష్టమైన భాష, అలంకారిక శైలి, రాజస వాతావరణం వంటి అంశాలే సాహిత్యానికి ప్రమాణాలుగా పేర్కొన్నారు. ముద్ర వేశారు. సంకెళ్లు బిగించారు. ఆలోచనలకు పరిధులు నిర్ణయించారు. కానీ అట్టడుగు వర్గాల అనుభవాలు సాహిత్యంలోకి ప్రవేశించకుండా ఎవరూ నిలువరించలేకపోయారు. ఫలితంగా, సాహిత్యం భాష సరళంగా మారింది. స్పష్టత పెరిగింది. ప్రజల మాటగా మారింది. ఈ పరిణామాన్నిసాహిత్య ప్రజాస్వామ్యీకరణగా పేర్కోవచ్చు. పేదల కథలు రాయడం.. వెతలు ప్రస్తావించడం అంటే కేవలం అంశాన్ని లేదా శిల్పాన్ని మార్చడం కాదు.. సాహిత్య నిర్మాణాన్ని మార్చడం. అణగారిన ప్రజలకు ప్రతినిధ్యం వహించే సాహిత్యం కేవలం వారి మాత్రమే పరిమితం కాదు.. అది సమాజం మొత్తానికి అవసరం. ఎందుకంటే, అలాంటి సానుభూతిని పెంచుతుంది. మనకు ప్రత్యక్షంగా అనుభవం లేని బాధను, సాహిత్యం మనసులోకి తీసుకువస్తుంది. ఒక దళితుడి అవమానం, ఒక కార్మికుడి శ్రమ, ఒక పేద మహిళ నిస్సహాయత వంటి అంశాలను చదివినప్పుడు పాఠకుడు తన సౌకర్య స్థితిని ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. ఇది సాహిత్యం కలిగించే నైతిక అసౌకర్యం. ఈ అసౌకర్యమే మార్పుకు మొదటి మెట్టు. 'చరిత్ర' కూడా సాహిత్యంమవ కీలక పాత్ర పోషించింది. ఇప్పటికీ పోషిస్తునే ఉంది. అయితే, అధికారిక చరిత్రలు ఎక్కువగా విజేతల కథలే. ఓడిపోయినవారి గురించి ప్రస్తావన ఎక్కడా ఉండదు. కానీ, అణచివేతకు గురైన వారి చరిత్రలే సాహిత్యంలోనే ఎక్కువ కాలం నిలుస్తాయి. ఈ సాహిత్యమే భవిష్యత్తు తరాలకు ఇది కూడా జరిగింది అని చెప్పే ఆధారం. అణగారినవారి కథలు లేకపోతే, చరిత్ర అసంపూర్ణం. ఈ కోణంలో చూస్తేనా, సాహిత్యం అత్యధికుల పక్షాన లేదా అణచివేతకు గురైన వర్గాల పక్షపాతిగా ఉండాల్సిన అవసరం స్పష్టమవుతుంది. సాహిత్యం రాజకీయాలకు దూరంగా ఉండాలన్నది కొంత మంది వాదన. కానీ, తరచి చూస్తే, అణచివేతకు గురైన వారి జీవితాలన్నీ ఆయా కాలాల రాజకీయా పరిస్థితులకు ప్రతిబింబాలే. వారి ఆకలి, వారి శ్రమ, వారి అవమానం.. అన్నీ రాజకీయ నిర్ణయాల ఫలితాలే. వాటిని ప్రస్తావించడం రాజకీయీకరణ అనిపించుకోదు. అది ముమ్మాటికీ రాజకీయ వాస్తవాన్ని అంగీకరించడం. సాహిత్యం తటస్థంగా ఉండాలన్న మరో చిత్రమైన వాదన కూడా వినిపిస్తుంది. ఈ ఆలోచన, దోపిడీ వర్గాలకు కొమ్ముకాచే రచయితల నుంచి మాత్రమే వస్తుందనేది బహిరంగ రహస్యం. అణగారినవారికి తటస్థత అనే అవకాశం ఉండదు. శతాబ్దాల అణచివేతను ఎదుర్కోవడానికి వారిని ఆలోచింప చేయడం.. ప్రశ్నించే గుణాన్ని రగిలించడం.. కొత్త ఉత్సాహాన్ని నింపడం సాహిత్యం ధర్మం. వారి గురించి రాయడం అంటే వారి పట్ల దయ చూపడం కాదు.. వారిని గౌరవించడం. వారిని బాధితులుగా చూడడం కాదు.. ధిక్కరించే పోరాట యోధులుగా, మార్పుకోరే మనుషులుగా చూపడం. ఇది సాహిత్య కనీస బాధ్యత. సాహిత్యం వారిని కేవలం ప్రతినిధ్యం వహించదు.. వారిని చరిత్రలో క్రియాశీల పాత్రలుగా నిలుపుతుంది. ఏ రకంగా చూసినా, సాహిత్యం అణగారినవారిని, పేదలను, దోపిడీకి గురవుతున్న వారిని ప్రతినిధ్యం వహించాలనేది ఐచ్ఛికం కాదు. ఒక నైతిక అవసరం. సాహిత్యం మానవ అనుభవాల సంపూర్ణ చిత్రాన్ని ఆవిష్కరించాలంటే, సమాజంలోని అతి బలహీన వర్గాల జీవితాలు అందులో ఉండితీరాలి. వారి కథలు లేకుండా సాహిత్యం అందంగా ఉండొచ్చు, కానీ నిజంగా ఉండదు. మానవీయ కోణం ఉండదు. మానవతను చూపలేని సాహిత్యం ఎందుకు? ఎవరిని ఉద్ధరించడానికి?


– బిఎల్

సాహిత్యం పరీక్షల కోసం పుట్టిన పాఠ్యాంశం కాదు.. రచన ఏదైనా, అది మనిషి అనుభూతి నుంచి పుట్టిన జీవంతమైన కళ. నిజంగా కవిత్వాన్ని అనుభవించినప్పుడు, మనలో ఒక కొత్త భావం మేల్కొంటుంది లేదా పాత అనుభూతి కొత్తగా పునర్జన్మిస్తుంది. అందుకే సాహిత్యం ఇంతకాలంగా నిలిచి ఉంది.... దానికి మనిషి అంతఃకరణాన్ని తాకగలిగే శక్తి కలిగి ఉంది. పదాలు, చర్యలు, భావాలు పరస్పరం కలిసే విధానం నుంచే సాహితీ ప్రక్రియలు ఉద్భవించాయి. ఒకే మాట వేర్వేరు వ్యక్తుల చేతిలో వేర్వేరు లోతులను సంతరించుకుంటుంది. కొన్ని ప్రయోగాలు పైపైగా ఉంటే, మరికొన్ని మనల్ని లోపలికి తీసుకెళ్తాయి. ఆ లోతునే రచనలు అన్వేషిస్తుంటాయి. కవిత్వం పుస్తకాల ద్వారా మన దగ్గరకు వచ్చినా, అది నిజంగా జీవించాలంటే పాఠకుడి అంతర్గత స్పందన అవసరం. మన జ్ఞాపకాలు, భావోద్వేగాలు, శరీరస్పందన... ఇవే కవితకు ప్రాణం పోస్తాయి. కవిత్వాన్ని కేవలం అర్థం చేసుకోవడం కాదు, దానిని మనలోకి అనుమతించడం ముఖ్యం. చదివేటప్పుడు కవి మనకంటే దిగువగా మాట్లాడుతున్నట్టు అనిపించకూడదు.. మనమే అతని స్థాయికి ఎదిగి చదవాలి. కవిత్వం ప్రతి రోజు కొత్తదిగా అనిపిస్తుంది. ఒకే సూర్యుడిని వేర్వేరు మనుషులు వేర్వేరు రీతుల్లో చూసినట్లే, ఒకే కవిత కూడా ప్రతి పాఠకుడికి భిన్నంగా అనుభూతి ఇస్తుంది. ఈ విధంగా కవిత్వం ప్రపంచాన్ని వ్యక్తిగతంగా స్వంతం చేసుకునే అత్యంత లోతైన మార్గాన్ని మనకు అందిస్తుంది. అందుకే కవిత్వాన్ని ఆస్వాదించడమంటే, దానిని త్వరగా ముగించడం కాదు, దానితో కొంతసేపు జీవించడం. అప్పుడు మాత్రమే అది మనకు ఇవ్వగలిగిన నిజమైన ఆనందం, అవగాహన లభిస్తాయి.



## 'జార్జ్ ఆర్వెల్'ను చదవడానికి ధైర్యం అవసరం

జార్జ్ ఆర్వెల్‌ను చదవడం కేవలం ఒక సాహిత్య అనుభవం. నైతిక అసౌకర్యాన్ని స్వీకరించే ధైర్యం. ఆయన రచనలు పాఠకుణ్ణి ఊరడించవు. సమస్యల నుంచి పారిపోవడానికి దారులు చూపవు. అవి నేరుగా మన ఆలోచనల మధ్య నిలబడి ప్రశ్నిస్తాయి. అధికారానికి నిజం అసౌకర్యంగా మారిన వేళ, రచయిత ఎక్కడ నిలబడాలి అనే ప్రశ్నకు ఆర్వెల్ తన జీవితం, రచనల ద్వారా 'సత్యం వైపు' మాత్రమే నిలబడతానన్న సమాధానం.. సందేశం ఇచ్చాడు. 1903లో బ్రిటిష్ ఇండియాలో జన్మించిన ఎరిక్ ఆర్థర్ బ్లేర్, తరువాత జార్జ్ ఆర్వెల్‌గా ప్రపంచానికి పరిచయమయ్యాడు. సామాజికంగా గౌరవం ఉన్నా ఆర్థికంగా అస్థిరమైన కుటుంబంలో పెరిగిన ఆర్వెల్, చిన్ననాటి నుంచే వర్గ భేదాల గమనించాడు. అనుభవించాడు. ప్రతిష్ఠాత్మక పాఠశాలల్లో చదువుతున్న సమయంలో కూడా, ధనం లేని ప్రతిభ ఎలా అవమానానికి గురవుతుందో ప్రత్యక్షంగా చూశాడు. ఈ అనుభవాలే అధికార వ్యవస్థల పట్ల ఆయనలో సహజమైన అనుమానాన్ని పెంచాయి. బర్మా (నేటి మయన్మార్)లో బ్రిటిష్ సామ్రాజ్య పోలీస్ అధికారిగా పనిచేసిన కాలం ఆర్వెల్ జీవితంలో కీలక మలుపు. అక్కడే అణచివేత పాలన బాధితులను మాత్రమే కాదు, పాలకులను కూడా నైతికంగా పాడు చేస్తుంది' అనే ఒక కఠినమైన నిజాన్ని ఆయన గ్రహించాడు. 'షూటింగ్ యాన్ ఎలిఫెంట్' వంటి వ్యా సాలు సామ్రాజ్యవాదం అమానుషత్వా న్ని, అధికారంలో ఉన్న వ్యక్తి అంతర్లీన అసహాయతను బహిర్గతం చేస్తాయి. చివరికి ఆయన ఆ ఉద్యోగాన్ని వదిలి, రచననే తన ప్రతిఘటనా పథంగా ఎంచుకున్నాడు. రచయితగా మారిన తరువాత ఆర్వెల్ ఉద్దేశపూర్వకంగానే పేదల జీవితాన్ని అనుభవించాడు. పారిస్, లండన్‌లలో నిరాశ్రయులు, కార్మికులతో కలిసి జీవిస్తూ, నాగరిక సమాజం దాచిపెట్టిన నిజాలను చూశాడు. 'డౌన్ అండ్ అవుట్ ఇన్ పారిస్ అండ్ లండన్' ఈ అనుభవాల ప్రత్యక్ష ఫలితం. జార్జ్ ఆర్వెల్ అనే కలం పేరు కూడా సాధారణ ప్రజలతో తన అనుబంధానికి ప్ర తీక. ఆర్వెల్ రాజకీయంగా సామ్యవాదానికి దగ్గరగా ఉన్నప్పటికీ, ఏ భావజాలానికీ అంధ భక్తుడు కాలేదు. స్పానిష్ సివిల్ వార్‌లో పాల్గొన్నప్పుడు, ఫాసిజంతో పాటు స్టాలినిజం చేసిన ద్రోహాన్ని కూడా ప్రత్యక్షంగా చూశా డు. 'హోమేజ్ టు కాటలోనియా' ఆయన రాజకీయ నిజాయితీకి సాక్ష్యం. తనకు అనుకూలంగా లేని నిజాన్ని కూడా నిర్భయంగా రాయగల ధైర్యమే ఆర్వెల్ ప్రత్యేకత. 'యానిమల్ ఫార్మ్', 'నైన్టీన్ ఎయిటీ ఫోర్' (1984) వం టి రచనలు ఆయన ఆలోచనల శిఖరాలు. ఇవి కేవలం రాజకీయ రూపకా లు... అధికార దుర్వినియోగం, ప్రచారం, భాషా వక్రీకరణలపై తీవ్రమైన హెచ్చరికలు... ముఖ్యంగా భాషను అస్పష్టంగా మార్చడం ద్వారా నిజాన్ని ఎలా చంపుతారో ఆయన చూపించిన తీరు, ఈ రోజుకీ అంతే సమకాలీనం గా ఉంది. ఆర్వెల్‌ను నవలా రచయితగా మాత్రమే గుర్తించడం అన్యా యం. తన జీవితంలో ఎక్కువ భాగం ఆయన జర్నలిస్టు, వ్యాసకర్త, విమర్శకుడర, సమాజాన్ని దగ్గర నుంచి గమనించిన ప్రత్యక్ష సాక్షి. 'ది రోడ్ టు విగాన్ పియర్'లో కార్మిక వర్గ జీవనాన్ని, తరగతి విభజనల క్రూరత్వా న్ని నిర్భయంగా చిత్రించాడు. సాహిత్య విమర్శకుడిగా ఆయన స్పష్టత, నైతిక బలం ప్రసిద్ధి చెందాయి. ఏ రచన చదివినా, 'పేజీ వెనుక ఎక్కడో ఒక ముఖం కనిపిస్తుంది' అనే ఆయన వ్యాఖ్య, రచన–రచయిత వ్యక్తిత్వాల మధ్య ఉన్న అనుబంధాన్ని లోతుగా తెలియజేస్తుంది. సత్యం ఎప్పుడూ సౌకర్యంగా ఉండదు. కానీ దాన్ని వదిలిపెడితే మానవత్వమే ప్రమాదంలో పడుతుందనే ఒక స్పష్టమైన సందేశాన్ని ఆర్వెల్ వారసత్వం మనకు అందిస్తుంది. ఆర్వెల్ మనల్ని ఊరడించలేదు.. మేల్కొలిపాడు. అందుకే ఆయన రచనలు కాలాన్ని దాటి, ఇంకా మన వెంటే నడుస్తున్నాయి.




## కమ్యూనిజంతో కొత్త ఒరవడి...




నిజమైన సాహిత్యం ఎప్పుడూ సమాజంతో నిమమేకమవుతుంది. సమాజంలోని ఆర్థిక నిర్మాణాలు, రాజకీయ శక్తులు, వర్గ సంబంధాలు, చరిత్రాత్మక సంక్షోభాల మధ్యనే రూపుదిద్దుకుంది. ఈ వాస్తవాన్ని అత్యంత స్పష్టంగా, ఎలాంటి భేషజాలు లేకుండా వెల్లడించే సిద్ధాంతమే కమ్యూనిజం. ప్రపంచ సాహిత్యంపై ప్రభావం చూపిన సామాజిక అంశాలను.. కమ్యూనిజం భావజాలాన్ని రాజకీయ కోణంలో మాత్రమే చూడడం పొరపాటు. శ్రమ దోపిడీని వ్యతిరేకించి, సమసమాజాన్ని కమ్యూనిజం కోరుకుంటుంది. అందుకే, అది సాహిత్య దృష్టికోణాన్నే మౌలికంగా మార్చిన చారిత్రక పరిణామంగా నిలుస్తుంది. వ్యక్తిగత భావోద్వేగాలకే పరిమితమైన సాహిత్యాన్ని, సామాజిక బాధ్యతగా మార్చిన శక్తి కమ్యూనిజం. కార్ల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతిక వాద సిద్ధాంతం సాహిత్యానికి ఒక కొత్త అవగాహనను ఇచ్చింది. సాహిత్యం అనేది శాశ్వత మానవ స్వభావానికి ప్రతిబింబం అనే భావనకు బదులుగా, అది నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల ఫలితం అనే కొత్త ఆలోచన తెరపైకి తెచ్చింది. వర్గ పోరాటమే చరిత్రకు మూలమైతే, సాహి త్యం ఆ పోరాటానికి ఒక సాంస్కృతిక ప్రతిరూపం అనే అవగాహన ఏర్పడింది. ఈ దృష్టి సాహిత్య విమర్శలో, రచనా పద్ధతుల్లో, పాత్ర నిర్మాణంలో, భాష వినియోగంలో విప్లవాత్మక మార్పులకు దారితీసింది. పదొమ్మిదవ శతాబ్దం చివరి వరకు యూరప్ సాహిత్యం ప్రధానంగా మధ్యతరగతి లేదా అరిస్టోక్రాటిక్ అనుభవాలను ప్రతిబింబించింది. పరిశ్రమల విప్లవం వల్ల పుట్టిన కార్మిక వర్గం సాహిత్యంలో కనిపించినా, అది ప్రధాన పాత్రగా కాదు, నేపథ్యంగా మాత్రమే ఉండేది. కమ్యూనిజం ఈపరిస్థితిని తల్లకిందులు చేసింది. కార్మికుడు, రైతు, పేదవాడు, అణగారిన వర్గాలు సాహిత్యంలో చరిత్ర సృష్టించే శక్తులుగా ప్రవేశించాయి. పాత్రలు మాత్రమేకాదు.. కథ కేంద్ర బిందువు మారింది. రష్యన్ విప్లవం తరువాత సాహిత్యం పొందిన మార్పు దీనికి స్పష్టమైన ఉదాహరణ. మాక్సిమ్ గోర్కీ రచనల్లో కార్మిక వర్గం ఒక దయనీయ స్థితిలో ఉన్న సమూహంగా కాకుండా, చైతన్యంతో కూడిన చారిత్రక శక్తిగా కనిపిస్తుంది. 'మదర్' నవలలో తల్లి పాత్ర వ్యక్తిగత మాతృత్వాన్ని మించి, సామూహిక రాజకీయ చైతన్యానికి ప్రతీకగా గోచరిస్తుంది. ఇది కమ్యూనిస్టు సాహిత్యం తీసుకువచ్చిన కొత్త పాత్ర నిర్మాణ పద్ధతి. సాహిత్యం తటస్థంగా ఉండలేదనే ఈ భావన స్పష్టంగా మా ర్క్సిస్టు ప్రభావంతోనే పుట్టింది. రచయిత తన కాలానికి, తన సమాజానికి జవాబుదారీ అనే ఆలోచన, అప్పటి వరకూ కొనసాగుతున్న ఆధునిక సాహిత్య మౌలిక స్వరూపాన్ని మార్చింది. తెలుగు సాహిత్యంలో కమ్యూనిజం ప్రభావం భాషా స్థాయిలోనే ఒక విప్లవాన్ని తెచ్చింది. శ్రీశ్రీ కవిత్వం సాంప్రదాయ కవితా భాషను పక్కకునెట్టింది. ప్రజల మాటను సాహిత్యంగా మార్చిం ది. ఇది కమ్యూనిజం చేసిన అత్యంత కీలక సా హిత్య సేవ. సరళమైన భాషలో ప్రజలకు చేరడం ద్వారా సాహిత్యం అధికార కేంద్రాల నుంచి జనబాహుళ్యం చేతుల్లోకి వచ్చింది. హక్కుల నినాదం... కార్మికుడి మాట.. రైతు ఆవేదన... శ్వేదం వలువ వంటివి సాహిత్యంలో కీలకంగా మారాయి. సాహిత్యాన్ని సామాజిక బాధ్యతతో ముడిపెట్టడం, అణగారిన వర్గాల అనుభవాలను కేంద్రంగా నిలపడం, భాషను ప్రజల వైపు మళ్లించడం వంటివి సాహిత్యానికి కమ్యూనిజం అందించిన అత్యంత విలువైన భావనలు. స్థూలంగా చెప్పాలంటే, కమ్యూనిజం ప్రపంచ సాహిత్యాన్ని ఒక కీలక ప్రశ్న అడగడం నేర్పింది.. సాహిత్యాన్ని తటస్థ వినోదం నుంచి బయటకు తీసుకొచ్చింది. చరిత్రలో జోక్యం చేసుకొని, సమూలంగా మార్చగల శక్తిగా తీర్చిదిద్దింది. దోపిడి ఉన్నంత కాలం... అణచివేతలు కొనసాగినంత కాలం.. లేనివాడిని ఉన్నవాడు దోచుకుతింటున్నంతకాలం.. ధనిక, పేద వర్గాల మధ్య అగాథం పెరిగినంతకాలం... కమ్యూనిజం సాహిత్యంలో ప్రవేశపెట్టిన చైతన్యం ఎప్పటికీ జీవించే ఉంటుంది.

## నాజీలను ధిక్కరించిన 'ది యంగ్ గార్డ్'

అలెగ్జాండర్ ఫదేయేవ్ రాసిన 'ది యంగ్ గార్డ్' రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాజీ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన సోవియట్ యువకుల గెరిల్లా దళం యంగ్ గార్డ్ నిజ ఘటనల ఆధారంగా రూపుదిద్దుకున్న నవల. ఒలెగ్ కొషోవోయ్, ఉల్యానా, ల్యూబా వంటి యువకులు రహస్యంగా యువతను సంఘటితం చేసి నాజీలకు ఎదురుదాడులు చేస్తారు. దేశభక్తి, త్యాగం, ఐక్యత, ద్రోహం వంటి అంశాలపై కథ సాగుతుంది. సోషలిస్టు రియలిజం భావజాలానికి అనుగుణంగా ఈ నవల యువత యొక్క ధైర్యం, సమూహశక్తి, విప్లవ నిబద్ధతను చాటి చెప్పే రీతిలో నిర్మితమైంది. నిజ జీవిత యోధులను ఆదర్శవంతంగా చూపుతూ, సోవియట్ సమాజం కోరుకున్న విలువలను ప్రతిబింబిస్తుంది. నికొలాయ్ ఓస్త్రోవ్‌స్కీ రచించిన 'హౌ ది స్టీల్ వాజ్ టెంపర్డ్' సోవియట్ సాహిత్యంలో అత్యంత ప్రభావవంతమైన, ప్రేరణాత్మక కృతి. ఇది సోషలిస్టు రియలిజం సంప్రదాయానికి ఆదర్శంగా నిలిచిన నవల. ఇందులో ప్రధాన పాత్ర పావెల్ కొర్చాగిన్, విప్లవం, పౌర యుద్ధం, సామాజిక మార్పు వంటి కఠిన పరిస్థితుల్లో తన మనోబలాన్ని, నిబద్ధతను ఎలా 'ఉక్కు'లా పదును పెట్టుకున్నాడో రచయిత వివరిస్తాడు. పావెల్ బాల్యంలో ఎదుర్కొన్న అన్యాయం, యుద్ధంలో పొందిన గాయాలు, శారీరక వైకల్యం వంటి అంశాలేవీ అతని సంకల్పాన్ని తగ్గించవు సరి కదా, మరింత బలపరుస్తాయి. వ్యక్తిగత జీవితం కంటే సమాజ సేవకు అతను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తాడు. పావెల్ ప్రయాణం కేవలం ఒక వ్యక్తిగత పోరాటం మాత్రమే కాదు.. సమాజవాద నిర్మాణంలో ఒక సాధారణ కార్మికుని పాత్ర ఎంత మహత్తరమైందో చూపించే ప్రతీక. త్యాగం, అచంచల సంకల్పం, శ్రమజీవుల వీరత్వం, సిద్ధాంత నిబద్ధత వంటివి ఈ రచనలో ప్రధానాంశాలు. కథా నిర్మాణం భావోద్వేగం, వాస్తవికత మేళవింపుతో ఉంటుంది. సోవియట్ యువతకు ఈ నవల దశాబ్దాల పాటు ప్రేరణగా నిలిచింది.

జర్మన్ సాహిత్యంలో అత్యంత పేరుప్రఖ్యాతులు ఆర్జించిన నాటక రచయిత, కవి బెర్టోల్ట్ బ్రెచ్ట్ (1898–1956). సామాజిక రుగ్మతలు, అసమానతలు, కళ్లు అతని రచనల్లో వ్యంగ్యంగా కనిపిస్తాయి. రాజకీయ విమర్శ, మనస్తత్వ పరిశీలనలు అతని నాటకాలు చదివిన లేదా ప్రదర్శిస్తున్నప్పుడు చూసిన ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఆలోచనలకు జీవం పోస్తాయి. బ్రెచ్ట్ ఎపిక్ థియేటర్ అనే కొత్త నాటక రూపాన్ని పరిచయం చేశాడు. ఈ పద్ధతిలో ప్రేక్షకులు కథలో మునిగిపోకుండా, సంఘటనలపై విశ్లేషణాత్మకంగా ఆలోచిస్తారు. యుద్ధం వల్ల సాధారణ ప్రజలకు వచ్చే పీడను చూపే 'మదర్ కరేజ్ అండ్ హార్ చిల్డ్రన్', నేర, సామాజిక అసమానత, దారిద్రతపై వ్యంగ్యాత్మక వ్యాఖ్య 'ది త్రీపెన్నీ ఒపెరా', శాస్త్రవేత్తల సామాజిక బాధ్యతను, సైన్స్–సామాజిక సంబంధాన్ని ప్రతిబింబించే 'ది లైఫ్ ఆఫ్ గలీలియో' అతని రచనల్లో ప్రధానమైనవి. అవన్నీ సోషలిస్టు రియలిజం స్వభావాలను కలిగి ఉంటాయి.




## ఈ వారం కవితలు (వందేళ్ల సిపిఐ సంబురాల సందర్భంగా)

### మా మాట కమ్యునిజం



మా మాట కమ్యునిజం
మా పాట కమ్యునిజం
మా బాట కమ్యునిజం
మా ఆశ కమ్యునిజం
మా శ్వాస కమ్యునిజం

మా ఆశయం కమ్యునిజం
మా ఆదర్శం కమ్యునిజం
మా ఆలోచన కమ్యునిజం
మా ఆచరణ కమ్యునిజం
మా ప్రేరణ కమ్యునిజం
మా ఉత్ప్రేరణ కమ్యునిజం

మా ఇజం కమ్యునిజం
మా నిజం కమ్యునిజం
మా నడక కమ్యునిజం
మా నడత కమ్యునిజం
మా నాదం కమ్యునిజం
మా నినాదం కమ్యునిజం

మా వాదం కమ్యునిజం
మా వేదం కమ్యునిజం
మా స్వప్నం కమ్యునిజం
మా స్వర్గం కమ్యునిజం
మా వరం కమ్యునిజం

మా శిక్షణ కమ్యునిజం
మా క్రమశిక్షణ కమ్యునిజం
మా రక్షణ కమ్యునిజం
మా నిరీక్షణ కమ్యునిజం
మా కులం కమ్యునిజం

మా కలం కమ్యునిజం

మా హలం కమ్యునిజం
మా బలం కమ్యునిజం
మా మతం కమ్యునిజం
మా అభిమతం కమ్యునిజం
మా జ్ఞానం కమ్యునిజం
మా విజ్ఞానం కమ్యునిజం
మా తత్వం కమ్యునిజం
మా శాస్త్రం కమ్యునిజం
మా శస్త్రం కమ్యునిజం
మా అస్త్రం కమ్యునిజం

మా కవిత కమ్యునిజం
మా కళలు కమ్యునిజం
మా సంగీతం కమ్యునిజం
మా సాహిత్యం కమ్యునిజం
మా నృత్యం కమ్యునిజం
మా కళారూపాలు కమ్యునిజం

మా గమనం కమ్యునిజం
మా గమ్యం కమ్యునిజం
మా బతుకు కమ్యునిజం
మా భవిత కమ్యునిజం

– ఆచార్య ఎస్వీ సత్యనారాయణ

### ప్రగతిమార్గం



ఆకాశమంతా అరుణపతాకం
సుత్తి కొడవలి కార్మిక కర్షక చిహ్నం
చైతన్యంతో సాగిపోతుంది
మన భారత కమ్యూనిస్టు సైన్యం

ఎంతోమంది అమరుల రక్తంతో
ఎరుపెక్కినది ఆ జెండా, అది సత్యం
వందేళ్ళుగా రెపరెపలాడుతూ
అదే చైతన్య స్రవంతిలో అనునిత్యం.
॥ ఆకాశ ॥

మార్క్స్ ఎంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళిక
రష్యా బకునిన్ సిద్ధాంతం వెలుగులో
కర్షక కార్మికులను ఏకంచేసి
ప్రజాసైన్యం నిర్మించినది
॥ ఆకాశ ॥

గద్దర్ వీరులు, బొల్షివిక్ విప్లవం
రష్యామార్గం ప్రపంచ పోరాటాలు స్ఫూర్తితో
భారత దేశంలో కమ్యూనిస్టు సైన్యం
కవాతు చేస్తూ నడిచింది
॥ ఆకాశ ॥

లాఠీలు తూటాలు నిషేధాలు
నిర్బంధాలు ఎదుర్కొని
అతివాద మితవాద
కాంగిరేసుతో భుజం కలిపి
ఆంగ్లేయులను దేశం నుండి
తరిమికొట్టిన పార్టీరా!
॥ ఆకాశ ॥

బ్రిటీషు దొరలను తరిమికొట్టినది
సంస్థానాధీషులను అంతమొందించినది
బూర్జువా భూస్వాముల గడీలను
ధ్వంసం చేసినది మూడక్షరాల
మన సిపిఐ ముందు కేగినదిరా!
॥ ఆకాశ ॥

ఏఐటియుసి, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్

కార్మిక కర్షక మేధావి ప్రజాసంఘాలే
అంగాలుగా ముందుకునడిచి
అన్నిరంగాల్లో దూసుకు పోయిన
చైతన్య కెరటమే మన సిపిఐ రా!

కర్షకులకు గిట్టుబాటు ధరలు
కార్మికులకు కనీస వేతనాలు
స్త్రీలకు శ్రమకు తగ్గ జీత భత్యాలు
నియమిత పనిగంటలు
విద్యా, వైద్య సౌకర్యాలు
సాధించిపెట్టిన పార్టీ మనదిరా!
॥ ఆకాశ ॥

భారత కమ్యూనిస్టు పార్టీ
ఉమ్మడికుటుంబం నుండి
చిన్న చిన్న సైద్ధాంతిక వైరుధ్యాలతో
మన అన్నదమ్ములు
కమ్యూనిష్టులు వేరుపడినారు.
ఉమ్మడి ఆశయం కోసం
వారు పోరాడుతున్నారు.
॥ ఆకాశ ॥

చీలిపోయి పేలిపోయి చిన్న పార్టీలుగా
బలహీనపడి ప్రజలకు దూరమయ్యారు
ఓ కమ్యూనిస్టు సోదరులారా!
సామ్రాజ్య వాద, పెట్టుబడిదారి
పార్టీలకు బలమిస్తున్నారు
॥ ఆకాశ ॥

మనదేశంకోసం మన ప్రజలకోసం
మనమంతా ఒక్కటై
వామపక్ష ప్రజాతంత్ర
ఐక్య సంఘటనగా ఏర్పడి
బలమైన రాజకీయశక్తిగా
ఎదుగుదాం భారతదేశాన్ని
ప్రగతిమార్గంలో నడుపుదాం

బూర భిక్షపతి
సెల్ : 9866612717

### అవని పైన గొప్పగా ఎగురుతున్న ఎర్రజెండ

అవని పైన గొప్పనైన
ఎగురుతున్న జెండా
ఎర్రజెండరో
అన్నలారో కూలన్నలారో
అన్నలారో రైతన్నలారో
అవని పైన గొప్పనైన
ఎగురుతున్న జెండా ఎర్రజెండరో

భారతావనిలో నూరేళ్ల కేతనం
అరుణ కేతనం రా
కష్టాలను కడదేర్చ ఎర్రజెండ పట్టరా
కమ్యూనిస్టుగ నీవు వీరుడవై కదలిరా
॥ అన్నలారో ॥

మానవతను పంచియిచ్చే
గొప్పనైన జెండా ఎర్రజెండరా
మనువాదాన్ని మట్టుబెట్టే
జెండరా ఎర్రజెండరా
మనుషులంత ఒకటని చెప్పే జెండరా
ఏకైక జెండరా ఎర్రజెండారా
॥ అన్నలారో ॥

దోపిడీని ఎండగట్టె
జెండా ఎర్రజెండరా
ఉన్నోడు లేనోడని లేకుండా
చేసేది ఎర్రజెండరా

అసమానతలద్దంటూ
పోరుజేసే జెండా ఎర్రజెండరో
సమసమాజాన్ని తెచ్చే జెండా
ఎర్రజెండరో //
॥ అన్నలారో ॥

శత్రువెవడో మిత్రువెవడో తేల్చేటి
జెండా ఎర్రజెండారా
శత్రువును ఓడించ
మిత్రులను కలుపుకుంటూ
పయనమయ్యే జెండా ఎర్రజెండరా
కాపిటలిస్టు సమాజాన్ని
సమాధిజేసేటి జెండా ఎర్రజెండరా
॥ అన్నలారో ॥

ప్రజాస్వామ్యానికి పట్టం గట్టేది
ఎర్రజెండారా
మతోన్మాదాన్ని మసి జేసే
జెండా ఎర్రజెండరా
ఫాసిజానికి పాడెగట్టె జెండా
ఎర్రజెండరా సోషలిజం తెచ్చే
ఏకైక జెండా ఎర్ర జెండరా
॥ అన్నలారో ॥

డా. మార్క శంకర్ నారాయణ
9908416664

## మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



**ప్రజాపక్షం/తొర్రూరు :** మేడారంలో సమ్మక్క సారలమ్మ తల్లులను పాలకుర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజన సాంప్రదాయాలు, ఆచారాలు కాపాడే దిశగా ఈ అభివృద్ధి పనులు కీలకంగా నిలుస్తాయన్నారు. మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడారంలోని పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి స్వాగతం పలికారు. ములుగు జిల్లా మేడారం వేదికగా నిర్వహించిన శ్రీ సమ్మక్క సారలమ్మల గద్దెలు, ప్రాంగణం పునరుద్ధరణ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రులకు స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మక్క సారలమ్మల గద్దెలు, ప్రాంగణం పునరుద్ధరణ పనులు మేడారం జాతరకు వచ్చే కోట్లాది భక్తులకు మరింత సౌకర్యవంతంగా ఉండనున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరం ప్రారంభం



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ సొసైటీ కాన్ఫరెన్స్ హాల్‌లో, రెడ్ క్రాస్ రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు 57వ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించడంతో పాటు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ శాసశాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి. విజయచందర్ రెడ్డి హాజరై, పుష్పగుచ్ఛం, షాల్‌తో సన్మానించి కేక్ కట్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, ఇ.వి. శ్రీనివాస్ రావు తన చిన్ననాటి మిత్రుడని, పట్టుదలతో చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించే వ్యక్తిగా తనకున్న గుర్తింపును ప్రశంసించారు. కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి మాట్లాడుతూ, రెడ్ క్రాస్ సేవా కార్యక్రమాలలో జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సేవలందిస్తూ మంచి పేరు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇ.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ,రక్తం కొరత లేకుండా చూసి, అవసరమైన వారికి సహాయం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పి. విజయచందర్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ది వెంకటనారాయణ, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, డా. కె. సుధాకర్ రెడ్డి, డా. సిహెచ్. సంధ్యారాణి, చెన్నమనేని జయశ్రీ, బిళ్ల రమణారెడ్డి, బాశెట్టి హరిప్రసాద్, తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నమనేని జగన్ మోహన్ రావు, కార్యదర్శి ఫణికుమార్, నేహాల్, రెడ్ క్రాస్ సిబ్బంది, అలాగే అధిక సంఖ్యలో స్నేహితులు, ఆప్తులు, అభిమానులు పాల్గొని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్ర చీఫ్ సెక్రటరీని కలిసిన బల్దియా కమిషనర్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** క్యాబినెట్ సమావేశంలో పాల్గొనడానికి మేడారం చేరుకునే క్రమంలో హనుమకొండకు చేరుకున్న రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావును బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

## సిపిఐ బహిరంగ సభకు బయల్దేరిన దేవరుప్పల నాయకులు

**ప్రజాపక్షం/దేవరుప్పుల:** దేవరుప్పుల నాయకులు సీపీఐ బహిరంగ సభకు బయల్దేరడం జరిగింది. ఆదివారం మండలం నుండి ఖమ్మంలో జరిగే సీపీఐ భారీ బహిరంగ సభకు రైతు సంఘం జిల్లా నాయకులు బిల్లా తిరుపతిరెడ్డి, ఎల్లయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రం నుండి ఎడ్ల సోమనారాయణ, శ్రీనివాస్, రమేష్, ఆగయ్య, సోమన్న, హమాలీ సంఘం నాయకులు రెండు బస్సులలో బయల్దేరడం జరిగింది.

## ఖమ్మం బహిరంగ సభకు సిపిఐ నాయకులు



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** ఖమ్మంలో జరిగే సీపీఐ పార్టీ 100 సంవత్సరాల బహిరంగ సభకు మండల కార్యదర్శి జువారి రమేష్ ఆధ్వర్యంలో 4 వాహనాలలో సీపీఐ మండల నాయకులు బయల్దేరగా రమేష్ జెండా ఊపి ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి సమ్మయ్య, రైతు సంఘం మండల అధ్యక్షులు యాకూబ్ పాషా, నాయకులు సుధాకర్, విష్ణు, అజయ్, దూడయ్య, ప్రభాకర్, గట్టుమల్లు, రజియా, సమ్మయ్య, రమేష్, యాదగిరి, పాల్గొన్నారు.

## తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్య

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** తండ్రి మందలించాడనే మనస్థాపంలో ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఎద్దుగూడెంలో చోటు చేసుకుంది. బచ్చన్నపేట గ్రామ పంచాయితి పరిధిలోని ఎద్దుగూడెం నివాసి ఎద్దు విగ్నేశ్వర్‌కు ఇద్దరు కుమారులు శనివారం విగ్నేశ్వర్ తన కుమారుడు పొలం పని విషయంలో అరవింద్ (19)ను అక్కడ మందలించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఆయన శనివారం రాత్రి పొలం వద్దకు వెళ్లి మామిడి చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం విషయం తెలువగా కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని ధర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ హమీద్ తెలిపారు.

# నేడు మేడారం పునరుద్ధరణ పనులు ప్రారంభించనున్న సీఎం



**ప్రజాపక్షం/హనుమకొండ:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు మేడారం పునరుద్ధరణ పనులను ప్రారంభించ నున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు సీఎం గద్దెల వద్ద వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. అనంతరం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ తదితర మంత్రులతో కలిసి రూ.101 కోట్లతో చేపట్టిన గద్దెలు, గద్దెల ప్రాంగణం, మేడారంలో నిర్మించిన సీసీ రోడ్లు, కూడళ్లలో నిర్మించిన ఆదివాసీల జీవన చిత్రాలను ప్రారంభిస్తారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలు, నృత్యాలు, డోలు వాయిద్యాలతో మేడారం వైభవాన్ని చాటి చెప్పేలా లైవ్ టెలికాస్ట్ లో ఈ ప్రారంభోత్సవం జరగనుంది. ఉదయం 9 గంటల లోపే కార్యక్రమాన్నింటినీ పూర్తి చేసుకొని సీఎం హెలీకాప్టర్లో తిరుగు ప్రయాణం అవుతారు. **ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మేడారం పర్యటన నేపథ్యంలో...:** పెండింగ్ లో ఉన్న పలు అభివృద్ధి పనులతో పాటు హామీలను అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు. ప్రధానంగా ములుగు జిల్లాకు సమ్మక్క, సారలమ్మ జిల్లాగా నామకరణం చేయాలనే డిమాండ్ ఉంది. గత ప్రభుత్వం 2019లో జిల్లాను ఏర్పాటు చేసినప్పటికీ.. సమ్మక్క సారలమ్మ నామకరణం చేయలేకపోయారు. అలాగే మేడారం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఏటూర్‌నాగారాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయినప్పటికీ అధికారికంగా ప్రకటన రావటం లేదు. ఐటీడీఏ పాలక మండలి ఇక్కడే ఉండటంతో పాటు ఐదారు మండలాలకు ఏటూరునాగారం కేంద్రంగా ఉంది. అందువల్ల తక్షణమే రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇక ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటుకు ఏటూర్ నాగారంలో అన్ని పనులు పూర్తయినప్పటికీ అమల్లోకి రావటం లేదు. అలాగే మంగపేట మండలంలోని రాజుపేట గ్రామాన్ని మండలకేంద్రంగా చేయాలనే డిమాండ్‌కు మోక్షం లభించటం లేదు. ఇక ములుగులో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీకి భూసేకరణ దాదాపు పూర్తయినప్పటికీ భవనాల నిర్మాణం జరగటం లేదు. కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.900కోట్ల నిధులు కేటాయిస్తామని చెబుతోంది. వచ్చే విద్యాసంవత్సరంలోనైనా కొత్త భవనాల్లో తరగతులు జరిగేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకరావాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## 'కుడా' సంబంధిత అభివృద్ధి పనులపై సమీక్షించిన కలెక్టర్



**ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ :** కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ ( కుడా) ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి పై జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లో నిర్వహించిన సమావేశం లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి,వైస్ చైర్మన్ చాహత్ బాజ్ పాయ్ లతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భం గా వెయ్యి స్థంబాల ఆలయం లో కొనసాగుతున్న పనులు, భద్రకాళి మాడ వీధులతో పాటు వరంగల్ బస్ స్టాండ్ నిర్మిత తదితర అభివృద్ధి పురోగతిపై సమీక్షిస్తు ఇప్పటివరకు పూర్తి చేసిన పనుల వివరాలను కుడా అధికారులను అడిగి తెలుసుకొని వేగవంతంగా పూర్తి చేయుటకు దిశా నిర్దేశ్యం చేశారు. ఈ కార్యక్రమం లో కుడా సి పి ఓ అజిత్ రెడ్డి ఈ ఈ భీమ్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు

## అభివృద్ధిపై అసత్యపు ఆరోపణలు మానుకోవాలి

రెండేళ్లలో రూ.350 కోట్లతో పలు అభివృద్ధి పనులు
మరో రూ.150 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకి జీవో లు తెచ్చాం
అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల ఆరోపణ
ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధిపై కొందరు కావాలని అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని,వాటిని తక్షణమే మానుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పష్టం చేశారు. ఆదివారం భూపాలపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల సమయంలో భూపాలపల్లి మున్సిపాలిటీని మోడల్ మున్సి పాలిటీగా అన్ని వార్డుల్లో సుమారు రూ.350 కోట్లకు పైగా నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని అన్నారు. అదేవిధంగా, మరో రూ.150 కోట్లతో మౌలిక వసతుల కల్పన కోసం వివిధ అభివృద్ధి పనులకి జీవోలు కూడా రెండు రోజుల కిందట తీసుకొచ్చామని తెలిపారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే కొందరు ప్రతిపక్ష నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ప్రజలు మీకు బుద్ధి చెప్పి, 30 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించి, అత్యధిక మెజారిటీ ఇచ్చి గెలిపించుకోవడం ఖాయమన్నారు. మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధం తదితర సౌకర్యాలకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే అనేక పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం పనిచేస్తుంటే, మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ లబ్ధి కోసం కొందరు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, పార్టీ జిల్లా నాయకులు బుర్ర కొమురయ్య, అప్పం కిషన్, సంబమూర్తి, దాట్ల శ్రీనివాస్, అంబాల శ్రీనివాస్,ఆకుల మహేందర్, సిరుప అనిల్, రంజిత్, మహేందర్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## గ్రేటర్ వరంగల్ మునిసిపల్ పీఠంపై ఉత్కంఠ!




**ప్రజాపక్షం/హనుమకొండ:** రాష్ట్రవ్యాప్తంగా మునిసిపల్ కార్పొరేషన్లు, మునిసిపాలిటీల మేయర్, చైర్పర్సన్ల స్థానాలకు రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం శనివారం అధికారికంగా వెల్లడించింది. గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) మేయర్ స్థానాన్ని జనరల్ (అన్ రిజర్వ్)కు కేటాయించారు. రాష్ట్రంలో మొత్తం 10 మునిసిపల్ కార్పొరేషన్ స్థానాలకు మేయర్ స్థానాలు ఉండగా, వాటిలో కొన్ని మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ కాగా, గ్రేటర్ వరంగల్ మేయర్ పదవి మాత్రం జనరల్ కేటగిరీకి కేటాయించడంతో అన్ని పార్టీల నేతల్లో ఆశలు రేపుతోంది. ప్రస్తుత పాలకవర్గం టర్మ్ ఏప్రిల్ తో ముగుస్తుండడంతో మే నెలలో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. ఈ క్రమంలో 2026లో జీడబ్ల్యూఎంసీ ఎన్నికలలో కార్పొరేటర్‌గా విజయం సాధించి 10వ మేయర్ స్థానం దక్కించుకునేది ఎవరు? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రతిపక్షబీఆర్ఆర్, బీజేపీ నేతలు మేయర్ పీఠం దక్కించుకునేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. మేయర్ పీఠం దక్కించుకునేందుకు సీనియర్ కార్పొరేటర్లు, వివిధ పా ర్టీల నాయకులు, ఇతర దేశాల్లో నివసిస్తూ ఎన్నికల సమయానికి బరిలో ఉండేవారు, వివిధ పార్టీలలో కొత్త ముఖాలు మేయర్ పదవిపై కన్నేసి ఉన్నారు. మేయర్ ప్రకటన వెలువడగానే అధికారి పార్టీతో పాటు ప్రతిపక్ష పార్టీలోను అంతర్గతంగా పోటీ వాతావరణం నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలు, మేయర్, చైర్పర్స్‌ల రిజర్వేషన్ల జాబితా విడుదల కావడంతో పాటు డివిజన్ల రిజర్వేషన్లు కూడా ప్రకటించినట్టు సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. 2016లో 58 డివిజన్లుగా ఉన్న రిజర్వేషన్లను కొద్దిగా మార్చి ప్రస్తుతం రిజర్వేషన్లు ప్రకటించినట్టు వాట్సాప్ గ్రూపుల్లో కొందరు వైరల్ చేశారు. కానీ ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ 66 డివిజన్లకుగాను కార్పొరేటర్ అభ్యర్థులకు ప్రభుత్వం ఎలాంటి రిజర్వేషన్ ప్రభుత్వం ప్రకటించలేదని మునిసిపల్ అధికారులు వెల్లడించారు

## రాష్ట్ర చీఫ్ సెక్రటరీని కలిసిన, కలెక్టర్ సత్యశారద



**ప్రజాపక్షం/ వరంగల్ :** క్యాబినెట్ సమావేశంలో పాల్గొనడానికి మేడారం చేరుకునే క్రమంలో ఆదివారం హనుమకొండలోని ఎన్ఐటి అతిథి గృహానికి చేరుకున్న రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అందజేశారు.

## పదేండ్ల మీ అరాచకాలు ప్రజలు మర్చిపోలేదు

పిసిసి సభ్యులు పెండెం రామానంద్



**ప్రజాపక్షం/నర్సంపేట :** మీరు ఏం వ్యాపారాలు చేసి వందల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సంపాదించారో ప్రజలకు వివరణ ఇవ్వాలని టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డిని డిమాండ్ చేశారు. పట్టణంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నీ చుట్టు పక్కల ఉన్న నాయకులు చేసిన మట్టి దందాలు, భూ కబ్జాలు, గ్రీన్ ల్యాండ్ ఆక్రమణలు వంటి అనేక అక్రమాలు ప్రజలంతా గమనిస్తున్నారని, నైతిక విలువలు లేని రాజకీయ లబ్ధి కోసం వ్యాఖ్యలు చేయడం తగదని, ఎమ్మెల్యే మాధవరెడ్డి కోట్ల రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారని అభివృద్ధిని ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారన్నారు. పదేండ్లు అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా సొంత ప్రయోజనాల కోసం కమిషన్ల కోసం దందాలు చేసి వందల కోట్లను సంపాదించుకున్నరని ఆరోపించారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి గురించి, మా పార్టీ నాయకులపై మాట్లాడే నైతిక హక్కు లే దని పదేండ్లు మీరు చేసిన అరాచకాలు ఇంకా ప్రజలు మర్చిపోలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు బత్తిని రాజేందర్, తిరుపతి, సాంబయ్య గౌడ్, రమణారెడ్డి, మాదాసి రవి, పంబి వంశీకృష్ణ, మాజీ ఎంపిటిసి చింతల సాంబ రెడ్డి, ధోని కీర్తన, బాణాల ప్రసన్న, శ్రీను పాల్గొన్నారు.

## గృహజ్యోతి శుభాకాంక్షల పత్రాల పంపిణీ

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** మండలంలోని షా పెల్లి గ్రామంలో ఆదివారం గృహజ్యోతి, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు గృహజ్యోతి శుభాకాంక్షల పత్రాలను పంపిణి చేయడం జరిగింది. విద్యుత్ వినియోగదారులకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకం అమలవుతున్న ఉచిత విద్యుత్ లబ్దిదారులకు, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క ఆదేశానుసారం గ్రామ సర్పంచ్ తాళ్లపెల్లి సుభాష్ చంద్రబోస్ గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఆదివారం సంక్రాంతి కరపత్రాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

## భారత గడ్డపై సిపిఐ వందేళ్ళ ముగింపు వేడుకలు



వరంగల్



భూపాలపల్లి

### ఖమ్మం తరలి వెళ్లిన సిపిఐ పార్టీ శ్రేణులు

### సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** ఖమ్మంలో జరిగే సిపిఐ 100 సంవత్సరాల ముగింపు వేడుకలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుండి సిపిఐ పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్లినట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఖమ్మంలో జరిగే 100 ఏళ్ళ ముగింపు బహిరంగ సభకు రాజ్ కుమార్ జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. భారత గడ్డపై మొట్ట మొద టిసారి ఖమ్మం పట్టణంలో నిర్వహిస్తున్న సిపిఐ దశాబ్ది ఉత్సవాల ముగింపు సభ అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్య దర్శి గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోట పలుకుల రమేష్, సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజ్ సతీష్, కొరిమి సుగుణ, మాతంగి రామచందర్, ఎండి ఆసిఫ్ పాషా, వేముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ నుండి సభకు బయలుదేరుతున్న ఏఐటియూసి నాయకులు**

**వరంగల్ :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 100 సంవత్సరాల ఉత్సవాల సందర్భంగా ఖమ్మం పట్టణ కేంద్రంలో 5 లక్షల మందితో జరిగే భారీ బహిరంగ సభకు ఏఐటీయూసీ జిల్లా కార్మికులు ప్రత్యేక వాహనాలలో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఏఐటి యూసివరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పుల రవి, తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు కలకోట్ల రాజు, నాగవెల్లి శంకర్, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి తాళ్లపల్లి రహేళ, జిల్లా నాయకులు భాస్కర్ల సతీష్, సంధ్యారాణి, లావణ్య, రజిత, శోభ, మధుసూదనాచారి, పాల్గొన్నారు.

**నర్సంపేట నుండి సభకు బయలుదేరిన నాయకులు**



నర్సంపేట

**నర్సంపేట :** భారత గడ్డపై సిపిఐకి వందేళ్లని హమాలీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. ఈ సభకు నర్సంపేట పట్టణం నుండి ఆదివారం రోజున నర్సంపేట సివిల్ సప్లై హమాలీ కార్మికుల గోదాం ప్రాంగణం నుండి రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ ఆధ్వర్యంలో భారీగా కార్మికులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బక్కెర కిషోర్, రాయరాకుల సతీష్, కుమారస్వామి, వీరస్వామి, నరసింహా, అనిల్, ప్రభాకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి ఆధ్వర్యంలో జనసేవ దళ్ విద్యార్థులు**



**నర్సంపేట :** సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చలో ఖమ్మం వంద సంవత్సరాల సభ సందర్భంగా వరంగల్ జిల్లా నర్సంపేట నుండి పెద్ద సంఖ్యలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి ఆధ్వర్యంలో జనసేవ దళ్ విద్యార్థులు, యువకులు బయలుదేరి వెళ్లారు. ఈకార్యక్రమంలో ఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఫయాజ్, ఏఐఎస్ఎఫ్ నర్సంపేట అధ్యక్ష, కార్యదర్శులు ఈశ్వర్, పాలక పవన్, స్మైల్ ప్రభాస్, స్వాతి, శ్రావణి, మిను తదితరులు పాల్గొన్నారు.

**తొర్రూరు నుండి సభకు తరలివెళ్లన కార్యకర్తలు**



తొర్రూరు

**తొర్రూరు :** సీపీఐ వంద సంవత్సరాలను పురస్కరించుకొని ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సీపీఐ శతాబ్ది ముగింపు భారీ బహిరంగ సభకు తొర్రూరు పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని అమ్మాపురం, వెలికట్ట, కంఠాయపాలెం, హరిపిరాలతో పాటు పలు గ్రామాల నుంచి సీపీఐ కార్యకర్తలు, నాయకులు తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో సీపీఐ తొర్రూరు మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మణ్, యాదగిరి, శ్యామ్, గూడెల్లి ఎల్లయ్య, సాయిరెడ్డి, నర్సింహారెడ్డి, రమేశ్, పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ నుండి తరలివెళ్ళిన కార్యకర్తలు**




హనుమకొండటౌన్

**హనుమకొండటౌన్:** సీపీఐ శతవసంతాల సందర్భంగా ఖమ్మంలో ఆదివారం జరిగిన భారీ బహిరంగ సభ, ప్రదర్శనకు హనుమకొండ జిల్లా నుండి సీపీఐ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఖమ్మంలో జరిగిన జనసేవాదళ్ కవాతులో సైతం జిల్లా నుండి వందలాదిమంది యువ కమ్యూనిస్టు కార్యకర్తలు తరలివెళ్ళారు. జిల్లాలోని ఆయా మండలాలు, ప్రాంతాల నుండి బస్సులు, ఇతర వాహనాల ద్వారా తరలి వెళ్లి ఖమ్మం సభలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంతో పాటు జిల్లాలోని ఆయా ప్రాంతాల నుండి తరలి వెళ్లిన నాయకులలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి,జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర సమితి సమితి సభ్యులు సిరబోయిన కరుణాకర్, ఆదరి శ్రీనివాస్,మండ సదా లక్ష్మి, జిల్లా నాయకులు మోతె లింగారెడ్డి, ఉట్కూరి రాములు, పాల్గొన్నారు.

## నేడు ఉప ముఖ్యమంత్రి పర్యటన



**ప్రజాపక్షం/చింతకాని :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సోమవారం చింతకాని మండలంలో పర్యటించనున్నారు. వందనం, కోదుమూరు రెండవ దశ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు, వందనం, పుట్టకోట జెడ్పి రోడ్డు రోడ్డు పనులకు, వందనం ఎస్సి కాలనీలో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి, అనంతరం జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. కార్యక్రమంలో మండలంలోని కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

## ఎన్‌టిఆర్ సేవలు చిరస్మరణీయం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా ఆదివారం టిడిపి జిల్లా కార్యాలయంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డా.వాసిరెడ్డి రామనాథం, ఖమ్మం ఇన్‌చార్జి కూరపాటి వెంకటేశ్వర్లు, కేతినేని హరీష్, వడ్డెం విజయ్ తదితరులు మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎన్‌టిఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తా సీతయ్య, వనమా వాసు, కొండబాల కరుణాకర్, మల్లేంపాటి అప్పారావు పాల్గొన్నారు. కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లకు చెందిన నాయకులు లకారం ట్యాంక్ బండ్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్‌టిఆర్ విగ్రహానికి, ఎన్‌టిఆర్ సర్కిల్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ, సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సిహెచ్ రవికిరణ్, పగడాల నాగరాజు, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్యపరీక్షలు అభినందనీయం

వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



**ప్రజాపక్షం/వైరా:** ఖరీదైన వైద్య పరీక్షలు వైరా నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి తీసుకొని రావడం అభినందనీయమని కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కొల్లి కల్పనాచౌదరిని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ అభినందించారు. వైరాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొల్లి ఫౌండేషన్ టీం విమలాకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ హైదరాబాద్ సహకారంతో నిర్వహించిన జీర్ణ వ్యవస్థ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరాన్న ఆదివారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ప్రారంభించారు. కార్యక్రమంలో కొల్లి ఫౌండేషన్ చైర్మన్ కొల్లి కల్పనాచౌదరి, వైద్యులు విమలాకర్‌రెడ్డి, గౌరంగ్ ప్రాఫ్, రాజు ముషమ్, పవన్‌కుమార్, జయంత్, అనురాగ్, గపాల్, తేజ, గిరి, రాజేష్, సందీప్, లోహిత్‌తో పాటు నాయకులు బొర్రా రాజశేఖర్, కట్ల రంగారావు, శీలం నర్సిరెడ్డి, పోదిల హరినాథ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు, సూతకాని జైపాల్, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు వైరా ఎస్సై పుప్పాల రామారావు, నందిగామ మనోహర్, గుగులోతు రూప్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.



**ఎన్‌టిఆర్ వర్ధంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే...** వైరాలో దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఎన్టిఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ పలువురు నాయకులతో కలిసి పూలమాల వేసి నివాళి అర్పించారు. టిడిపి కార్యాలయంలో వైరా మండల అధ్యక్షులు కిలారి సురేందర్ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గాలి రామకృష్ణ, బొల్లేపల్లి శ్రీనివాసరావు, గద్ద నాగేశ్వరరావు, చెరుకూరి చలపతిరావు, మోతుకూరి వెంకటేశ్వరరావు, మందడలపూడి మధుసూదన్‌రావు, అర్జున్‌రావు, సతీష్, మాజీ పట్టణ అధ్యక్షులు ప్రతీపు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ అవకాశమిస్తే పోటీ చేస్తా

వేముల శ్రావణి రత్నాకర్



**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డులో కాంగ్రెస్ పార్టీ నుంచి వేముల రత్నాకర్ సతీమణి శ్రావణి బరిలో ఉన్నారు. పార్టీ పెద్దలు వార్డులో పోటీ చేసేందుకు అవకాశం ఇస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తామని వేముల రత్నాకర్, శ్రావణి దంపతులు తెలిపారు. విద్యావంతురాలైన తాను రాజకీయాల్లోకి వెళ్లి ప్రజాక్షేత్రంలో ప్రజల మధ్య ఉండి సేవ చేసేందుకు ముందుకొస్తున్నానని ఆశీర్వదించి ఎన్నికల బరిలో నిలిచేందుకు పెద్దలు అవకాశం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

## పూర్వ విద్యార్థుల కలయిక




**ప్రజాపక్షం/కామేపల్లి :** కామేపల్లి హైస్కూల్‌లో 1988–89 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కామేపల్లి హైస్కూల్‌లో సమ్మేళనాన్ని ఖమ్మం శశి ఆసుపత్రి నిర్వాహకుడు, పూర్వ విద్యార్థి దమ్మాలపాటి శ్రీనివాసరావు నిర్వహించారు. ఈసందర్భంగా తమ గురువులు బాలరాజు, రామచంద్రరావులను శాలువాలతో సత్కరించారు. ఒకే తరగతిలో 65 మంది విద్యార్థులతో పదో తరగతి చదువుకున్నామని, 36 సంవత్సరాల తరువాత కలుసుకోవడం ఆనందంగా ఉందని ఈసందర్భంగా పూర్వ విద్యార్థులు తెలిపారు. స్వీట్లు మిఠాయిలు పంచుకొని భోజనాలు చేసి ఆట పాటలు డ్యాన్సులు మిమిక్రీలు చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు దమ్మాలపాటి శ్రీనివాసరావు, పాశం శ్రీనివాసరావు, దీవెల కోటేశ్వరరావు, గుజ్జర్లపూడి రాంబాబు, ప్రకాష్, బండి నర్సింహారావు, కొర్ర రాములు, పెంటు, సరోజి తదితరులు పాల్గొన్నారు.

# విద్య–వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యం

నర్సింగ్ కళాశాలలో జపనీస్, జర్మన్ భాషలు నేర్పేందుకు చర్యలు

సిఎం రేవంత్‌రెడ్డి

జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల, మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్ నిర్మాణానికి శంకుస్థాపనలు

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, వ్యవసాయం మార్కెట్ యార్డ్ ప్రారంభోత్సవాలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, జిలా ఇన్‌చార్జి మంత్రి వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ, హౌజింగ్‌శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి సిఎం పర్యటించారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన ముఖ్యమంత్రికి కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్‌దత్ ఘనస్వాగతం పలికారు. తొలుత సిఎం, మంత్రులతో కలిసి పాలేరు నియోజకవర్గ పరిధి ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో రూ.108 కోట్ల60లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన జెఎన్‌టియు ఇంజనీరింగ్ కళాశాల నూతన భవనాలకు శంకుస్థాపన చేసి భూమి పూజ చేశారు. కూసుమంచిలో 5 ఎకరాల విస్తీర్ణంలో రూ.45కోట్లతో నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి, రూ.162కోట్ల54 లక్షలతో మున్నేరు పాలేరు లింక్ కేనాల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే 25 కోట్ల రూపాయలతో 5 ఎకరాల విస్తీర్ణంలో నూతనంగా నిర్మించిన నర్సింగ్ కళాశాలను, మద్దులపల్లిలో 23 ఎకరాల విస్తీర్ణంలో దాదాపు 20కోట్ల రూపాయలతో నిర్మించిన మార్కెట్ యార్డును ప్రారంభిచారు. అనంతరం నర్సింగ్ కళాశాలలో సిఎం రేవంత్‌రెడ్డి విద్యార్థినులకు నర్సింగ్ కళాశాల నూతన భవన ప్రారంభోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం మాట్లాడారు. పేద ప్రజలకు నాణ్యమైన విద్య, నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వ చర్యలు తీసుకుంటుందన్నారు. సమాజంలో వైద్య రంగానికి అత్యంత విలువ ఉందని, ఆపద సమయంలో ప్రజలు నమ్మకంతో ఆసుపత్రులకు వస్తారని, విధుల నిర్వహణలో చిన్న నిర్లక్ష్యం చూపిన ప్రాణ నష్టం, ఒక కుటుంబం జీవనాధారం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. వైద్యులు విధి నిర్వహణలో వ్యక్తిగతంగా ఉన్న ఇబ్బందులు, సమస్యలు పక్కన పెట్టాలన్నారు. జపాన్, జర్మనీ దక్షిణకొరియా పర్యటనలో అక్కడ లక్షలాదిగా నర్సుల కొరత ఉన్నట్లు గుర్తించామన్నారు. జపాన్‌లో ఏజింగ్ సమస్య వల్ల అక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మన నర్సింగ్ విద్యార్థులకు అక్కడ సాఫ్టేవేర్ ఇంజనీర్ కంటే ఎక్కువ జీతభత్యాలతో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిధులు మంజూరు చేసి నర్సింగ్ కళాశాల నిర్మించామని, ఇక్కడ చదివే విద్యార్థినులను దృష్టిలో పెట్టుకొని అవసరమైన అన్ని మౌలిక వసతులను కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపిలు రామసహాయం రఘురాంరెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయ్‌బాబు, నాయుడు సత్యనారాయణ, ఖమ్మం నగర మేయర్ పునకొలు నీరజ, అదనపు కలెక్టర్లు డాక్టర్ శ్రీజ, శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# శత వసంత ఉత్సవ సభకు పోటెత్తిన ఎర్రదండు

జిల్లా నలుమూలల నుంచి కదిలిన ఎర్రసైన్యం




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సిపిఐ శత వసంత ఉత్సవ ముగింపు సభకు జిల్లా నలుమూలల నుండి ఎర్రసైన్యం దండులా కదిలింది. భద్రాచలం నియోజకవర్గం చర్ల మండలం నుండి మొదలుకొని జిల్లాలోని ఐదు నియోజకవర్గాల వ్యాప్తంగా గ్రామగ్రామాన ఎర్రసైనికులు ఖమ్మం నగరానికి కదిలారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో భద్రాచలం, పినపాక, కొత్తగూడెం, ఇల్లందు, అశ్వారావుపేట నియోజకవర్గాల పరిధి నుండి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున శత వసంత ఉత్సవ ముగింపు సభకు ఉత్సాహంగా ముందుకు సాగారు. జిల్లా నుంచి వేలాది వాహనాల్లో సుమారు లక్ష మంది శత వసంత ఉత్సవ ముగింపు సభలో మేము సైతం అంటూ హాజరై పిడికిలి బిగించి కదిలారు. శత వసంతాల భారత కమ్యూనిస్టు పార్టీలో తాము సైతం సభ్యులమే అంటూ రెట్టింపు ఉత్సాహంతో చేసిన నినాదాలు మిన్నంటాయి. ఉత్సవాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా పార్టీ ఆధ్వర్యంలో అన్ని రకాల ఏర్పాటు చేశారు. మండల పట్టణ గ్రామ కమిటీల ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులను ఉత్సవ సంబరానికి తరలించారు. ప్రజా పోరాటాలు ఉద్యమాలే పార్టీకి బలమని, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం కొనసాగిన సిపిఐ శత వసంత జైత్ర యాత్ర ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న పాలకుల ఆగడాలకు అడ్డుకట్ట వేసేందుకు, మరింత అరుణ వర్ణమై ముందుకు సాగాలని అంతా కోరుకుంటున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు మిర్యాల రంగయ్య, రెడ్డి పుల్లారెడ్డి, మున్న లక్ష్మి కుమారి, నరాటి ప్రసాద్, ఎస్ డి సలీం, చంద్రగిరి శ్రీనివాసరావు, కే.సారయ్య, సలిగంటి శ్రీనివాస్, చంద్ర నరేంద్ర కుమార్, డి శంకర్, బందం నాగయ్య, కమటం వెంకటేశ్వరరావు, జి వీరస్వామి, వై ఉదయభాస్కర్, వాసిరెడ్డి మురళి, భూక్య దస్రు, బి పూర్ణచంద్రరావు, ఏ.సాయిబాబు, యు.రాహుల్, ఎస్‌కె ఫహీం తదితరులు ఖమ్మం సభకు తరలిన దళాలకు ప్రాతినిధ్యం వహించారు. మహిళల ఎర్రకవాతు దళం పలువురిని ఆకట్టుకుంది.



## బహిరంగ సభకు తరలిన శ్రేణులు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభకు కొత్తగూడెం సిపిఐ శాఖ, జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని ఎస్‌ఆర్‌అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల మైదానంలో జరిగిన ముగింపు బహిరంగ సభకు సిపిఐ శ్రేణులు భారీగా తరలివచ్చారు. కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, 15వ డివిజన్ కార్యదర్శులు జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బతుకమ్మలతో మహిళలు



**ప్రజాపక్షం/చింతకాని :**భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు బహిరంగ సభకు చింతకాని మండల వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వంద మంది జనసేవాదళ్ కవాతు బృందం, రైతులు, బతుకమ్మలతో మహిళా సంఘాల నాయకులు మండల వ్యాప్తంగా బైక్ ర్యాలీ నిర్వహించి ఖమ్మం చేరుకున్నారు. 50 బస్సులు, 400 బైకులు, 30 టాటా ఎస్ వాహనాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాల్లో కార్యకర్తలు సుమారు నాలుగువేల మందికి పైగా బహిరంగ సభకు హాజరయ్యారు.



## ఉచితంగా మాస్కులు పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** సిపిఐ శత వసంతాల ముగింపు సభ సందర్భంగా మగువ హోమ్ ఫుడ్స్ ఆధ్వర్యంలో ఆదివారం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవనం వద్ద సిపిఐ శ్రేణులకు ఉచితంగా మాస్కులు పంపిణీ చేశారు. హోమ్ ఫుడ్స్ నిర్వాహకులు తాటి నాగమణి, శ్వేత, సిపిఐ ఖమ్మం కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ బిజి క్లెమెంట్, ప్రజాపక్షం ఖమ్మం ఎడిషన్ ఇంచార్జి ఏనుగు వెంకటేశ్వరరావు మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నకిరికంటి కృష్ణ, మహేష్, నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న చిన్నారుల ప్రదర్శన, కోలాటం



**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం ఖమ్మం నగరంలో నిర్వహించిన సభకు సిపిఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి ఎస్‌కె జానిమియా, తోట రామాంజనేయులు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సభకు కొణిజర్ల, వైరా, తల్లాడ, సత్తుపల్లి, మధిర తోపాటు తదితర గ్రామాలనుంచి వచ్చిన వేలాది మంది సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శ్రీశ్రీ సర్కిల్‌నుంచి ఉత్సాహపూరిత వాతావరణంలో సభాప్రాంగణానికి తరలివచ్చారు. సిపిఐ నినాదాలతో ఎర్రచొక్కాలు, ఎర్రచీరలతో రోడ్లు ఎరుపువర్ణంగా మారిపోయింది. వారికి ముందు చిన్నారుల కోలాట నృత్యం ఎంతో ఆకట్టుకుంది.

# గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం



**ప్రజాపక్షం/కూసుమంచి:**మండల కేంద్రంలో గల స్థానిక గిరిజన బాలుర హాస్టల్‌లో ఆదివారం గిరిజన సంక్షేమ శాఖ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో వసతి గృహ సంక్షేమ అధికారులకు, ప్రధానోపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా డిప్యూటీ డైరెక్టర్ నారీ విజయలక్ష్మీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహాలలో నిర్వహించాల్సిన రికార్డుల ప్రాముఖ్యత, నిబంధనల ప్రకారం నిర్వహణ విధానం, పర్యవేక్షణ అంశాలపై విస్తృతంగా అవగాహన కలిగి ఉండాలని, త్వరలో జరిగే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అదే విధంగా గిరిజన సంక్షేమ వసతి గృహాలలో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ఖచ్చితంగా, సక్రమంగా అమలు చేయాలని, భోజన నాణ్యత తప్పని సరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఖమ్మం ఎటిడిఒ సత్యవతి, వసతి గృహ సంక్షేమ అధికారి తిరుపతిరావు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# చచ్చిన కోళ్ళతో చేపల పెంపకం?

హద్దు మీరుతున్న వ్యాపారిపై చర్యలేవి..?

ప్రజల ప్రాణాలంటే మత్స్య, జల వనరుల శాఖలకు పట్టింపు లేదా...?



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** చచ్చిన కోళ్లతో చేపల పెంపకమా అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లా, సత్తుపల్లి నియోజకవర్గం, కల్లూరు మండలంలోని పలు చేపల చెరువుల నిర్వహణపై తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చచ్చిన కోళ్ల వ్యర్థాలను చెరువుల్లో వేసి చేపల పెంపకం చేస్తున్నారన్న అనుమానాలు ప్రజల్లో ఆందోళనకు దారి తీస్తున్నాయి. చేపల పెంపకానికి ప్రభుత్వం అనుమతించిన ఆహారం, సేంద్రియ ఎరువులే ఉపయోగించాల్సి ఉండగా, కొన్ని ప్రాంతాల్లో పౌల్ట్రీ ఫారాల నుంచి చచ్చిన కోళ్లను తెప్పించి చెరువుల్లో వేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విధానం వల్లనీటిలో హానికరమైన బ్యాక్టీరియా పెరగడం, చేపల్లో విషపదార్థాల నిల్వ,ఆ చేపలు తినే ప్రజలకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని మత్స్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**ఆంధ్రా వ్యాపారిపై ఆరోపణలు...** ఈ వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యాపారి నరేష్ పేరు తెరపైకి వచ్చింది. ఆయన తెలంగాణలో చెరువులను లీజుకు తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా చేపల పెంపకం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇతను గతంలో ఆంధ్రప్రదేశ్ చదువుల్లో సైతం ఇదే మాదిరిగా కోళ్ల వ్యర్థాలతో చేపలు పెంపకం చేపట్టినట్లు తెలుస్తుంది. అక్కడి చట్టాలు బలంగా ఉండడంతో తన ఆటలు సాగవని నరేష్ తన దందాను తెలంగాణలోకి మార్చి, ఇక్కడ చట్టాలను తనకు అనుకూలంగా చేసుకొని కోళ్ల వ్యర్థాలతో చేపల సాగు చేస్తున్నట్లు తెలుస్తుంది. కొన్ని రోజుల క్రితం నరేష్‌కు చెందిన వాహనంలో భారీగా చనిపోయిన కోళ్లను తరలిస్తుండగా మిట్టపల్లి వద్ద కొందరు యువకులు పట్టుకొని తల్లాడ పోలీసులకు అప్పగించిన విషయం విధితమే. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకొని కోళ్ల వ్యర్థాలతో పెరిగిన చేపలను తక్షణమే పట్టించి ఖననం చేయాలని ప్రజల డిమాండ్ చేస్తున్నారు.

**ఆ శాఖలపై ఆరోపణలు...**ఈ నేపథ్యంలో మత్స్య శాఖ, జల వనరుల శాఖల పనితీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. చెరువులపై క్రమం తప్పకుండా తనిఖీలు జరుగుతున్నాయా? నీటి నమూనాలు ల్యాబ్ పరీక్షలకు పంపుతున్నారా? అక్రమ ఫీడ్ వాడితే కేసులు నమోదు చేస్తున్నారా? ఈ అంశాలపై అధికారికంగా స్పష్టమైన ప్రకటన లేకపోవడం అనుమానాలను మరింత బలపరుస్తోంది. కొంతమంది స్థానికులు, మత్స్యకార సంఘాలు చేస్తున్న ఆరోపణ మరింత తీవ్రమైంది. అమ్యామ్యాలు అందడం వల్లే అధికారులు చెరువుల తనిఖీలకు వెళ్లడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నిర్లక్ష్యం కేవలం శాఖ వైఫల్యం కాదని, ప్రజారోగ్యంపై తీవ్రమైన నిర్లక్ష్యంగా మారుతుందని విశ్లేషకులు అంటున్నారు.

**సబ్ కలెక్టర్ రహస్య విచారణ ఆదేశాలా..?** ఈ నేపథ్యంలో సబ్ కలెక్టర్ స్థాయి అధికారి రహస్య విచారణకు ఆదేశాలు ఇచ్చారన్న సమాచారం అధికార వర్గాల్లో చర్చకు వస్తోంది.విచారణ జరిగితే చెరువుల నిర్వహణ విధానాలు, ఫీడ్ వనరులు, నీటి నమూనాల పరీక్షలు, లీజు ఒప్పందాల పరిశీలనటువంటి అంశాలు పరిశీలనకు వచ్చే అవకాశం ఉంది. అయితే దీనిపై ఇంకా అధికారిక ధృవీకరణ రావాల్సి ఉంది.

## ఆస్ట్రేలియా పర్యటనకు డబ్ల్యుపిఎల్ స్టార్..

వన్డే, టీ20లకు ఎంపికైన స్పిన్ సంచలనం!



వన్డే వరల్డ్‌కప్ విజేత భారత జట్టు తొలి విదేశీ పర్యటనకు సిద్ధమవుతోంది. ఇటీవలే శ్రీలంకను వైట్‌వాష్ చేసిన టీమిండియా.. ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. ఇప్పటికే షెడ్యూల్ ఖరారు కావడంతో ఆదివారం వన్డే, టీ20లకు స్క్వాడ్‌ను ప్రకటించారు సెలెక్టర్లు. హర్మన్‌ప్రీత్ కౌర్ కెప్టెన్‌గా, స్మృతి మంధాన డిప్యూటీగా 15 మందితో కూడిన బృందాన్ని ఎంపిక చేశారు. ఈమధ్యే శ్రీలంకపై తిప్పేసిన వైష్ణవీ శర్మ వన్డే, టీ20లకు ఎంపికవ్వగా.. డబ్ల్యుపిఎల్‌లో చెలరేగి ఆడుతున్న గుజరాత్ జెయింట్స్ హిట్టర్ భారతి ఫుల్‌మాలి టీ20 స్క్వాడ్‌లోకి వచ్చింది.
శ్రీలంకపై వికెట్లతో మెరిసిన వైష్ణవీ శర్మ వన్డే, టీ20 స్క్వాడ్‌లోకి తీసుకున్నారు. మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌లో భారీ సిక్సర్లతో రెచ్చిపోతున్న భారతి ఫుల్‌మాలి జాతీయ జట్టులోకి తొలిసారి ఎంపికైంది. డబ్ల్యుపిఎల్‌లో వికెట్ల వేట కొనసాగిస్తున్న శ్రేయాంక పాటిల్ పొట్టి ఫార్మాట్ స్క్వాడ్‌లోకి దూసుకొచ్చింది. వన్డే ప్రపంచకప్‌లో ఆల్‌రౌండర్‌గా.. డబ్ల్యుపిఎల్‌లో ముంబై ఇండియన్స్ తరఫున కీలక ఇన్నింగ్స్‌లు ఆడుతున్న అమన్‌జోత్ కౌర్ రెండు ఫార్మాట్లకు ఎంపికైంది. అయితే.. ఏకైక టెస్టుకు స్క్వాడ్‌ను ప్రకటించాల్సి ఉంది.

**భారత వన్డే స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని(వికెట్ కీపర్), స్నేహ్ రానా, దీప్తి శర్మ, హర్లీన్ డియోల్, జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జోత్ కౌర్, కష్వీ గౌతమ్, రేణుకా సింగ్, శ్రీచరణి, వైష్ణవీ శర్మ, క్రాంతి గౌడ్

**భారత టీ20 స్క్వాడ్ :** హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), షఫాలీ వర్మ, రీచా ఘోష్(వికెట్ కీపర్), జి.కమలిని (వికెట్ కీపర్), జెమీమా రోడ్రిగ్స్, అమన్‌జోత్ కౌర్, రేణుకా సింగ్, అరుంధతి రెడ్డి, భారతి ఫుల్‌మాలి, శ్రేయాంక పాటిల్, స్నేహ్ రానా, శ్రీచరణి, వైష్ణవీ శర్మ, క్రాంతి గౌడ్

### ఫిబ్రవరి 15వ తేదిన..

ఆస్ట్రేలియా పర్యటనలో మూడు టీ20లు, మూడు వన్డేలు, ఏకైక టెస్టు ఆడనుంది టీమిండియా. ఫిబ్రవరి 15వ తేదిన తొలి టీ20తో సిరీస్ షురూ కానుంది. ఫిబ్రవరి 19న రెండో మ్యాచ్, ఫిబ్రవరి 21న మూడో మ్యాచ్‌తో పొట్టి సిరీస్ ముగుస్తుంది. అనంతరం.. మూడు రోజులకే.. ఫిబ్రవరి 24న బ్రిస్బేన్‌లో వన్డే సిరీస్ ప్రారంభమవుతుంది. ఫిబ్రవరి 27న హోబర్ట్‌లో రెండో వన్డే, మార్చి 1వ తేదీన చివరి మ్యాచ్ నిర్వహించనున్నారు. భారత జట్టుతో వన్డే సిరీస్ అనంతరం ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ముగియనుంది.

## 'శత'క్కొట్టిన మిచెల్, ఫిలిప్స్..



మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత్, న్యూజిలాండ్ మధ్య మూడో మ్యాచ్ జరుగుతోంది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు చేసింది. డారిల్ మిచెల్ (137; 131 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లు), గ్లెన్ ఫిలిప్స్ (106; 88 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) సెంచరీలతో విరుచుకుపడ్డారు. విల్ యంగ్ (30), మైఖేల్ బ్రాస్‌వెల్ (28*) పరుగులు చేశారు. ఓపెనర్లు డెవాన్ కాన్వే (5), హెన్రీ నికోల్స్ (0) తొలి రెండు ఓవర్లలోనే నిష్క్రమించారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. కుల్‌దీప్, సిరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కింది.
కాన్వే, నికోల్స్, విల్ యంగ్ ఔటవడంతో న్యూజిలాండ్ 58 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ క్రమంలో క్రీజులో పాతుకుపోయిన మిచెల్, ఫిలిప్స్ భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 186 బంతుల్లో 219 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. మిచెల్ 56 బంతుల్లో హాఫ్ సెంచరీ, 106 బంతుల్లో శతకం పూర్తిచేసుకున్నాడు. 53 బంతుల్లో అర్ధ శతకం అందుకున్న గ్లెన్ ఫిలిప్స్.. మరో 30 బంతుల్లోనే మూడంకెల స్కోరు అందుకోవడం విశేషం.

## 'ఎమ్మా రాడుకాను' అలవోక విజయం

రెండో రౌండ్‌లో 'అల్కరాస్'!



కొత్త ఏడాదిని టాప్ సీడ్స్ ఘనంగా ఆరంభించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్‌లో కార్లోస్ అల్కరాస్, మహిళల ఫేవరెట్ ఎమ్మా రాడుకాను అలవోక విజయంతో ముందంజ వేశారు. మెల్‌బోర్న్ పార్క్‌లో జరుగుతున్న ఈ గ్రాండ్‌స్లామ్ తొలి పోరులో 38 విన్నర్స్‌తో ఆడం వాల్టన్‌పై విరుచుకుపడిన అల్కరాస్ ఈ సీజన్‌లో మొదటి విజయం నమోదు చేశాడు.
తొలి రౌండ్‌లో అల్కారస్‌కు ఆడమ్ వాల్టన్ గట్టి పోటీనిచ్చాడు. తొలి సెట్ 6–3తో గెలుపొందిన స్పెయిన్ కుర్రాడికి షాకిస్తూ.. రెండో సెట్‌లో (7–6) ఒక్క పాయింట్‌తో సొంతం చేసుకున్నాడు ఆడమ్. అయితే.. నిర్ణయాత్మక సెట్‌లో జోరు చూపించిన అల్కరాస్ 6–2తో ప్రత్యర్థిని మట్టికరిపించాడు. రెండో రౌండ్‌లో యన్నిక్ హన్ఫ్‌మన్‌తో అతడు తలపడనున్నాడు.

### వరుస సెట్లలో జోరు

మహిళల సింగిల్స్‌లో బ్రిటీష్ టెన్నిస్ స్టార్ ఎమ్మా రాడుకాను పవర్‌ఫుల్ షాట్లతో ప్రేక్షకులను అలరించింది. అనారోగ్యం కారణంగా గతేడాది పలు టోర్నీలకు దూరమైన తను.. ఆస్ట్రేలియా ఓపెన్ లక్ష్యంగా పెట్టుకుంది. ఆదివారం జరిగిన తొలి రౌండ్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన మనన్‌చయ సవాంగ్‌క్యేను వరుస సెట్లలో (6–4, 6–1) చిత్తుగా ఓడించింది. ఏకపక్ష విజయంతో ఎమ్మా రెండో రౌండ్‌కు దూసుకెళ్లింది.

## ఆరోగ్యం




## పార్కిన్సన్ వ్యాధిపై కొత్త పరిశోధనలు

పార్కిన్సన్ వ్యాధి అనేది ఒక నాడీ సంబంధిత సమస్య. ఇది ముఖ్యంగా వృద్ధుల్లో కనిపిస్తూ, శరీర కదలికలను నియంత్రించే మెదడులో డోపమైన్ ఉత్పత్తి చేసే కణాలు నష్టపోవడంతో కొనసాగుతుందని శాస్త్రవేత్తలు ఇప్పటి వరకు నమ్ముతున్నారు. డోపమైన్ శరీరంలోని ముఖ్యమైన న్యూరో ట్రాన్స్‌మిటర్‌గా పనిచేస్తుంది. దీనిలేమి తగ్గితే, కదలిక నియంత్రణ, సమన్వయ సమస్యలు, ఇబ్బందులు మొదలైన లక్షణాలు వ్యక్తంలో రావచ్చు. తాజా పరిశోధనలు ఈ దృష్టికోణాన్ని మరింత విస్తరుస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం ఏమిటంటే పార్కిన్సన్ వ్యాధి ప్రారంభం పూర్తిగా మెదడులోనే కాకుండా, శరీరంలోని ఇతర అవయవాలలో... ముఖ్యంగా మూత్రపిండాల్లో.. మొదలవుతుందని సూచనలు వెలుగులోకి వచ్చినవి.
మూత్రపిండాల్లో నాడీ సంబంధిత బ్యాలెన్స్‌ను ప్రభావితం చేసే కొన్ని రోగ నిరోధక మార్పులు లేదా ఫిల్టరింగ్ సామర్థ్యంలో తేడాలు ఉంటే, అవి నేరుగా నాడీ కణాలపై ప్రభావం చూపవచ్చని కనుగొన్నారు. మూత్రపిండాలతో సంబంధం ఉండే రసాయనాల అసమతులనం లేదా ఫంక్షన్ తగ్గుముఖం ఉన్నపుడు, మెదడులో డోపమైన్ నిర్మాణ దశలను నెమ్మదిగా ధ్వంసం చేస్తుందని సూచనలు ఉన్నాయి. పార్కిన్సన్స్ వ్యధి పూర్తిగా మెదడులో మొదలవుతుందన్న ప్రాచీన భావనను ఈ పరిణామం సవాలు చేస్తున్నది.
ఈ కొత్త ప్రామాణిక దృష్టికోణం ప్రకారం, మనిషికి మూత్రపిండాల ఆరోగ్యం చాలా ముఖ్యం. మూత్రపిండాల సమర్థవంతమైన కార్యాచరణ లేకపోతే, శరీరంలోని అనేక నాడీ సంబంధిత మార్గాలు ప్రభావితమవుతాయని తెలుస్తోంది. అందువల్ల డోపమైన్ తగ్గుదలకు తోడ్పడే మూలకాలు బయటపడే ప్రమాదం ఉంది. మూత్రపిండాల పనితీరు, మైటోకాండ్రియల్ ఫంక్షన్, ప్రోటీన్ మడతలు, రసాయన అసమతుల్యత వంటి అంశాలను ముందుగానే పరీక్షించడం ద్వారా వ్యాధి ప్రమాదం తగ్గించవచ్చు. పురాతన విధానాలు కేవలం మెదడులోని నష్టాన్ని పూరించడం, డోపమైన్ బియ్యించడం మీదే కేంద్రీకృతమై ఉండగా, నూతన ఔషధ లక్ష్యాలు మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఉండవచ్చు.
పార్కిన్సన్ వ్యాధి సాధారణంగా శరీర కదలికలలో వణికిపోతున్న భావన, సరైన కదలికలు లేకపోవడం లేదా కదలికపై నియంత్రణ కోల్పోవడం వంటి లక్షణాల ద్వారా బయటపడుతుంది. దీని వల్ల నిద్రలో మార్పులు సంభవిస్తాయి. మానసిక మార్పులను కూడా గుర్తించవచ్చు. కొంత మందిలో మాట తడబడుతుంది లేదా స్పష్టత కోల్పోతుంది. ఎక్కువగా వృద్ధుల్లో ఈ వ్యాధి కనిపిస్తుంది. అయినంత మాత్రాన మధ్య వయస్కులకు రాకూడదని ఏమీ లేదు. కొత్త పరిశోధనల ప్రకారం మూత్రపిండాలు నాడీ వ్యవస్థకు ప్రత్యక్ష లేదా పరోక్ష ప్రభావాలను చూపే అంశాలను ఉత్పత్తి చేస్తాయని తెలుస్తోంది. ఇది నాడీ మార్గాల సంక్లిష్టతను మెరుగ్గా అర్థం చేసుకునేందుకు, పార్కిన్సన్స్ వంటి వ్యాధుల నివారణలో ముందస్తు చర్యలను తీసుకోవడానికి దారి తీస్తుంది. పార్కిన్సన్ వ్యాధిని సరళంగా మెదడులోని డోపమైన్ కణాల నష్టం వల్లే అవుతుందని భావించడం కన్నా, ఇప్పుడు అందులో మూత్రపిండాల ఆరోగ్యపరమైన పాత్రను కూడా మనం అర్థం చేసుకోవాల్సి వస్తోంది. ఇది ముందస్తు పరీక్షలు, జీవనశైలి మార్పులు, చికిత్సను కొత్త దిశలో మార్చి, వ్యాధి బాధితుల జీవిత నాణ్యతను మెరుగుపరచే శక్తిని కలిగి ఉంది.

**గమనిక :** ఈ సమాచారంలో పేర్కొన్న వైద్య సంబంధిత అంశాలు శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా ఉన్నప్పటికీ, వ్యక్తిగత వైద్య సూచనల కోసం నిపుణులతో సంప్రదించడం అవసరం.

## డిమెన్షియాకు కారణం తెలిసింది!



డిమెన్షియాపై ఎంతోకాలంగా జరుగుతున్న పరిశోధనలు కొలిక్కి వచ్చినట్టు కనిపిస్తున్నది. తాజా అధ్యయనాల ప్రకారం, మెదడులో వ్యర్థ పదార్థాలను శుద్ధి చేసే 'గ్లింఫాటిక్' వ్యవస్థలో ఏదైనా సమస్య తలెత్తినప్పుడు లేదా అంతరాయం కలిగినప్పుడు, డిమెన్షియా వంటి మేధస్సు నష్టం వ్యాధులు వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయి. కృత్రిమ మేధస్సు (ఎఐ)ని ఉపయోగించి, ఎంఆర్‌ఐ సహకారంతో 40,000 మందిపై చేసిన అధ్యయనాల్లో గుండె ఆరోగ్యం సమస్యలు, నిద్రలేమి ఈ బ్రెయిన్ క్లీనింగ్ సిస్టమ్ పనితీరును దెబ్బతీస్తాయని గుర్తించారు. ఈ గ్లింఫాటిక్ వ్యవస్థ ప్రధానంగా నిద్ర సమయంలో పని చేస్తుంది. దీని ద్వారా 'సెరెబ్రోస్పినల్ ఫ్లూయిడ్' (సిఎస్ఎఫ్) మెదడులోకి ప్రవహించి, వ్యర్థాలను శుద్ధి చేసి, ప్రమాదకరమైన 'అమిలాయిడ్' వంటి కణాలను బయటకు పంపుతుంది. సిఎస్ఎఫ్ ప్రవాహం సరయిన విధంగా సాగనప్పుడు లేదా నిద్రకు అంతరాయం కలిగినప్పుడు, వ్యర్థ పదార్థాలు మెదడులో నిల్వ ఉండిపోతాయి. దీని వల్ల డిమెన్షియా సంక్షోభం మొదలవుతుంది. జీవనశైలిలో మార్పులు, నిద్రను మెరుగుపరచడం, రక్తపోటును నియంత్రించడం వంటి చర్యలు మెదడు శుద్ధి వ్యవస్థను బలోపేతం చేసి, మేధస్సు ఆరోగ్యాన్ని కాపాడే అవకాశాన్ని పెంచుతాయని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.


ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

## రీల్

## 23న 'పోలీసోడు' రీ-రిలీజ్




స్టార్ హీరో విజయ్, టాప్ హీరోయిన్ సమంత జంటగా, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో వి క్రియేషన్స్ పతాకంపై కలైపులి థాను నిర్మించిన తమిళ చిత్రం 'తెరి' ఘన విజయం సాధించింది. తెలుగులో 'పోలీసోడు' పేరుతో అనువాదమై ప్రేక్షకుల హృదయాలను దోచుకుని సూపర్ హిట్ చిత్రంలా నిలిచింది. ఈ చిత్రం మరోసారి వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమైంది. ఈ 'పోలీసోడు' చిత్రం ఈ నెల 23న రీరిలీజ్ కానుంది.ఈ చిత్రాన్ని నైజాం ప్రాంతంలో ప్రముఖ పంపిణీ సంస్థ ఏషియన్ ఫిలిమ్స్ వారు, ఆంధ్రాలో సురేష్ మూవీస్ భారీ స్థాయిలో విడుదల చేస్తున్నారు. తండ్రి–కూతురు అనుబంధం, పోలీస్ బ్యాక్‌డ్రాప్, భావోద్వేగాలు, యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్‌ను సమపాళ్లలో మేళవించి అట్లీ ఈ 'పోలీసోడు' చిత్రాన్ని రూపొందించారు. విజయ్ ద్విపాత్రాభినయంలో మెప్పించగా, సమంత పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది.



## వరుణ్ తేజ్ కొత్త సినిమా

వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో యువీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై నిర్మిస్తున్న చిత్రం టైటిల్ గ్లిమ్స్ విడుదలకు సిద్ధమైంది. ఈ సినిమా టైటిల్, గ్లింప్స్ నేడు రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా వరుణ్ కెరీర్‌లోనే వెరీ స్పెషల్, ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌గా ఉండబోతోంది. హారర్–కామెడీ, ఇండియన్ అండ్ కొరియన్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. కమెడియన్ సత్య మరో కీలమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. 'తొలిప్రేమ' తర్వాత వరుణ్ – థమన్ కలసి ఈ సినిమా చేస్తున్నారు.

## 'యుఫోరియా' ట్రైలర్ విడుదల

దర్శకుడు గుణ శేఖర్ రూపొందించిన లేటెస్ట్ మూవీ 'యుఫోరియా'. శ్రీమతి రాగిణి గుణ సమర్పణలో గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. 'కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా 'యుఫోరియా'. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న కొన్ని దారుణాల్ని ఉన్నది ఉన్నట్లుగా తెరకెక్కించా. యువత ఎంత తప్పుదోవ పడుతుందన్నది బోల్డ్‌గా చూపించా' అన్నారు దర్శకుడు గుణశేఖర్. ఆయన తెరకెక్కించిన ఈ సినిమాలో భూమిక, సారా అర్జున్, విఘ్నేశ్ గవిరెడ్డి, గౌతమ్ మేనన్ ప్రధాన పాత్రలు పోషించారు. రాగిణి గుణ సమర్పణలో నీలిమ గుణ నిర్మించారు. ఈ సినిమా ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో హైదరాబాద్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు.



ఈ సందర్భంగా భూమిక మాట్లాడుతూ.. 'ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా. 23ఏళ్ల తర్వాత గుణశేఖర్‌తో కలిసి పని చేయడం సంతోషంగా ఉంది. ఈ చిత్రం చేస్తున్నప్పుడు నాకు మా అబ్బాయి గుర్తొచ్చాడు. పిల్లల్ని ఎలా పెంచాలనేది అందరూ తెలుసుకోవాలి' అన్నారు. 'ఇది చాలా సున్నితమైన అంశంతో రూపొందింది. ఈ కథ విన్నప్పుడు భావోద్వేగానికి లోనయ్యా. ఇది కచ్చితంగా అందరూ మెచ్చే సినిమా అవుతుంది' అంది నటి సారా అర్జున్. దర్శకుడు గుణ శేఖర్ మాట్లాడుతూ.. 'నా మనసుని కదిలించిన కథ ఇది. ఈ చిత్రం చూస్తున్నప్పుడు కొందరు మధ్యలోనే వెళ్లిపోయే అవకాశముంది. ఎందుకంటే వాళ్లకి నాపై కోపం వస్తుంది. కచ్చితంగా ఈ చిత్రం చూశాక అందరూ ఆలోచిస్తారు. ప్రతి కుటుంబం దీనితో కనెక్ట్ అవుతుంది. ఈ కథ వింటున్నప్పుడే నీలిమ దీనికి సారా అర్జున్ అయితే బాగుంటుందని చెప్పింది. ఆమె నటిస్తానంటేనే ఈ సినిమా తీద్దాం లేదంటే ఆపేద్దాం అని నీలిమతో చెప్పా. ఈ చిత్రం విడుదలయ్యాక భూమిక తప్పకుండా అందరి ప్రశంసలు అందుకుంటుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో నీలిమ, పృథ్వీ అడ్డాల, యుక్త గుణ, విఘ్నేశ్ గవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

### సినీ ప్రముఖుల నివాళి



విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారకరామారావు 30వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు, అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు ఆయనకు నివాళులు అర్పిస్తున్నారు. ఫిల్మ్‌నగర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి సినీ పరిశ్రమకు చెందిన పలు శాఖల ప్రముఖులు పూల మాలలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన వ్యక్తి ఎన్టీఆర్. స్వార్థం లేని మనిషి ఆయన. సినిమాల్లో ఆయన చేయని ప్రయోగం లేదు కథ లేదు. అలాంటి వ్యక్తిని ఏడాదికి ఓసారి జయంతి, వర్ధంతులకు గుర్తు చేసుకొని, పూల మాలలు వేసి నివాళులు అర్పించడం కాదు. రాజకీయలో అయినా, సినిమాల్లో అయినా ఆయన్ను ఆదర్శంగా తీసుకునే ధైర్యం ఉండాలి. ఇవాళ ఎంతమందిలో ఆ ధైర్యం ఉంది. ఆయనలా స్వార్థం లేకుండా రాజకీయం చేయగలరా? చేయాలనే ఆలోచన జనాల్లో రావాలంటే ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలి' అని అన్నారు. మాదాల రవి మాట్లాడుతూ 'తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి నందమూరి తారకరామారావు. తెలుగు జాతికి, సినిమాకు గుర్తింపు తీసుకొచ్చిన అలాంటి వ్యక్తి భారతరత్న ఇవ్వాలి. దానికోసం మనమంతా కృషి చేయాలి' అన్నారు.పరుచూరి గోపాలకృష్ణ మాట్లాడుతూ 'మనదేశం' చిత్రంలో ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ ప్రకారమే ఒక్కోమెట్టు ఎక్కుతూ ఏ స్థాయికి ఎదిగారో అందరికీ తెలిసిందే! ఆయన మనల్ని విడిచి 30 ఏళ్లు దాటిని... ఇప్పటికీ మా అందరికీ సజీవంగా వచ్చి పలకరిస్తునట్టే ఉంటుంది. అన్నగారు లేరని ఏరోజు అనుకోలేదు' అని అన్నారు. కార్యక్రమంలో దర్శకుడు వై వి ఎస్ చౌదరి, ప్[పరుచూరి గోపాలకృష్ణ, ఫిలిం నగర్ హౌసింగ్ సొసైటీ కార్యదర్శి కాజా సూర్యనారాయణ, నందమూరి జానకీరామ్ భార్య దీపిక, మోహనరూప తదితరులు పాల్గొన్నారు.

## ఊపేస్తున్న... మెగా మేకోవర్




రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా బుచ్చిబాబు సాన దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా తదుపరి షెడ్యూల్ త్వరలోనే ప్రారంభం కానుంది. భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దీనికోసం రామ్ చరణ్ మేకోవర్ అవుతున్నారు. గంటల కొద్దీ జిమ్ లో కసరత్తు చేస్తున్నారు. మర్చి 27వ తేదీన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్నారు. ఇప్పటి వరకు దాదాపు ఎనభై శాతం షూటింగ్ పూర్తయింది. త్వరలోనే జరగబోయే షెడ్యూల్‌తో షూటింగ్ దాదాపుగా పూర్తి కానుంది. యాక్షన్ సన్నివేశాలను భారీ స్థాయిలో చిత్రీకరిస్తున్నారు. క్లైమాక్స్ వంటి సన్నివేశాల చిత్రీకరణ కోసం రామ్ చరణ్ మేకోవర్ అవుతున్నారు. చికిచికి అనే పాట ఇప్పటికే బాగా పాపులర్ అయింది. చికిరి చికిరి ఐదు భాషలలో 200 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టింది. ఏ ఆర్ రెహమాన్ మ్యూజిక్, రామ్ చరణ్ వైరల్ డ్యాన్స్‌తో ఈ సాంగ్ గ్లోబల్ మూమెంట్‌గా మారింది. త్వరలోనే మరో పాటను కూడా రిలీజ్ చేయబోతున్నారు. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు, సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తున్నారు.

## 'మన శంకర వర ప్రసాద్ గారు' రూ.226+ కోట్ల వరల్డ్ గ్రాస్



మెగాస్టార్ చిరంజీవి ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'మన శంకర వర ప్రసాద్ గారు' ఈ సంక్రాంతి సీజన్‌లో బాక్సాఫీస్ వద్ద రికార్డులు క్రియేట్ చేస్తోంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఈ చిత్రం థియేటర్లను పండుగ వేడుకగా మార్చింది. తెలుగు రాష్ట్రాలలో భారీగా ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరిస్తోంది.మన శంకర వర ప్రసాద్ గారు ఇప్పటివరకు ఎపి/తెలంగాణలో పెద్ద సంఖ్యలో వసూళ్లు సాధించింది, గత రికార్డును బద్దలు కొట్టింది. పరిశ్రమలో అత్యధిక 5వ రోజు వసూళ్లు సాధించిన చిత్రంగా మన శంకర వర ప్రసాద్ గారు సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. కేవలం ఐదు రోజుల్లో 2.5 మిలియన్లకు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి, ప్రపంచవ్యాప్తంగా 226+ కోట్ల వసూళ్లు సాధించింది. మౌత్ టాక్ తో థియేటర్లు హౌస్‌ఫుల్ షోలతో సందడి చేస్తున్నా యని నిర్మాతలు సుస్మిత కొణిదెల, సాహు గారపాటి చెప్పారు.

## 'అమీర్ లోగ్' ఫస్ట్ లుక్




అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్ నుంచి ప్రొడక్షన్ నంబర్ 1గా 'అమీర్ లోగ్' చిత్రం రాబోతోంది. ఈ చిత్రంలో ఎంసీ హరి, మనోజ్, శశిధర్ హీరోలుగా, వేదా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయియోగి కీలక పాత్రలు పోషిస్తున్నారు. రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకి మాధవి రెడ్డి సోమ నిర్మాతగా, మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సక్సెస్ ఫుల్ హీరో శ్రీ విష్ణు చేతుల మీదుగా రిలీజ్ చేసిన 'అమీర్ లోగ్' టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ఎంతగానో వైరల్ అయింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన పోస్టర్లు అందరినీ ఆకట్టుకున్నాయి. ఇక తాజాగా రిలీజ్ చేసిన మాస్ సాంగ్ ఇప్పుడు ట్రెండింగ్‌లోకి వచ్చేసింది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన 'అవ్వల్ దావత్' సాంగ్ ఇప్పుడు యూట్యూబ్‌లో వన్ మిలియన్ వ్యూస్‌కు పైగా వీక్షణలతో దూసుకుపోతోంది.'అవ్వల్ దావత్' సాంగ్‌లో రాహుల్ సిప్లిగంజ్ గాత్రం, ఆనీ మాస్టర్ స్టెప్పులు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ పాట యూట్యూబ్‌లో అందరినీ ఆకట్టుకుంటూ ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. ఈ చిత్రానికి ఎస్‌వికె సినిమాటోగ్రఫీని అందిస్తుండగా, స్మరణ్ సాయి సంగీతం అందిస్తున్నారు. రోహిత్ పెనుమత్స ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

## బహిరంగ సభకు తరలిన సిపిఐ శ్రేణులు



ప్రజాపక్షం/రామగిరి : సిపిఐ భారతదేశం గడ్డపై 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఐదు లక్షల మందితో ఖమ్మంలో శతాబ్ది ఉత్స వాల ముగింపు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసిన సందర్భంగా అట్టి సభను విజయవంతం చేయడానికి ఆర్ జి త్రీ, ఏపీఏ ఏరియా నుండి ఏఐ టియుసి నాయకులు, సిపిఐ రామగిరి మండల నాయకులు, డిప్యూటీ జన రల్ సెక్రెటరీ వై.రాజు, గౌతమ్ గోవర్ధన్ సెంట్రల్ సెక్రెటరీ జూపాక.రామ చందర్, క్రాంతి, డీటీ రావు, గంగాధర్, మల్లేష్, శ్రీనివాస్, సురేష్ ఎస్సార్ యన్ నాయకులు సిపిఐ కార్యకర్తలు ఎర్ర చొక్కాలు ధరించుకొని ఎర్రజెం డాలతో ఫ్లెక్సీలతో ఎర్ర దండు దలంగా సుమారు 200 మందితో బస్సుల్లో ఖమ్మం బయలుదేరి ఈ యొక్క సభను విజయవంతం చేశారు.

**కరీంనగర్‌లో...** ఖమ్మం లో జరిగిన సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహి





రంగ సభ కు సిపిఐ కరీంనగర్ జిల్లా నాయకులు,కార్యకర్తలు, పార్టీ, ప్రజా సంఘాల శ్రేణులు భారీగా తరలి వెళ్లడం జరిగిందని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ఎస్సార్ అండ్ బిజిఎన్నార్ మైదానంలో భారత కమ్యూనిస్టు పార్టీ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ రాష్ట్ర కార్యదర్శి కూనం నేని సాంబశివ రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ ప్రధాన కార్య దర్శి, మాజీ ఎంపీ డి.రాజా, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో పాటు నలభై దేశాల అంతర్జాతీయ కమ్యూనిస్టు పార్టీల ప్రతినిధులు, జాతీయ రాష్ట్ర నాయకులు హాజరయ్యారు. ఖమ్మంకు తరలి వెళ్ళిన వారిలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, అందే స్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్,కొయ్యడ సృజన్ కుమార్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, బత్తుల బాబు, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయినీ తిరుపతి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు తో పాటు జిల్లా వ్యాప్తంగా దాదాపుగా రెండు వేల మంది కార్యకర్తలు పాల్గొన్నారు.




**పెద్దపల్లి:** సిపిఐ శత వసంతాల ము గింపు ఉత్సవాల సందర్భంగా ఆది వారం ఖమ్మం లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ కు గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతం నుంచి పార్టీ, ప్రజా సంఘాల నాయకులు, కార్యక ర్తలు భారీగా తరలి వెళ్ళారు. ఈ సందర్భంగా గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో పార్టీ శ్రేణుల నుద్దేశించి సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషంలు మాట్లాడుతూ ఖమ్మం లో వంద సంవత్సరాలను పురస్కరించుకొని ఐదు లక్షల మంది తో భారీ బహిరంగ సభ నిర్వహిస్తు న్నారని, ఇట్టి సభకు 42 దేశాల నుండి కమ్యూనిస్ట్ పార్టీ ప్రతినిధులు హాజరు కానున్నారని వారు తెలిపారు. ఈ భారీ బహిరంగ సభ కు తరలి వెళ్ళిన వారి లో సిపిఐ, ఎఐటియుసి ప్రజా సంఘాల నాయకులు రంగు శ్రీను, సంకె అశోక్, మాదన మహేష్, గండి ప్రసాద్, బోగ సతీష్, సయ్యద్ సోహేల్, సిర్ర మల్లికార్జున్, తాళ్ళపెల్లి మల్లయ్య, మానాల శ్రీనివాస్, పొన్నాల వెంకటయ్య, కారంపూరి వెంకన్న, గుర్రం ప్రభుదాస్, నాయిని శంకర్, గొడిశల నరేశ్, చెప్యాల భాస్కర్, బలుసు రవి, బండి మల్లేష్, బోయిన స్వామి, ఏ.వి.ఎస్ ప్రకాశ్, దాసరి అనిల్, విజయ లక్ష్మి, మడి కొండ ఓదెమ్మ, మాటేటి శంకర్, సూర్య, తొడుపునూరి రమేశ్ కుమార్, ఎం ఎ గౌస్, వై.లెనిన్ , శనగరపు చెంద్ర శేఖర్, ఆసాల రమ, ఎజ్జ రాజయ్య, ఎర్రల రాజయ్య, రేణికుంట్ల ప్రీతం, తిరుమల, రేణుక, భాగ్య, నవీన్, కరీం, శివ, పడాల కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్ ఖర్చులకు మంత్రి చేయూత




ప్రజాపక్షం/ధర్మపురి : మండలంలోని జైనా గ్రామానికి చెందిన కుంటాల లింగన్న అనారోగ్యంతో చికిత్స పొందుతూ హైదరాబాద్ లోని ఆసుపత్రిలో మరణించగా మృతదేహాన్ని అంబులెన్స్ ద్వారా గ్రామానికి చేర్చేందుకు మ ంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్ చేయూతను అందించారు.ఈమేరకు మంత్రి అడ్లూరి ఆదేశాలతో ఆదివారం నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్ రూ.15 వేలు మృతుని కుటుంబసభ్యులకు అందించారు.

## రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం: జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం నుండి ఫకీర్ కొండాపూర్ వరకు ప్రధాన మంత్రి గ్రామీణ సడాకయోజన పథకం కింద 3.83 కోట్ల నిధులతో జరుగుతున్న రోడ్డు పనులను నిజమాబాద్ ఎంపీ ధ ర్మపురి అరవింద్ ఆదేశాల మేరకు బిజెపి పార్టీ మండల అధ్యక్షుడు బాయ్ లింగారెడ్డి బిజెపి నాయకులతో కలిసి ఆదివారం పరిశీలించారు.ఈ సంద ర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ రెండు నెలలో లింకు రోడ్డు అందు బాటు లోకి వస్తుందని,ఈ రోడ్డు వేయడం ద్వారా యామపూర్, ఫకీర్ కొండాపూర్ గ్రామాలకు మండల కేంద్రనికి వెళ్లడానికి రవాణా భారం తగ్గి సులభం తరం అవుతుందని అన్నారు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం నుండి కోమటి కొండాపూర్ వరకు కూడా లింకు రోడ్డు ను ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం లో పెట్టాలని ఎంపీ ని కలిసి కోరగా ఎంపీ సానుకూలంగా స్పందచరని లింగారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమం లో మండల ప్రధాన కార్య దర్శులు సుంచు రణధీర్, పంతంగి వెంకటేష్ యాదవ్, జిల్లా నాయకులు తీగల శ్రీధర్ రెడ్డి,నాయకులు పుస్తెం రాజారెడ్డి, పుస్తెమ్ మహేందర్, పసు నూరి కిరణ్,ముద్దం నరసింహరెడ్డి,రైతులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్

ప్రజాపక్షం/హుస్నాబాద్: హుస్నాబాద్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కలుపుతామని ప్రజల ఆకాంక్ష మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని తెలంగాణ బీసీసంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నా రు. ఆదివారం ఆయన హుస్నాబాద్‌లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను పంపిణీ అనంతరం ఏర్పాటు చే సిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హుస్నాబాద్ మూడు ముక్కలు చేసినియోజక వర్గంను ఒక్కటి చెస్తామని అప్పటి టిపిసిసి అధ్యక్షుడి హోదాలో ముఖ్య మంత్రి రేవంతరెడ్డి ప్రకటించారు. అదే నిర్ణయం మేరకు తగు సమయంలో నిర్ణయం తీసు కుంటామని అన్నారు. అప్పుడు హుస్నాబాద్‌ను బల వంతాంగా సిద్దిపేటలో కలిపిన హుస్నాబాద్‌ను కొసం నాయకులు ధర్నా లు ఆందోళలు, నిరసనలు చేసిన పట్టించుకోలేదని అన్నారు. ప్రజలకాంక్షల మేరకు రిటైర్డ్ జడ్జితో నివేదిక తీసుకుని తగు నిర్ణయం తీసుకుం టామని అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం లో ఉన్న గౌరవెల్లి , గండిపెల్లి ప్రాజెక్టులను పూర్తి చేసి హుస్నా బాద్ నియోజకవర్గంను సస్యశామలం చే స్తామని అన్నారు. హుస్నాబాద్ అర్బన్‌పారెస్టుపార్క్, మహాస ముద్రం గండిసర్యాయి పాపన్న కోటలు, అభివృద్ధి చేసి టూరిజం స్పాట్‌గా ఏర్పాటు చేస్తామని అన్నారు.కరీంన గర్, జనగాం, సిద్దిపేట, హన్మకొండ జిల్లాల మధ్య ఉన్న హుస్నాబాద్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు.

**ఇందిరమ్మ రాజ్యాంలో ఇంటింటా సౌభాగ్యం నింపడమే కాంగ్రెస్ లక్ష్యం**

ఇందిరమ్మ రాజ్యాంలో ఇంటింట సౌభాగ్యం నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అందుకు రాష్ట్రంలో ఇండ్లు లేని నిరుపేదలు ఉండకూడదని లక్ష్యంతో ముఖ్య మంత్రి రేవంతరెడ్డి 5లక్షల తో ప్రతి పేదవాడు ఇల్లు కట్టుకునేందుకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించా మని తెలంగాణ బీ సీ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ గౌడు తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నా బాద్ పట్టణంలోని ఇండ్లు లేని పేదలకు మంజూరి పత్రా లను , 57 మంది మైనార్టీ లకు కుట్టు మిషన్లు జిల్లా కలె క్టర్ కె హైమవతితో కలసి పంపిని చేశారు.ఈ సంద ర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజాపాలన అధికారం చేపట్టిన తరువాతకాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టే 2 ఏళ్ల కాలంలోనే హామీ లను అమలు చేశామని మరో మూడు ఏళ్ల మరింత అభి వృద్ధి చేస్తామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను నేరవేర్చామని అన్నారు. రైతులకు రుణ మాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యు నిట్లు కరంటు , ఐదు వందలకు గ్యాస్ పంపిని మహిళ సంఘాలకు వడ్డీలేని రుణాలు లాంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశామని అన్నారు.

## టికెట్ల కేటాయింపులో యువతకు ప్రాధాన్యం..

అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల

ప్రజాపక్షం/కరీంనగర్: రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో యువతకు టికెట్ల కేటాయింపులో తగిన ప్రాధాన్యత ఉంటుం దని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు స్పష్టం చేశారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సామాజిక సేవ కార్యక్ర మాలు నిర్వహిస్తున్న యువత రాజకీయాల్లో మరింత రాణిస్తా రని తెలిపారు. ఆదివారం కొత్తపెల్లిలోని వెలిచాల ప్రజా కార్యా లయానికి 46వ డివిజన్ కు చెందిన కాంగ్రెస్ నాయకుడు పెద్ద పెల్లి గోపాలకృష్ణ ఆధ్వర్యంలో 200 మంది డివిజన్ ప్రజలు, గంగపుత్ర సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, మహి ళలు, యువకులతో కలిసి తరలివచ్చారు. ఈ సందర్భంగా వెలిచాల రాజేందర్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. రాజేందర్ రావును గోపాలకృష్ణ శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రాజేందర్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు సానుకూ లంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. సర్వే ప్రకారంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కమిటీ టికెట్లను ఖరారు చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి సత్యనారా యణ, మోసం అంజయ్య నాగుల కనకయ్య, శ్రావణ్ పటేల్ తోపాటు కరీంనగర్ పట్టణ గంగపుత్ర సంఘం నాయకులు కాంగ్రెస్ నాయకులు డివిజన్ ప్రజలు, మహిళలు యువకులు



పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**29, 48వ డివిజన్ లలో బస్తీ బాట..డివిజన్ కార్యాలయాల ప్రారంభం**

ఆదివారం సాయంత్రం 29వ డివిజన్ కిసాన్ నగర్ లో కాంగ్రెస్ నాయకుడు తాండ్ర శంకర్ బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డివిజన్ కార్యాలయాన్ని రాజేందర్ రావు ప్రారంభించారు. అనంతరం బస్తిబాట కార్యక్రమంలో పాల్గొ న్నారు. 29వ డివిజన్ కిసాన్ నగర్ లో రాజేందర్ రావు ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు.

**48 డివిజన్ లో...**

మాజీ కార్పొరేటర్ మీస రమాదేవి ఆధ్వర్యంలో 48 డివిజన్ లో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని వెలిచాల రాజేందర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా డివిజన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో కలిసి బస్తి బాట నిర్వ హించారు.

## ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడమే 'అరైవ్ – అలైవ్' లక్ష్యం

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో జగిత్యాల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "అరైవ్ –అలైవ్" రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమంలో భాగంగా ఆది వారం (6వ రోజు) "డ్రంక్ అండ డ్రైవ – జీరో టోలెరెన్స్‌డే" పై అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీసులు మరియు సంబంధిత పోలీస్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, ప్రాణనష్టం, కుటుంబాలపై పడే దుష్పరిణామాల గురించి వాహనదారులకు విస్తృతంగా అవగాహన కల్పిం చారు. మద్యం మత్తులో వాహనం నడపడం కేవలం చట్ట విరుద్ధమే కాకుండా, తమ ప్రాణా లతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా తీవ్ర ప్రమాదమని స్పష్టంగా తెలియజేశారు. డ్రింక్ అండ్ డ్రైవ్ కేసులపై జీరో టాలరెన్స్ విధానం అమలు చేస్తున్నామని, మద్యం సేవించి వాహ నాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని పోలీస్ అధికారులు హెచ్చరించారు. ఈ సందర్భంగా బ్రెత్ అనలైజర్లతో వాహనదారు లను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై మోటారు వాహన చట్టం ప్రకారం కేసులు నమోదు చేశారు.జగిత్యాల జిల్లా ఎస్పీ మాట్లా డుతూ ఒక క్షణం మద్యం మత్తులో చేసిన నిర్లక్ష్యం జీవితాంతం పశ్చాత్తాపానికి దారితీ స్తుంది అని రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ప్రమాదాలకు మద్యం సేవించి వాహనాలు నడ పడం ప్రధాన కారణంగా మారుతోంది అని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా బాధ్యతాయుతంగా ప్రవర్తించి, మద్యం సేవించిన పుడు వాహనాలు నడపకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి అని వారు సూచించారు. జిల్లా పోలీస్ శాఖ చేపడుతున్న అరైవ్ –అలైవ్ క్యాంపెయిన్ లక్ష్యం ప్రమాదాలను తగ్గించి, ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవడ మేనని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెరుగుతోందని, రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని ఎస్పీ పేర్కొ న్నారు. ప్రతి ఒక్కరి బాధ్యతాయుత ప్రవర్తనే రోడ్డు ప్రమాదాల నివారణకు మార్గమని జగిత్యాల జిల్లా ఎస్పిఅశోక్ కుమార్ తెలియజేశారు.

## మేయర్ పీఠంపై గులాబీ జెండా

బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చందర్ పిలుపు



ప్రజాపక్షం/పెద్దపల్లి: రామ గుండం మున్సిపల్ కార్పొరే షన్ మేయర్ పీఠంపై మరో మారు గులాబీ జెండా ఎగుర వెద్దాం. ఈ హ్యాట్రిక్ విజ యాన్ని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిరామన్నకు గిఫ్ట్ గా ఇద్దామని రామగుండం మాజీ ఎమ్మెల్యే జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ పిలుపుని చ్చారు. ఆదివారం గోదావరిఖని మార్కండేయ కాలనీ శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్లో రామగుండం బిఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ ఎన్నికల సన్నాహాక సమావేశం జరిగింది.మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తో పాటు టిబి జికె ఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజి రెడ్డి ,నాయకులు కౌశిక ,హరి, మూల విజయ రెడ్డి, గోపు అయులయ్య యాదవ్ పాల్గొన్నారు. సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మాట్లాడుతూ రామగుండం కార్పొరే షన్ ఎన్నికల్లో బిఆర్ఎస్ శ్రేణులుంతా సైనికుల వలే పనిచేయాలని, మన లక్ష్యం మేయర్ పీఠం అన్నారు.ప్రతి డివిజన్ లో బిఆర్ఎస్ గెలుపు కోసం శ్రేణులు పని చేయాలన్నారు. ఈ సమావేశం లో టిబిజికేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజి రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ,తదితరులు పాల్గొన్నారు.

## వంజరిపల్లె గ్రామ మంచి నీటి బావిలో బ్లీచింగ్




ప్రజాపక్షం/జగిత్యాల రూరల్: జగిత్యాల రూరల్ మండ లం వంజరిపల్లె గ్రామానికి చెందిన మంచి నీటి బావిలో పాకూరు పేరుకుపోయి ఉం డడం కలుషిత నీటిని గ్రామ ప్రజలకు తాగడానికి సర ఫరా చేస్తున్నారని గ్రామంలో కొందరికి ఆ నీరు తాగడం ద్వారా వ్యాధుల బారిన పడు తున్నారని వంజరిపల్లె గ్రామ మంచి నీటి బావి దుస్థితి ఇలా నీరు తగ్గేదెలా..? అని ఆదివారం నాడు ప్రజాపక్షం దినపత్రిక వార్త ప్రచురించగా స్పందించిన మండల, గ్రామ అధికారులు వంజరిపల్లె గ్రామ మంచి నీటి బావిలో పేరు కుపోయిన పాకురును తీసివేసి మంచి నీటి బావిలో బ్లీచింగ్ వేయించారు. గ్రామ ప్రజలకు సురక్షితమైన నీటిని అందించేందుకు కృషి చేసిన ప్రజా పక్షం దినపత్రికకు పాత్రికేయుడికి వంజరిపల్లె గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సిద్దిపేట పోలీస్ కమిషనర్ పేరిట నకిలీ ఫేస్‌బుక్ ఖాతా

అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం..
సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు




ప్రజాపక్షం/సిద్దిపేట: సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్.రష్మి పెరుమాల్ పేరిట కొందరు గుర్తు తెలి యని వ్యక్తులు ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాను తెరి చారు. సైబర్ కేటుగాళ్లు సామాన్యులకు మొదలు కొని పోలీసు ఉన్నతాధికారులను సైతం వదల కుండ వారితో పేరుతో సైతం ఫేస్‌బుక్‌లో నకిలీ ఖాతాను తెరిచి పోలీసు అధికారులకు సవాల్ విసి రారు. ఈవిషయం సిపి దృష్టికి వెళ్లటంతో అప్రమత్తమైనారు. నకిలీ ఖాతా నుండిఎవరైన మెసేజ్ చేసి డబ్బులు అడిగిన లేదా వ్యక్తిగత సమాచారం కోరిన ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దని సూచించారు. నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్‌పై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రజలు సోషల్ మీడియాపై అప్రమత్తంగా ఉండాలని. ఇలాంటి మోసపూరిత ఖాతాల పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. నకిలీ ఖాతాపై ఇప్పటికి సైబర్ క్రైమ్ పోలీసులు నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేందుకు దర్యాప్తు జరుగుతుందన్నారు. ప్రజలు సోషల్ మీడియాలో జాగ్రత్త వహించాల న్నారు. ఎవరైన అనుమాన స్పద ఖాతాలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

## ప్రజలలో చైతన్యం, విజ్ఞానం పెంపొందించడంలో 'ప్రజాపక్షం' ముందంజ

నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించిన జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్

ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ : జగిత్యాల పట్టణంలోని పార్టీ కార్యాల యంలో జగిత్యాల జిల్లా ప్రజాపక్షం జాతీయ దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలండర్ ను జగిత్యాల శాసనసభ్యుడుడా.సంజయ్ కుమార్‌ఆ దివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే మాట్లా డుతూ ప్రాచీన కాలంనుండి వార్తాపత్రికలు సమాజంలో ముఖ్యమైన పాత్ర పోషించాయని,ఒక్క పత్రిక పదివేల సైన్యంతో సమానం అని పెద్దలు భావించేవారని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలలో సామాజిక చైతన్యం, విజ్ఞానం పెంపొందించడంలో ప్రజాపక్షం దినపత్రిక ముందుంటుందని జగిత్యాల ఎమ్మెల్యే అన్నారు. ప్రజాభిప్రాయాన్ని రూపొందించడంలోను సామాజిక బాధ్యతను గుర్తు చేయడంలో, నేటికీ పత్రికలు సమాజ నిర్మా ణంలో ఒక మూలస్తంభంగా నిలుస్తున్నాయనీ, ప్రభుత్వ విధానాలను ప్రజ లకు, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక ముఖ్యపాత్ర పోషిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం జాతీయ దినపత్రిక జగిత్యాల నియోజకవర్గ రిపోర్టర్ సంపత్ కుమార్, ప్రెస్ క్లబ్



అధ్యక్షుడుఎల్లాల రాజేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుకూరి శశిధర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కడార్ల రంజిత్ కుమార్, సంయుక్త కార్యదర్శి గాజుల మహేష్, మాజీ ఏఎంసి చైర్మన్ కొలుగూరి దామోదర్ రావు, కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, గట్టు సతీష్, పాత్రికేయులు మహేష్, సంజీవ రాజు, సంతోష్, ఇక్రమొద్దీన్, ఎల్ల క్రాంతి కుమార్, సోల మన్, శ్రీకాంత్, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికతను కొనసాగించే విధంగా అన్ని విధాలుగా సహకారం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : ఆధ్యాత్మికతను కొనసాగించే విధంగా ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని వేములవాడ శాసనసభ్యుడు ప్ర భుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మాఘమా అమావాస్య పర్వ దినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని గంగమ్మ గుడి, మడేలమ్మ గు డి, రామప్ప గుడిని దర్శించుకొని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించా రు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దర్శనార్థం ఆలయా లకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దక్షిణ కాశీగా పేరు పొందిన వేములవాడ రాజన్న, సమ్మక్క సారలమ్మలో అభివృద్ధి పనులు కొన సాగుతున్నాయని అన్నారు. ప్రజలకు కొంగు బంగారంగా ఉన్న ఈ దేవాల యాలకు ప్రత్యేకంగా నిధులు కేటాయించుకుని అభివృద్ధి పనులు చేస్తున్నా మన్నారు. చరిత్రలో మొదటిసారి సమ్మక్క సారలమ్మ దగ్గర ముఖ్యమంత్రి రే వంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర క్యాబినెట్ జరుగుతుందన్నారు. జిల్లాలో జరిగే జాతరలకు దర్శనార్థం వచ్చే భక్తులకు దర్శన భాగ్యం కలిగించి ఆయురారో గ్యాలు, సుఖ సంతోషాలు ప్రసాదించి సకాలంలో వర్షాలు కురిసి రైతులకు పంటలు పండి చల్లంగా ఉండే విధంగా దీవించమని ఆ దేవున్ని వేడుకున్నా రు. జాతర సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈయన వెంట కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్, నాగుల సత్యనా రాయణ గౌడ్, వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, కామణి వనిత నలిని కాంత్, గడ్డం నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్‌వి అసత్య ఆరోపణలు

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : జగిత్యాల పట్టణంలో నీ మోతే పార్టీ కార్యాలయంలో జగి త్యాల ఎమ్మెల్యే డా క్టర్ సంజయ్ కుమార్ ఆది వారం మీడియా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ని జగిత్యాల అభివృక్తికి నిధులు కోసం కలవగా బి.అర్.ఎస్ పార్టీ జిల్లా అ ధ్యక్షుడుఅసత్య ఆరోపణలు చేసి, కార్యకర్తలను రెచ్చగొట్టి నా ఇల్లు, హాస్పిటల్ పై ఉద్దేశపూర్వకంగా దాడి చే యించారు. నాపై జిల్లా అధ్యక్షుడిగా ఉన్న విద్యాసాగర్ రావు కనీసం నా వివరణ కూడా కోరలేదు అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు.కాంగ్రెస్ సీనియర్ నాయకు లు కాంగ్రెస్ వారి ఇంటి పార్టీ అయినట్టు ఇష్టారీతిగా మాట్లాడుతు న్నారు. ప్రభుత్వంతో కలసి జగిత్యాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న అని జగిత్యాల ఎమ్మెల్యే సంజ య్ కుమార్ స్పష్టం చేశారు. జగిత్యాల అభివృద్ధినీ ప్రజ లు చూస్తున్నారు. జగిత్యాల రాయికల్ పట్టణంలో ప్రతి వార్డులో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, రాష్ట్రం లో అత్య దిక నిధులు జగిత్యాలకు వచ్చాయి అని జగి త్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అన్నారు. నడుమంత్రపు సిరితో అహంతో మాట్లాడడం ఎప్పటికీ పనికిరాదు. డబల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోరుట్లలో ఎందుకు చేపట్టలేదొ చెప్పా లని జగిత్యాల ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కాలేజీలు ఫాం హౌస్లులు మాత్రం నిర్మించుకున్నారు అని జగిత్యాల ఎమ్మెల్యే అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుని హ యాంలో నూకపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు 2009 నుండి 14 వరకు స్థల సేకరణ, నిర్మాణం చేశా రు. కాంగ్రెస్ హయాంలో ఎందుకు ఇండ్ల నిర్మా ణం సీనియర్ నాయకులు పూర్తి చేయలేదొ చె ప్పాలన్నారు. 2014 మున్సిపల్ లో టీడీపీ జెం డా మోసిన వారికి, ఎన్నికల్లో అప్పుడే వచ్చిన వా రికి కాంగ్రెస్ టికెట్ ఎలా ఇచ్చారు మీరే చెప్పా లని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాజీ మంత్రి జీవన్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, మాజీ ఏఎంసీ చైర్మన్ కోలుగురీ దామోదర్ రా వు, సీనియర్ నాయకులు గట్టు సతీష్, అబ్దుల్ ఖాదర్ ముజాహిద్, అడువల లక్ష్మ ణ్, దుమాల రాజ్ కుమార్, శ్రీనివాస్, తిరుమలయ్య, కూసరి అనిల్, తోట మల్లికార్జున్, పద్మావతి, పవన్, బద్దం లత, వద్ది శ్రీలత, గుర్రం రాము, పంబల రాము,బోడ్ల జగదీష్, బిక్షపతి, రంగు మహేష్, కోరే గంగమల్లు, ఫుర్ఖాన్, ఫారూఖ్,శరత్ రావు,అహమ్మద్,జావేద్ నరేందర్ ,మతీన్, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

స్థానికం LOCAL NEWS

ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్

కరీంనగర్

సోమవారం 19-01-2026 www.prajapaksham.in

ప్రజాపక్షం Telugu National Daily



## కల్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణానికి సంబంధించిన ముధోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామా రావు పటేల్ కల్యాణ లక్ష్మీ,షాదీ ముబారక్ 177 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.పేద మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు వారి జీవితాల్లో మార్పు తీసుకొస్తున్నాయని అన్నారు. ముఖ్యంగా వివాహ సమయంలో ఎదురయ్యే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సహాయం అందేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు.స్థానిక నాయకులు,అధికారులు,లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 'ప్రజాపక్షం' క్యాలండర్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉండి,ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాపక్షం పత్రిక పనిచేస్తుందని ఖానాపూర్ నియోజకవర్గం కడెం మండలం న్యూ దర్మాజీపేట్ సర్పంచ్ బా సుమలత నరేష్,ఖానాపూర్ మండల ఎర్వచింతల్ పంచాయతీ కార్యదర్శి హనుమంత్ అన్నారు.ఆదివారం కడెం మండల కేంద్రంలోని పల్లె ప్రకృతి వనం ఆవరణలో వారుగ్యా దర్మాజీపేట్ గ్రామ యువకులతో కలిసి ప్రజాపక్షం 2026 క్యాలండర్ ను ఆవిష్కరించారు.ప్రజల నుంచి సమస్యలను తెల్సుకుని పరిష్కారానికి ఎల్లప్పుడు ముందుండే పత్రిక ప్రజాపక్షం అని అన్నారు.ప్రభుత్వాలకు ప్రజలకు మధ్య వారధిగా ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేయడంలో ప్రజాపక్షం పత్రిక కీలకంగా పనిచేస్తోందని పేర్కొన్నారు. హరీష్,నరేష్,మహేష్,శ్రావణ్,ఉదయ్,వంశీ పాల్గొన్నారు.

## అంగన్వాడీ,గ్రామపంచాయతీ భవనం.. నిర్మాణానికి రూ. 32 లక్షలు నిధులు

### మాజీ శాసనసభ్యులు విఠల్ రెడ్డి



**ప్రజాపక్షం/బైంసా :** కుబీర్ మండలంలోని ఓల్డ్ సావులి గ్రామానికి నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం 20 లక్షల రూపాయల నిధులు నూతన అంగన్వాడీ భవన నిర్మాణం కోసం రూ.12 లక్షల నిధులు మొత్తం 32 లక్షల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని మాజీ శాసనసభ్యులు తెలిపారు.నిధులు మంజూరు యొక్క ప్రొసీడింగ్ కాపీని గ్రామ సర్పంచ్‌కు అందజేయడం జరిగింది.నిధులు మం జూరు చేసి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ముధోల్ నియోజకవర్గం ప్రజల తరపున మాజీ శాసనసభ్యులు జి.విట్టల్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కుబేర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గోనెలు కళ్యాణ్ గ్రామ సర్పంచ్ సాయి పాల్గొన్నారు.

## భక్తులతో కిటకిటలాడిన.. బగలాముఖి శక్తిపీఠం



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట శ్రీబగలాముఖి శక్తిపీఠం మాఘ అమావాస్య పర్వదినం సందర్భంగా ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారి ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ ఆధ్వర్యంలో బగలాముఖి అమ్మవారికి మహాపూజలు నిర్వహించడం జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. శక్తిపీఠం ప్రాంగణంలో అమ్మవారికి మహామంత్రహావనము నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి ఉమ్మడి తెలుగురాష్ట్రాల ను ంచే కా ఉండా కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో శక్తిపీఠం కిటకిటలాడింది. భక్తులందరికి శక్తిపీఠం స్థలదాత పబ్బరమేష్‌గుప్తా కుటుంబీకులు అన్నదానం చేశారు. శక్తిపీఠం స్థలదాతలు పబ్బరమేష్‌గుప్తా స్వరూపదంపతులు, తాజా మాజీ జడ్పీటీసీ పబ్బమహేశ్‌గుప్తా స్వాతి దంపతులు, గర్భగుడి నిర్మాణదాతలు బోలా నర్సింగరావు, మీన దంపతులు, సర్పంచ్ వెంకటేశ్వర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు ప్రభుత్వ.. గొప్పతనానికి నిదర్శనం

### బాల్కొండ కాంగ్రెస్ ఇన్‌చార్జి సునీల్ రెడ్డి

**ప్రజాపక్షం/మోర్తాడ్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ప్రజా ప్రభుత్వ గొప్పతనానికి నిదర్శనమని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ధర్మోర గ్రామంలో మద్దికుంట భాగ్యలక్ష్మి సాయిరాం నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమంలో సునీల్ రెడ్డి పాల్గొని, మాట్లాడారు. ఇందిరమ్మ ఇల్లు ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. సొంత ఇంటిని నిర్మించుకోవాలనుకున్న వారి కల ప్రజా ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చే భాద్యతను ప్రజా ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి, ఉప సర్పంచి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏడుపాయలకు వెల్లువెత్తిన భక్తులు



**ప్రజాపక్షం/పాపన్నపేట:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల వనదుర్గామాత సన్నిధిలో మాఘ అమావాస్య పర్వదినం సందర్భంగా లక్షలాదిగా భక్తులు తరలివచ్చి మంజీరా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఆదివారం సెలవు దినంతోపాటు మాఘ అమావాస్య కలిసి రావడంతో ఏడుపాయల వనమంతా జనముతో కిక్కిరిసి పోయింది. వెకువ జామున నే పూజారులు అమ్మవారిని ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి వివిధ పూజలు నిర్వహించి దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు స్నానాలాచరించేందుకు కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు, హైదరాబాద్, తదితర ప్రాంతాలకు చెందిన లక్షలాదిగా భక్తులు తరలి వచ్చి మంజీరాలో పుణ్యస్నానాలా చరించారు. ఏడుపాయల మంజీరాలో పుణ్యస్నానాలు ఆచరిస్తే సకల పాపాలు తొలగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం, దీనితో భక్తుల రద్దీ అమాంతంగా పెరిగిపోయింది. క్యూ లైన్ లలో భక్తులు గంటల తరబడి నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. మరి కొందరు అమ్మవారికి భక్తులు ఓడి బియ్యం, తల నీలాలు సమర్పించారు. సంతానం లేని భక్తులు సంతాన గుండంలో స్నానాలాచరిస్తూ తమతమ మొక్కలు చెల్లించుకున్నారు. మరి కొంత మంది భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాల ముందు డప్పు చప్పుళ్లతో నృత్యాలు చేశారు.ఏడుపాయల మాఘ స్నానాలకు వచ్చిన నాలుగు చక్రాల వాహన దారులకు తిప్పలు తప్పలేదు. వాహనాలును పార్కింగ్ స్థలం నుండి కిలోమీటర్ మేర నిలుపుదల చేసి కాలినడక ఆలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పార్కింగ్ స్థలం నుండి ఆలయ ప్రాంతంలోకి ఉచిత మినీ బస్సులు, కానీ ఆటోలు కానీ దేవస్థానం వారు ఏర్పాటు చేయవలసి ఉంది. పార్కింగ్ స్థలాల నుండి ఉచిత వాహనాలను ఏర్పాటు చేయకపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు.

### ప్రత్యేక దర్శనం టికెట్ భక్తులకు శట గోపం

ప్రత్యేక దర్శనం కోసం దేవాదాయ శాఖ అధికారులు దర్శనం టికెట్ ధరను ఇష్టారీతిన పెంచడం తో అమ్మవారి దర్శనం కోసం విచ్చేసిన భక్తులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ప్రతి రోజు ప్రత్యేక దర్శనం టికెట్ ధర 100 రూపాయలు కాగా ఉత్సవాల సందర్భంగా 250, 500 రూపాయల ప్రత్యేక దర్శనాలు పెట్టీ 500 దర్శనం వారికి ఆలయం ముందు ఆశీర్వచనంతోపాటు ఓ 20రూపాయల కండువాను కప్పి చేతిలో ఓ లడ్డును పెట్టీ భక్తుల భక్తిని సొమ్ము చేసుకున్నారు.మాఘ స్నానాల కోసం ఏర్పాటు చేసిన షవర్ బాత్‌లు ఉత్సావ విగ్రహాలను తలపించాయి. ఆలయ ముందు ఉన్న మంజీరా పాయ వద్ద జల్లు స్నానాల షవర్ బాత్ ఏర్పాటు చేయకపోవడంతో ఆలయం వద్ద స్నానాలు ఆచరించడానికి ఇబ్బందులు పడ్డారు.



### 250మంది పోలీసులతో బందోబస్తు

ఏడుపాయలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా, మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, ఆధ్వర్యంలో సుమారు 250మంది పోలీసులతో, పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టిబందోబస్తు నిర్వహించారు. ప్రసాదం తయారీలో భక్తులను క్యూ లైన్ లో త్వర త్వరగా పంపడానికి అన్నమయ్య సేవాసమితి చెందిన 40 మంది మహిళా సభ్యులు భక్తులకు సేవలందించారు. ఆలయ సిబ్బంది సూర్య శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, బ్రహ్మం, శ్రీనివాస్ శర్మ, రాజు, నరేష్, మహేష్, రమేష్, బలరాం, నర్సింలు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతే లక్ష్యం,నిబంధనలు పాటిస్తే ప్రాణాలు సురక్షితం

### జిల్లా ఎస్పి జానకి షర్మిల




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన''అరైవ్ అలైవ్'' రోడ్ సేఫ్టీ కార్యక్రమం నిర్మల్ జిల్లాలో అత్యంత ప్రాధాన్యతతో కొనసాగుతోంది.ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం రోజును జిల్లా వ్యాప్తంగా 'ప్రమాదకర ప్రాంతాల అవగాహన దినం'(బ్లాక్ స్పాట్స్ డే)గా నిర్వహించారు.జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు ,సిబ్బంది జిల్లాలోని జాతీయ రహదారులు, ప్రధాన రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను సందర్శించారు.ఈ సందర్భంగా పోలీసులు క్షేత్రస్థాయిలో పర్యటించి, ఆయా ప్రాంతాల్లో గతంలో జరిగిన ప్రమాదాల సరళిని పరిశీలించడమే కాకుండా,స్థానిక ప్రజలు,ప్రయాణికులతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలు కేవలం ఒక వ్యక్తి మరణానికే పరిమితం కాకుండా,ఒక కుటుంబం మొత్తాన్ని ఆర్థికంగా,మానసిక శోకంలోకి నెట్టేస్తాయని ఎస్పీ ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యంగా మద్యం సేవించి వాహనం నడపడం ,డ్రైవింగ్ చేస్తూ సెల్ ఫోన్ మాట్లాడటం,అతివేగం ప్రాణాలకు ముప్పు కలిగిస్తాయని, యువత బాధ్యతగా వ్యవహరించి తమ తల్లిదండ్రుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకోవాలని కో రారు.జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు జిల్లా యంత్రాంగం శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని ఎస్పీ వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని ప్రమా ద రహిత జిల్లాగా నిర్మల్ ను తీర్చిదిద్దుతామని ప్రతిజ్ఞ చేశారు.

## గ్రామస్థాయిలో క్రీడలకు ప్రోత్సాహం

### ఎమ్మెల్యే వాకిటి సునీత లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/కొల్చారం:** క్రీడలు స్నేహభావంతో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని నర్సాపూర్ శాసనసభ్యురాలు వాకిటి సునీతా లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో నిర్వహించిన కేపీఎల్ సీజన్ 2 ఫైనల్ విజేతలకు బహుమతి ప్రధానం చేశారు. గ్రామస్థాయిలో క్రీడలకు పెద్దల ప్రోత్సాహం చాలా అవసరమని అన్నారు. పండగ వాతావరణం లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం గ్రామానికి చేరుకొని యువకులందరూ గ్రామంలో ఒక తాటిపై చేరి స్నేహపూర్వకంగా క్రీడా పోటీలలో పాల్గొనడం శుభసూచకమని అన్నారు. యువకులు గ్రామంలో కలివిడిగా ఉండి ఇతరులకు వారికి తోచిన సహాయ సహకారాలు అందించి ముందుకు వెళ్ళినట్లయితే రాజకీయంగా ఎదుగుదలకు తోడ్పడుతుందని అన్నారు. ఫైనల్ విన్నర్ విజేతకు గ్రామ సర్పంచ్ మోత్కు నిర్మల మల్లేశం సాకారంతో 15వేల రూపాయల బహుమతి ప్రధానం రన్నర్ విజేతకు గ్రామ యువ నాయకుడు బిఆర్ఎస్ పార్టీ మండల యువత విభాగం అధ్యక్షులు తూనిక పల్లి సంతోష్ రావు సహకారంతో పదివేల రూపాయలు బహుమతి ప్రధానం తో పాటు విన్నర్ రన్నర్ కప్స్ మెమెంటోలు గోల్డ్ సిల్వర్ మెడల్స్ ప్రోత్సాహ బహుమతిని అందజేశారు. నాయకులు పాశం శ్రీనివాస్ రెడ్డి, సంగయ్యపేట్ సర్పంచ్ ప్రభాకర్ ముత్యం గారి సంతోష్ కుమార్, గ్రామస్తులు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## జాతర ఉత్సవాలను ప్రారంభించిన : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/శివ్వంపేట :** సికింద్లాపూర్ శ్రీలక్ష్మి నర్సింహాస్వామి ఆశీస్సులతో ప్రతీఒక్కరు సుఖసంతోషాలతో, ఆనందంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. ప్రతియేటా ధనుర్మాసం మొదలు ఉగాది పండగ వరకు మూడు నెలల పాటు ప్రతి ఆదివారం జాతర ఉత్సవాలు జరుగనుండగా ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి జాతర ఉత్సవాలను ప్రారంభించి స్వామివారికి అధికారికంగా పట్టువస్త్రాలను సమర్పించారు. నర్సాపూర్ నియోజకవర్గంతో ఉమ్మడి మెదక్ జిల్లా , రాష్ట్రమంతా మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్టు ఆమె అన్నారు.హనుమంతరెడ్డి, మహిపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 'జాన్కంపేట్‌లో' అధ్వాన్నంగా మారిన నిజాంసాగర్ కెనాల్

**ప్రజాపక్షం/ఎడపల్లిః** ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ గ్రామంలో జనాల నిర్లక్ష్యం వల్ల పారిశుద్ధ్యం లోపం కొట్టొచ్చినట్లు కనబడుతుంది. గ్రామం గుండా వె ళ్లే నిజాంసాగర్ డి50 కెనాల్ ప్రస్తుతం కాలువలా కాకుండా ఓ డంపింగ్ యార్డును తలపిస్తుంది. గ్రామస్తులు తమ ఇళ్లలోని చెత్తాచెదారాన్ని ప్లాస్టిక్ వ్యర్థాలను నేరుగా కాలువలో పారవేయడంతో ఈ పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం సాగునీటి అవసరాల కోసం నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. అయితే కాలువలో పేరుకుపోయిన చెత్త ఆ నీటితో పాటు కొట్టుకువచ్చి తమ పంట పొలాల్లో చేరుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల సాగునీటి ప్రవాహానికి అడ్డంకులు కలగడమే కాకుండా పొలాలు మురికిమయమై పంట దిగుబడికి ప్రభావం చూపుతుందని వారు ఆందోళన చెందుతున్నారు. అలాగే మరోవైపు



గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. పాఠశాల వెనుక భాగంలో ప్రహరి గోడకు ఆనుకుని ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ప్రజలు చెత్త కుండీగా మార్చేశారు. కుళ్లిపోయిన కూరగాయా లు, వాడి పారేసిన ప్లాస్టిక్ సంచులు, నిల్వ ఉన్న వ్య ర్థాలు పారవేయడంతో వీటి వల్ల వెలువడుతున్న విపరీతమైన దుర్గంధంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తరగతి గదులో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని, పాఠశాల పరిసరాల్లో చెత్త వేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. డస్ట్‌బిన్లు లేదా డంపింగ్ యార్డు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని పంచాయతీ సిబ్బంది కోరుతున్నారు.

## ఎస్ఐఎస్ఎఫ్ 2026కు అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/ సంగారెడ్డి :** దక్షిణ భారతదేశంలో విద్యార్థుల శాస్త్రీయ ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశ్యంతో నిర్వహించనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2026కు సంబందించిన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. ఈ నెల 19 నుంచి 23 వరకు రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో ఈ సైన్స్ ఫెయిర్ ను ఘనంగా నిర్వహించన్నుట్లు ఆమె వెల్లడించారు. దక్షిణ భారతదేశానికి చెందిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ,తమిళనాడు, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి ఎంపికైన 210 నూతన శాస్త్రీయ ఆవిష్కరణలు ఈ సైన్స్ పెయిర్‌లో ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బాల శాస్త్రవేత్తలు తమ ప్రతిభను చాటిచెప్పేలా 210 ఎగ్జిబిట్స్ తో పాటు ఎన్‌జిఓల ద్వారా 40 సైన్స్ స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సైన్స్ ఫెయిర్ ను జనవరి 19న (సోమవా రం) ఉదయం 10 గంటలకు రాష్ట్ర మంత్రులు ,ప్రజాప్రతినిదులు ,ఉన్నత స్థాయి అధికారులు అ ధికారికంగా ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. సైన్స్ ఫెయిర్‌ను పకడ్బందీ ఏర్పాట్లతో భద్రత ,వసతులు ,సందర్శకుల సౌకర్యాల పరంగా అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు సందర్శకులకు ప్రవేశం కల్పించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు ,తల్లిదండ్రులు ,మీడియా ప్రతినిధులు ,ప్రజలు ప్రత్యక్షంగా తిలకించి ప్రొత్సహించాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## గర్భిణిలకు, బాలింతలకు '102 వాహనం'

### జిల్లా ప్రాజెక్టు మేనేజర్ జనార్ధన్

**ప్రజాపక్షం/బైంసా :** బైంసా డివిజన్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో 102 వాహనం బాలింతలకు వరమని ప్రాజెక్ట్ జనార్ధన్ అన్నారు.బైంసా పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో 102 వాహనాన్ని పరిశీలించారు.గర్భిణీ దశ నుంచి బాలింత వరకు అప్రామత్తంగా ఉంటూ దవాఖానాల్లో వైద్య సేవలు పొందుతున్నారు.మధ్యతరగతి వారితో పాటు ఆర్థికంగా ఉన్నవారు కూడా సొంత లేదా దేవానాలను ఆశ్రయిస్తారు సామాన్య నిరుపేద కుటుంబలా గర్భిణీలు దూరప్రాంతంలో ఉన్న దవాఖానాలకు వెళ్లడానికి అవస్థలు పడుతుంటారు చాలా మంది గర్భిణీలు హాస్పిటల్ లో ఉండలేక ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర సర్కారు అమ్మ ఒడి పేరిట 102 అంబులెన్స్ తెలంగాణ రాష్ట్ర ప్ర భుత్వం ప్రవేశపెట్టిందని వెల్లడించారు.ఒక కాల్ చేస్తే బాలింతలను దవఖానాలకు తీసుకెళ్లి అనంతరం ఇంటి వద్ద దింపుతున్నారు.102 వాహనాలు పైసా ఖర్చు లేకుండా సేవ చేస్తూ బాలింతలకు ప్రతి రోజు వారి వారి గ్రామాల్లోకి వెళ్లి తీసుకువచ్చి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చెకప్ చేయించి మళ్లీ తిరిగి గమ్య స్థానాలకు చేర్పిస్తున్నారు.ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి నష్టపోతున్న పే ద ప్రజలకు ప్రభుత్వం పరంగా సమకూర్చిన 102 వాహనం ఎంతో సౌకర్యవంతంగా ఉం టుంది కావున గర్భిణీ స్త్రీలను ప్రెస్వమ అనంతరం తల్లి బిడ్డలను వారి ఇంటికి తీసుకెళ్తున్నారు.ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 102 వాహనాన్ని ఉపయోగించాలని ప్రాజెక్ట్ మేనేజర్ జనార్ధన్ కోరారు.

# నిర్మల్ మున్సి'పోరు'... కాంగ్రెస్‌లో ముదిరిన వర్గపోరు

### మహిళా రిజర్వేషన్‌తో మారిన సమీకరణాలు!

### కమలం కన్ను,మజ్లిస్ స్కెచ్‌తో ఉత్కంఠ.. మహిళా అభ్యర్థుల కోసం వేట

**ప్రజాపక్షం/నిర్మల్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగడంతో నిర్మల్ పట్టణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి.దశాబ్దాలుగా ఇ క్కడ సాగుతున్న రాజకీయాలు ఒక ఎత్తు అయితే,ఈసారి జరగబోయే 'పుర' పోరు మరో ఎత్తు అన్నట్లుగా పరిస్థితి కనిపిస్తోం ది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు,వర్గపోరు ఆపార్టీకి పెద్ద సవాలుగా మారాయి. పార్టీ లో ప్రస్తుతం మూడు ప్రధాన వర్గాలు పోటాపోటీగా రాజకీయాలు నడుపుతున్నాయిము గ్గురు కీలక నేతలు ఎవరికీ వారు తమ అనుచరులకే వార్డు టికెట్లు కేటాయించాలని పట్టుబడుతుండటంతో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ సంక్లిష్ట సమస్యగా తయారైంది.

### మహిళా రిజర్వేషన్ల ఆశావహుల కలవరం

తాజాగా మున్సిపల్ రిజర్వేషన్లు ఖరారు కావడంతో స్థానిక రాజకీయాల్లో పెను మార్పులు సంభవించాయి. నిర్మల్ మున్సిపాలిటీలో మహిళలకు 50 శాతం కోటా అమలు చేయడంతో పాటు,కీలకమైన వార్డులు మహిళలకు రిజర్వ్ కావడంతో పురుష నేతల్లో ఆయోమయం మొదలైంది.ఇన్నాళ్లు క్షేత్రస్థాయిలో కష్టపడిన పురుష ఆశావహులు తమ పట్టున్న వార్డులను వదులుకోవాల్సి వస్తోంది.ఈ క్రమంలో గెలుపు గుర్రాలైన మహిళా అభ్యర్థుల కోసం పార్టీల్లో వేట మొదలైంది.చాలా మంది నే తలు తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి తమ భార్యలను లేదా కుటుంబ సభ్యులను రంగంలోకి దిం చేందుకు ప్రయత్నిస్తుండగా,ఇది కార్యకర్తల్లో అస ంతృప్తికి దారితీస్తోంది.అభ్యర్థి ఎంపికలో ఏకాభిప్రాయం కుదరకపోతే రెబల్స్ బెడద తప్పదనిహెచ్చరిస్తున్నారు.




### బిజెపి వ్యూహం మజ్లిస్ స్కెచ్


కాంగ్రెస్‌లోని ఈ రాజకీయ అనిశ్చితిని తమకు అనుకూలంగా మార్చుకోవాలని భారతీయ జనతా పార్టీ సర్వశక్తులు ఒడ్డుతోంది.నిర్మల్ మున్సిపాలిటీపై దాదాపు మూడు దశాబ్దాల తర్వాత మళ్ళీ కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పంతంతో ఉన్నారు.హిందుత్వ కార్డుతో పాటు,ప్రధాని మోదీ ఇమేజ్‌ను నమ్ముకుని బీజేపీ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది.కాంగ్రెస్‌లో చీలిక వస్తే ఆ ఓట్లన్నీ తమకే మళ్లుతాయని,తద్వారా అధికారం చేపట్టవచ్చని బీజేపీ వ్యూహకర్తలు అంచనా వేస్తున్నారు.మరోవైపు మజ్లీస్ పార్టీ(ఎంఐఎం) కూడా తనదైన శైలిలో నిశ్శబ్దంగా పావులు కదుపుతోంది.మైనారిటీ ఓటర్లు అధికంగా ఉన్న 8 నుండి 12 వార్డులను కైవసం చేసుకుని, మున్సిపల్ చైర్మన్ ఎన్నికలో'కింగ్ మేకర్' పాత్ర పోషించాలని ఎంఐఎం స్కెచ్ వేస్తోంది.అటు కాంగ్రెస్,ఇటు బీజేపీల మధ్య ఓట్లు చీలితే ఆ ప్రభావంఅనుకూలంగా మారుతుందని వారి అంచనా.

### అధిష్టానం కసరత్తుపైకార్యకర్తల ఆందోళన


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల నిర్మల్ పర్యటన ద్వారా పార్టీ శ్రేణుల్లో సమన్వయం పెంచేందుకు ప్రయత్నించినప్పటికీ,నాయకుల మధ్య ఉన్న మనస్పర్థలు ఇంకా సమసిపోలేదని క్షేత్రస్థాయి పరిస్థితులు చెబుతున్నాయి.అధికారంలో ఉండి కూడా మున్సిపల్ పీఠాన్ని దక్కించుకోలేకపోతే,ఆ ప్ర భావం రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయిలో నేతల ప్రాధాన్యతపై కూడా పడే అవకాశం ఉంది.ఏది ఏమైనా,వర్గపోరు,రిజర్వేషన్ల గందరగోళం,ప్రత్యర్థుల ఎత్తుగడల మధ్య నిర్మల్ మున్సిపల్ ఎన్నికలు ఇప్పుడు ఉత్కంఠభరితంగా మా రాయి.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
సోమవారం
19-01-2026
www.prajapaksham.in

సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ సందర్భంగా ఖమ్మంలో మూడు ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన జనసేవాదళ్ కార్యకర్తలు  ఖమ్మం పుర వీధుల్లో కదం తొక్కారు. ప్రదర్శన రెండు కిలో మీటర్ల మేర ఉండడంతో పెద్ద సంఖ్యలో పౌరులు తిలకించారు. ముఖ్యంగా యువ మహిళల కవాతు ఆకట్టుకుంది. చిన్నారులు కదం తొక్కుతూ లెఫ్ట్ రైట్ అంటూ నడుస్తూ ఉత్తేజాన్ని ఇచ్చారు. పదేళ్ల లోపు బాలలు సైతం ప్రదర్శనలో పాల్గొని భవిష్యత్తు తరం మాదేనంటూ మరో వందేళ్లయినా కమ్యూనిస్టు పార్టీకి ఢోకా లేదని తమ కవాతుతో నిరూపించారు.



# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు బహిరంగ సభ, ప్రదర్శన దృశ్యాలు






ఫోటోలు
కె.అనిల్‌కుమార్






































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com